అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

గురువారం 24-10-2019

సంపుటి : 5 | సంచిక : 297 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు | వెల : 6.50




## జనం చస్తున్నా.. పట్టదా..!



**విషజ్వరాలపై హైకోర్టు ఆగ్రహం..**


- నివారణ చర్యలు తీసుకోకుండా ఏం చేస్తున్నారు?
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా ఉన్నతాధికారులపై సీరియస్
- నేడు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని ఆదేశం

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

డెంగీ, మలేరియా, చికున్‌గునియా వంటి విషజ్వరాలతో ప్రజల ప్రాణాలు పోతుంటే..సర్కారుకు పట్టదా... నివారణ చర్యలు తీసుకోకుండా అధికారులేం చేస్తున్నారని హైకోర్టు నిలదీసింది. ఇప్పటికే ఒక జిల్లా జడ్జి డెంగీతో బాధపడుతూ మరణించారనీ, జనం ప్రజలు కూడా రోగాలతో సతమతమవుతుంటే సర్కార్ మాత్రం తమకేమీ పట్టనట్లుగా ఉన్నదని హైకోర్టు వ్యాఖ్యానించింది. గురువారం ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, మెడికల్ అండ్ హెల్త్ ముఖ్య కార్యదర్శి,



డైరెక్టర్, జీహెచ్‌ఎంసీ కమీషనర్ స్వయంగా కోర్టుకు వచ్చి వివరణ ఇవ్వాలని ఆదేశించింది. నెల రోజుల్లోగా కట్టుదిట్టమైన చర్యలతో విషజ్వరాలను అంతం చేయాలని గతంలో ఆదేశించినా అమలు కాకపోవడానికి కారణాలు చెప్పాలని కోరింది. జనం రోగాలతో బాధపడుతుంటే సీరియస్‌గా స్పందించాల్సి వస్తుందనీ, ఇప్పటికే ఒక జడ్జి డెంగీ కారణంగా మరణించారని గుర్తు ...9లో






హైదరాబాద్‌లో..

మాట్లాడుతున్న తమ్మినేని..

## దేశానికి పట్టిన పీడ..

# ప్రయివేటీకరణ

19వ రోజు

## ఆర్టీసీని కాపాడుకుందాం..

**సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం**

- కేసీఆర్ కన్నా ముందే యూనియన్లు పుట్టాయి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి
- 26 డిమాండ్లపై చర్చలు జరపాలి : అశ్వత్థామరెడ్డి

**నవతెలంగాణ - హైదరాబాద్/చాదర్‌ఘాట్**

ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణ అనేది దేశానికి పట్టిన పీడ అని, ఆర్టీసీని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం కార్మికుల కోసం కాదని, ప్రజా రవాణాను కాపాడుకోవడం కోసమని చెప్పారు. బుధవారం హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్‌లో ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో వంటావార్పు, సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. గతంలో ఆర్టీసీలో ఒక యూనియన్ సమ్మె చేస్తే మరో యూనియన్ డబుల్ డ్యూటీలు చేసేదని, కానీ, ప్రస్తుతం యూనియన్లన్నీ సమ్మెలో పాల్గొనడంతో పోలీసులు డబుల్ డ్యూటీ చేస్తున్నారని అన్నారు. కార్మికుల్లో పట్టుదల, ఐక్యత మెండుగా ఉన్నాయని, ప్రజల నుంచి మద్దతు పుష్కలంగా లభిస్తున్నదని, 19 రోజులుగా సమ్మె చేస్తున్నా ఏ ...9లో

## నామ్‌కే వాస్తే..

**హోంశాఖ ముఖ్య కార్యదర్శి బదిలీ**

- జేఏసీని పిలవాలా.. వద్దా.. అని మీమాంస
- ప్రగతిభవన్ నుంచే నివేదికకు దిశానిర్దేశం?
- చర్చలకు ఆహ్వానం రాలేదు-టీఎస్ఆర్టీసీ జేఏసీ

**ఈడీల కమిటీ భేటీ**

- 21 డిమాండ్ల పరిశీలన

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

కొండను తవ్వి...ఎలుకను కూడా పట్టే పరిస్థితి కనిపించట్లేదు. ఆర్టీసీ కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేయడం కోసం ప్రభుత్వం ఎన్ని ఎత్తుగడలు వేస్తున్నా, అవి ఫలించట్లేదు. బుధవారం నాటికి సమ్మె ప్రారంభమై 19 రోజులు అవుతున్నది. హైకోర్టు అక్షింతలతో ఓ మెట్టు దిగిన సర్కారు టీఎస్ఆర్టీసీలోని ఆరుగురు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో కమిటీ వేసిన విషయం తెలిసిందే. ఈడీ (అడ్మిన్) వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఈ కమిటీ బుధవారం సమావేశమైంది. హైకోర్టు సూచించిన ఆర్థిక భారాలు లేని 21 డిమాండ్లను ఈ కమిటీ పరిశీలించింది. కాకపోతే ఈ భేటీ నామ్‌కేవాస్తేగా సాగినట్టు సమాచారం. ఆయా డిమాండ్ల కాపీలను ముందు పెట్టుకొని.. ఏంచేద్దాం అని వారిలో వారే సమాలోచనలు చేసుకున్నట్టు తెలిసింది. ఆర్టీసీ కార్మికులతో ముడిపడి ఉన్న డిమాండ్లలో వారి ప్రమేయం లేకుండా నివేదిక ఏం ఇవ్వాలి అనే దానిపై కమిటీ సభ్యులు తర్జనభర్జన పడినట్టు తెలిసింది. అయితే నివేదికను ఎలా రూపొందించాలి అనే అంశంపై ప్రగతిభవన్ ...9లో




## 25న దీపావళి బోనస్ చెల్లింపు

**కార్మిక సంఘాల ఆందోళనతో దిగొచ్చిన యాజమాన్యం**

**నవతెలంగాణ-సింగరేణిప్రతినిధి**

సింగరేణి కార్మికులకు బోనస్ చెల్లించే విషయమై యాజమాన్యం దొగిచ్చింది. పిఎల్ఆర్ (ప్రాఫిట్ లింకుడ్ రివార్డు) బోనస్‌ను కార్మికులు, కార్మిక సంఘాల ఆందోళనల ఫలితంగా ఈ నెల 25న చెల్లించడానికి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసింది. జెబిసిపిఐ-19వ వేతన ఒప్పందంలో భాగంగా దీపావళి ముందు సింగరేణిలో, దసరా మందు కోలిండియా బొగ్గు సంస్థల్లో పనిచేసే కార్మికులకు బోనస్ చెల్లించే ఆనవాయితీ ఉంది. దీపావళి పండుగకు కనీసం వారం రోజుల ముందు సింగరేణి కార్మికులకు పి.ఎల్.ఆర్ బోనస్ చెల్లింపులు జరిగేవి. పండుగకు నాలుగు రోజుల వరకు ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో కార్మిక సంఘాలు, కార్మికులు ఆందోళన బాట పట్టారు. పైగా ఆర్థిక ఇబ్బందుల వల్ల బోనస్ చెల్లించలేకపోతున్నామని ...9లో

## పాలకులు శ్రద్ధ పెట్టి ఉంటే...

**ఆర్టీసీకి నష్టాలే రావు...**

- ప్రభుత్వం తన వంతుగా ఇవ్వాల్సిందే ఇవ్వటం లేదు..
- ఆర్థిక భారాన్ని పెంచుతున్న డీజిల్‌పై పన్ను : 2005 నాటి ఐఐఎం-బెంగుళూరు అధ్యయనంలో వెల్లడి

వివరాలు 9లో

## మరో డ్రైవర్ గుండె ఆగింది



**రంగారెడ్డి జిల్లా యాచారంలో ఘటన**

**జీతం రాలేదని మహిళా కండక్టర్ ఆత్మహత్యాయత్నం**

వివరాలు 9లో

## హుజూర్‌నగర్‌లో గెలుపెవరిది?

**నేడు కౌంటింగ్**

**నవతెలంగాణ- మఠంపల్లి**

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ఉప ఎన్నికపై ఉత్కంఠ కొనసాగుతున్నది. ఓట్ల లెక్కింపు గురువారం జరగ నుంది. ఆ తరువాత గంటల వ్యవధిలోనే ఫలితం కూడా వెలువడనుంది. ఈ ఫలితం కోసం రాష్ట్ర ప్రజానీకం ఉత్కంఠగా ఎదురు చూస్తోంది. గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉప ఎన్నిక కౌంటింగ్ కోసం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ పరిసరాల్లో 144 సెక్షన్ విధించారు. ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం కానుంది. మొత్తం 22 రౌండ్లలో ఈవీఎంల లెక్కింపు నిర్వహించనున్నారు. ఒక్కో రౌండ్‌కు 14 టేబుల్స్ ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్‌కు మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్ ఉంటారు. మధ్యాహ్నం 2గంటల లోపే ఫలితంపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

## రైతు ఆత్మహత్యాయత్నం

**హైదరాబాద్ బోయినపల్లి మార్కెట్ వద్ద రైతుల ఆందోళన**

- హమాలీలు, కమీషన్ ఏజెంట్ల వల్ల ఎకరాకు రూ.12వేల నష్టం
- వారం రోజుల్లో పరిష్కరిస్తామన్న మంత్రి

**నవతెలంగాణ-కంటోన్మెంట్**

హమాలీలు, కమీషన్ ఏజెంట్ల వల్ల నష్టపోతున్నామని హైదరాబాద్‌లోని బోయినపల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద బుధవారం ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. కమీషన్ ఏజెంట్లు, హమాలీలకు మార్కెట్ అధికారులు కొమ్ముకాస్తూ తమను ఇబ్బందుల పాలు చేస్తున్నారని రైతులు బైటాయించారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. బోయినపల్లి వ్యవసాయ మార్కెట్‌లో మార్కెటింగ్



అధికారులకు కాటన్ సీజన్‌పై శిక్షణా శిబిరం ఏర్పాటు చేశారు. దీనికి వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి హాజరయ్యారని ...9లో

## జూరాలలో 33 గేట్లు ఎత్తివేత



జూరాల గేట్లు ఎత్తిన దృశ్యం

వివరాలు 9లో

# ఆహారం ఔషధమూ కల్తీ..

## రాష్ట్రంలో పరిస్థితి అధ్వానం



29వ రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణలో అవినీతికి పాల్పడితే ఎంతటి వారినైనా వదలిపెట్టమని సీఎం కేసీఆర్ హెచ్చరికలు చేస్తున్నారు. కానీ నూతనరాష్ట్రంలో మనం తినే ఆహారం ఎంతవరకు సురక్షితం..?పసిబిడ్డలు తాగే పాలల్లో ఏమున్నది.? కేంద్రప్రభుత్వ దర్యాప్తు సంస్థల్లో వెలుగుచూసిన కఠోరవాస్తవాలేంటీ..?

## తెలంగాణలోనే ఎక్కువ కేసులు : ఎన్సీఆర్బీ



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

దేశంలోనే తెలంగాణ నెంబర్‌వన్‌గా నిలిచిందని టీఆర్ఎస్ సర్కార్ ఒక వైపు ప్రచారం చేసుకుంటుంటే ..ఇక్కడి జనం ఆరోగ్యం గురించి సర్కార్ ఏమాత్రమైనా పట్టించుకుంటుందా..? అంటే అందుకు భిన్నంగా వచ్చిన రిపోర్టులే తెటతెల్లం చేస్తున్నాయి. మార్కెట్‌లో విక్రయించే ఉప్పు,.పప్పులు సహా అన్నీ కల్తీవేనని రెండు రిపోర్టుల్లోనూ నిర్ధారించాయి. ఎందెందు వెతికినా..అందుందునా కల్తీనే. ఈ విషయాలను ఇటీవల ఫుడ్ సెఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) బహిర్గతం చేస్తే..తాజాగా నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) నివేదికలోనూ వెల్లడించింది. కల్తీలో రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని నివేదికలో వెల్లడైంది. 2017 ఏడాదికి గాను ఆహారం, ఔషధాల కల్తీ రాష్ట్రంలో పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నట్టు గుర్తించారు. ఆయా రాష్ట్రాల కన్నా ఇక్కడ ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. ఐపీసీ 272, 276 సెక్షన్ల కింద ఏడాది కాలంలో 2009 కేసులు నమోదు చేశారు. 19 మెట్రోపాలిటన్ నగరాలకుగాను హైదరాబాద్ లో ఎక్కువగా ఉన్నాయి. నగరంలో అత్యధికంగా 45 కల్తీ కేసులు ...9లో


epaper.navatelangana.com

సంపాదకీయం

# ఆర్టీసీ చర్చలు


అప్రతిహతంగా కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మె ఐక్యతకు నిదర్శనం. ఆ ఐక్యతే నేడు ప్రభుత్వం దిగిరావడానికి ఊతమిచ్చింది. ఎట్టకేలకు హైకోర్టు ఆదేశాలతో చర్చలకు సర్కారు సమాయత్తమైంది. ఆరుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక కమిటీని నియమించడం చర్చలకు తొలిచర్య. రాజకీయ పార్టీలు, కేంద్ర కార్మిక సంఘాల మద్దతు, అండతో నడుస్తున్న ఆర్టీసీ కార్మికుల సమ్మెను పరిష్కరించాల్సిన బాధ్యత సర్కారుదేనని హైకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఒక మెట్టు దిగింది. మంగళవారం సుదీర్ఘ సమీక్షానంతరం ముఖ్యమంత్రి ఐదుగురు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ఒక ఆర్థిక సలహాదారుతో కూడిన కమిటీని నియమిస్తూ ఆదేశించారు. కాగా హైకోర్టు చెప్పిన కార్మికుల డిమాండ్లను పరిశీలించాలంటూనే, విలీనం డిమాండ్ ఉపసంహరించుకున్నారని మెలికపెట్టడం ప్రభుత్వ తెంపరితనానికి రుజువు. సమస్యల పరిష్కారంలో ఇటు కార్మికులు, అటు ప్రభుత్వం పట్టువిడుపులు ప్రదర్శించాల్సిన సమయమిది. అహం విడనాడి చర్చలను ఫలవంతం చేసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. సర్కారు నుంచి కార్మికుల పట్ల ఏమాత్రం సానుకూలత వ్యక్తమవుతుందో కొద్దిరోజుల్లో తేలిపోనుంది. చర్చలకు అనువైన వాతావరణాన్ని కల్పించి, సామరస్యంగా సమస్యలను కొలిక్కితేవాల్సిన టీఆర్ఎస్ సర్కారు, స్వయంగా కార్మికులే విలీనం డిమాండ్ వదులుకున్నారంటూ చర్చల అంకురార్పణకు ముందే అడ్డుపుల్ల వేసింది. చర్చల సంగతి ఇతమిద్దంగా తేలకపోయినా, ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులూ మార్గదర్శకాలూ అమలుచేయక తప్పని పరిస్థితుల్లో కేసీఆర్ సర్కారు ఉన్నది. ఇదిలా వుండగా ప్రభుత్వం ఆర్టీసీని ప్రయివేటీకరించే చర్యల్ని కొనసాగిస్తూనే ఉన్నది. ఇందుకు అద్దెబస్సుల నోటిఫికేషన్లే సాక్ష్యం.

ప్రగతిభవన్ గేట్లు మామూలు ప్రజలతోపాటు రాజకీయ పార్టీల నేతలూ ఇతరులకూ తెరుచుకోవు. కేవలం సీఎం కేసీఆర్ వందిమాగదులకు తప్ప. ఇవన్నీ ఎవరికి చెప్పుకోవాలి? చివరికి ఆర్టీసీ జేఏసీ కూడా ముఖ్యమంత్రి అపాయింట్‌మెంటు కోసం ప్రయత్నించీ విఫలమైంది. అప్పుడే వారికి సమస్య చెప్పుకునే అవకాశమిస్తే, ఇంతదాకా వచ్చి ఉండేది కాదు.



గతంలోనే ఒకవేయి అద్దెబస్సుల నోటిఫికేషన్ ఒకటిచ్చింది. మరో వెయ్యి బస్సుల కోసం ఇంకో నోటిఫికేషన్ ఇవ్వాలని ఉన్నతాధికారుల సమీక్షలో సీఎం చెప్పారు. ఒకవైపు ఆర్టీసీపట్ల పాక్షిక ధోరణి ప్రదర్శిస్తున్న గులాబీ సర్కారు, మరోవైపు దాని ఉనికినే ప్రశ్నార్థకం చేసే వ్యవహారానికి ఒడిగట్టింది. తన మొండివైఖరితో ఆర్టీసీ సమస్యను జటిలం చేస్తున్నది. ఈ తరుణంలో కోర్టు ఆదేశాలను అవకాశంగా తీసుకుని ప్రభుత్వం విజ్ఞత చూపాలి. చర్చలు జరపడం ద్వారా పరిష్కారానికి ప్రయత్నించాలి. సమస్యలు త్వరితగతిన కొలిక్కితెచ్చేందుకు విస్తృత చర్చలకు అవకాశముండాలి. ఏదైనా యూనియన్లూ ప్రభుత్వమూ చర్చల్లో తేల్చుకోవాలి. అంతేగానీ, ముందస్తు షరతులు, మెలికలతో చర్చల ప్రక్రియకే ఆటంకం కలిగేలా సర్కార్ వ్యవహరించడం సమంజసం కాదు. ఒకవేళ యూనియన్లు పట్టుదలకు పోయినా, సర్కారూ అలా వ్యవహరించకూడదు. ఇంటిపెద్దలా సమన్వయం చేసుకోవాలి. చిత్తశుద్ధితో కార్మికుల డిమాండ్లను పరిశీలించి పరిష్కరించాలి. అలా కాకుండా విలీనం డిమాండ్ కార్మికులే స్వయంగా ఉపసంహరించుకున్నారంటూ ప్రభుత్వం వండివార్చిన ప్రెస్‌నోట్‌ను సమాజంలోకి వదిలి, మళ్లీ చర్చలకు విఘాతం కలిగేలా వ్యవహరించడం బాధ్యాతా రాహిత్యమే. సర్కారు విధానమే ఈరోజు ఆర్టీసీ సమ్మెకు మూలం. మనస్సులో ఒకటిపెట్టుకుని బయటకు మరోటి చెప్పడమే. ప్రయివేటీకరణ లక్ష్యంగా చేసుకునే 50 శాతం ఆర్టీసీ బస్సులు, 30శాతం అద్దెబస్సులతోపాటు మరో 20శాతం ప్రయివేటు బస్సుల ఫార్ములాకు ఊపిరిలూదుతున్నారు. ఇందుకు తాజాగా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు తెచ్చిన మోటారు వాహనాల సవరణ చట్టాన్ని ఆయుధంగా చేసుకుని, అదే అమలుచేస్తామని సీఎం అంటున్నారు. ప్రజావ్యతిరేక చట్టాల అమలుకు పాకులాటే తప్ప, రైతులకు ప్రయోజనకారిగా ఉన్న భూసేకరణ, పునరావాస చట్టం-2013 మాత్రం పక్కనబెట్టారు. ఇప్పుడు ఆర్టీసీ విషయంలోనూ అదే పునరావృతమవుతున్నది. కీలకమైన నిర్ణయాల్లో, సమావేశాల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని భాగస్వామ్యం చేయకపోవడం కూడా కొత్త సమస్యలకు కారణమవుతున్నది. పరిష్కారంలో జాప్యం జరుగుతున్నది. దాదాపు 50 వేల మంది ఆర్టీసీ డ్రైవర్లు, కార్మికులు, ఇతర ఉద్యోగుల జీవితాలను గాల్లో దీపం చేసిన ఘన చరిత్రా కేసీఆర్‌ది కావడం గమనార్హం. సాధారణంగా మనకు జ్వరమొస్తే డాక్టర్ దగ్గరకెళతాం. పరిపాలనాపరమైన సమస్యలు ఉత్పన్నమైనప్పుడు, తమ బాధలు చెప్పుకోవడానికి మంత్రుల దగ్గరకో, ముఖ్యమంత్రి దగ్గరకో పోవాలని ప్రజలు, సంఘాలు, నాయకులు భావిస్తారు. ఇప్పుడు రాష్ట్రంలో మంత్రులకు అధికారాల్లేవు. ఏదైనా సమస్య గురించి వాళ్ల దగ్గరకు పోతే, మళ్లీ ముఖ్యమంత్రితో మాట్లాడతా.. అంటూ మంత్రులు తప్పించుకుంటున్నారు. ఇక అంతే. ఆ సమస్య అక్కడే. ప్రగతిభవన్ గేట్లు మామూలు ప్రజలతోపాటు రాజకీయ పార్టీల నేతలూ ఇతరులకూ తెరుచుకోవు. కేవలం సీఎం కేసీఆర్ వందిమాగదులకు తప్ప. ఇవన్నీ ఎవరికి చెప్పుకోవాలి? చివరికి ఆర్టీసీ జేఏసీ కూడా ముఖ్యమంత్రి అపాయింట్‌మెంటు కోసం ప్రయత్నించీ విఫలమైంది. అప్పుడే వారికి సమస్య చెప్పుకునే అవకాశమిస్తే, ఇంతదాకా వచ్చి ఉండేది కాదు.

# పంచాయతీ-ప్రణాళికలు-నిధులు-నిజాలు



గడ్డం రమేష్

ప్రభుత్వం పదేపదే గ్రామ పంచాయతీలను ప్రగతి వైపు నడిపిస్తున్నట్టు చెబుతోంది. సెప్టెంబర్6 నుంచి అక్టోబర్ 6వరకు నెలరోజుల ప్రణాళిక ప్రకటించింది. వారం రోజులు కార్యక్రమాలు నిర్వహించారు. ఏమేమి పనులు చేయాలో నిర్దేశించారు. మొదటి రోజు ముఖ్యమంత్రి సందేశం చదివి వినిపించారు. అందులో మీ చేతుల్లోనే మీ గ్రామ భవిష్యత్, మీరే కథానాయకులు, మార్గ నిర్దేశికులంటూ ఆకాశానికి ఎత్తారు. ప్రజలు శ్రమదానం చేసి చెమట చుక్కలను పెట్టుబడులుగా పెట్టాలని పిలుపునిచ్చారు. పల్లెల ప్రగతి గురించి ముఖ్యమంత్రి ప్రసంగం మొదటిది కాదు.. చివరిదీ కాదు. మోటకు కట్టిన పశువుల్లాగా వెనుకకు ముందుకు కదులుతున్నాయి. మన ఊరు-మన ప్రణాళిక, గ్రామజ్యోతి, ఇప్పుడు నెలరోజుల ప్రణాళిక కార్యక్రమాల పేర్లు మారాయి. కానీ ఊర్లు మారాయా లేదా అనేదే అసలు ప్రశ్న. మొక్కలు నాటడం, డంపింగ్ యార్డ్‌ల్ని గుర్తించడం, బొందలగడ్డలను సంసిద్ధం చేయడం, లేని దగ్గర కొనటం, ప్రభుత్వ స్థలాలను,

ప్రజల నుంచి పన్నులు వసూలు చేసే అవకాశం కూడా లేకపోలేదు. మరొకవైపు ఎమ్మెల్యేలు, ఎంపీలు నిధుల పేరుతో రాజకీయంగా గ్రామాలను అదుపాజ్ఞల్లో పెట్టుకుంటున్నారు. ఈ పద్ధతి మారాలి. పంచాయతీల అభివృద్ధికి కేరళ ప్రభుత్వ మార్గాన్ని అనుసరించాలి. అప్పుడే గ్రామ స్వరాజ్యం పరిఢవిల్లుతుంది. పంచాయతీ ప్రణాళికలు-నిధులు సద్వినియోగమవుతాయి.

రోడ్లను శుభ్రం చేయటం, పాత బావులు, బొందల్ని పూడ్చటం లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికి ముందు పల్లెల్లో మౌలిక మార్పులు జరుగుతున్నట్టు అధికారుల సమావేశాల్లో అంతా హడావుడి చేశారు. రాష్ట్ర పాలన పథకాలను పతాక శీర్షికన తెచ్చారు. గతంలో గ్రామ పంచాయతీ సంఖ్య 8,690 నుంచి 12,750కి పైగా పెంచినట్టు చెప్పారు. కొత్తగా పంచాయతీరాజ్ చట్టం తేవడం తమ ఘనతే అన్నారు. 36వేల మంది పంచాయతీ సిబ్బంది జీతాలు పెంచామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిందంతా చేసింది. గ్రామాల వెనుకబాటుకు మీరే కారణం అన్నట్టు మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి ఆటంకం పడుతున్నది ఎవరు? ఊర్లను గుప్పెటపట్టి ప్రజాస్వామ్యాన్ని పల్లెల్లో పనిచేయకుండా చేసింది ఎవరో చర్చ జరగాలి.

### ప్రజాస్వామ్యం-గ్రామసభలు

ప్రజలు గ్రామాభివృద్ధికి పాటుపడాలంటే నిర్ణయాలలో భాగస్వాములుగా చేయటం అతి ముఖ్యమైనది. ఏ పల్లె ప్రగతి అయినా ముందుకుసాగాలంటే గ్రామ సభలు జయప్రదంగా జరగటం అవసరం. కానీ ప్రభుత్వం నిర్వహించిన గ్రామసభల్లో ఎందరు పాల్గొన్నారు. ఎన్ని సూచనలు వచ్చాయి. వాటి అమలుకు ఏ చర్యలు తీసుకున్నారు. ఇది కాకుండా రాష్ట్ర ప్రభుత్వమే ఎజెండా నిర్ణయించి ఇచ్చిన తరువాత ప్రజలు ఏం మాట్లాడుతారు. ఎక్కువ మంది ఎలా పాల్గొంటారో పాలకులకే తెలియాలి. కొత్తగా తెచ్చిన పంచాయతీరాజ్ చట్టంలోనే గ్రామసభల్లో ప్రజల భాగస్వామ్యాన్ని కుదించారు. 500మంది ఓటర్లున్న ఊరిలో 50మంది (10శాతం) పాల్గొంటే కోరం పూర్తయినట్టేనని చట్టం చెబుతోంది. 5వేలు నుంచి 10వేల ఓటర్లు ఉన్న దగ్గర మూడు వందల మంది హాజరుంటే సరిపోతుందంటున్నారు. 3శాతం మంది హాజరైతే సభ సక్సెస్‌గా కోరం ఉన్నట్టు భావించవచ్చని నిర్ణయించారు. జనాభా పెరిగిన కొద్దీ ప్రజల భాగస్వామ్యాన్ని తగ్గించి ప్రజాస్వామ్యానికి పరిమితులు ఏర్పరిచారు. ఇంకా ఘోరమైన సంగతి ఏమిటంటే నోటీసులిచ్చినా ప్రజలు రాకపోతే సభ వాయిదా వేసి గంట తరువాత సమావేశం నిర్వహిస్తే ఆ సంఖ్యను కూడా పట్టించుకోకుండా కోరం పూర్తికాకుండానే సమావేశాన్ని జరుపుకోవచ్చని చట్టం చెబుతోంది. ఈ విధంగా జరిగితే గ్రామాభివృద్ధిలో ప్రజలు ఏమేరకు భాగస్వామ్యమయ్యారో అర్థమవుతూనే ఉంది. గ్రామ సభలు నిర్వహించేటప్పుడు ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు చేయాలి. కానీ అలా జగట్లేదు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఎజెండా అమలుకే సభలు నిర్వహించడం ప్రజాస్వామ్య స్ఫూర్తి కాదు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు ప్రారంభమై చాలా రోజులవుతోంది. వాటిని ఇప్పుడు శుభ్రపరచటమేంటీ? వర్షాలు రాకముందే మొక్కలు నాటే ప్రణాళికలు రూపొందించి మొక్కలు సిద్ధం చేసుకోవాలి. అదునుమీరాక ఫలితాలు పరిమితంగానే వస్తాయి.

### మొక్కలు-జరిమానాలు

మొక్కలు చనిపోతే సర్పంచ్‌లకు, సెక్రటరీలకే కాదు ఇంటి యజమానులకూ దండగ విధించాలట. పచ్చదనం పెంచేందుకు ప్రతీ ఇంటికి వేపమొక్కతో పాటు అయిదు మొక్కలు పంపిణీ చేయాలని నిర్ణయం. గ్రామావసరాల కన్నా అధిక మొత్తంలో మొక్కలు అందుబాటులో ఉండాలనుకున్నారు. దీనికంటే ముందు 85శాతం మొక్కలు పచ్చగా ఉండకపోతే సర్పంచ్ పదవీ పోతుందంటూ ప్రచారం చేసారు. కానీ 80శాతం మొక్కల్ని కాపాడే బాధ్యత గ్రామ కార్యదర్శిదేనని చట్టంలో పొందుపరిచారు. పంచాయతీకి ఒక నర్సరీ ఏర్పాటు చేసుకోవాలని ముందే చట్టం చేసినా ఎన్ని గ్రామ పంచాయతీల్లో నర్సరీలు పెంచుతున్నారో ప్రభుత్వమే చెప్పాలి. అప్పుడు మొక్కల లెక్కలు తేలుతాయి. ఇంటి యజమాని ఆరు మొక్కలు కాపాడలేక విఫలమైతే పంచాయతీ సెక్రటరీ తనిఖీలో ధ్రువీకరిస్తే తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 సెక్షన్ 43(6)(11) కింద ఇంటిపన్నుకు సమానమైన జరిమానా ఇంటి యజమాని పంచాయతీకి చెల్లించాలని చట్టం చెబుతోంది. అంటే మొక్కలు పెంచకుంటే బలవంతంగా దండగ వేస్తారనే సంగతి దాస్తున్నారు. సభల్లో ఈ విషయం చెబితే ప్రజల స్పందన పాలకులకు తెలిసేది. నిజానికి ఇది కొత్త చట్టం కాదు. ఉమ్మడి రాష్ట్రంలో 2002లో భూమి, వృక్షాల చట్టంగా ఆమోదించబడింది. రెండేండ్ల తరువాత 2004లో చట్టానికి నిబంధనలు రూపొందించారు. 2004 నవంబర్‌లో అమల్లోకి వచ్చాయి. ఉమ్మడి రాష్ట్ర చట్టం 24 ప్రకారం స్థానిక సంస్థలు నాటాల్సిన మొక్కలు 100 చ.మీటర్ల నివాస స్థలం కన్నా తక్కువుంటే మూడు మొక్కలు. 300 చ.మీటర్ల స్థలానికి 10మొక్కలు నాటాలని నిబంధన పెట్టారు. కుటుంబ యజమాని మొక్కలు నాటనట్టయితే గ్రామాధికారే మొక్కలు నాటించి అందుకయ్యే ఖర్చు ఆస్తిపన్ను బకాయి వసూలు విధంగానే సదరు వ్యక్తి నుంచి వసూలు చేయాలని నిర్ణయించారు. ఇదీ అసలు రహస్యం. భవిష్యత్‌లో మొక్కలు పెంచకుంటే జరిమానాలు, జైళ్లూ చూడాల్సి వస్తుందేమో!



### శ్మశానవాటికలు- పరిశుభ్రత- చెత్త కేంద్రాలు

శ్మశాన వాటికలను, చెత్త కేంద్రాలను ఎంపిక చేసుకోవాలని ప్రభుత్వం పంచాయతీలకు సూచించింది. ఒకవేళ స్థలాలు లేకుంటే జీపీ నిధుల నుంచి కొనుగోలు చేయాలని సలహానిచ్చింది. 2015లో నిర్వహించిన గ్రామజ్యోతిలో చెత్తకేంద్రాలు, బొందలగడ్డలను గుర్తించారు. వీటికి సంబంధించి బడ్జెట్ అంచనాలను కూడా వేశారు. కానీ గత నాలుగేండ్లుగా వాటి పురోగతి ఎంతవరకొచ్చిందో చెప్పలేదు. చెత్తకేంద్రాలు, శ్మశానవాటికల సమస్య పరిష్కారం కాలేదు. 2015 గ్రామజ్యోతిలో 19,074 చెత్త కేంద్రాలు అవసరమని గుర్తించారు. 7,048 చెత్త కేంద్రాలకు భూమి గుర్తించారు. పంచాయతీల్లో 4,970 బొందల గడ్డలు ఉన్నట్టు, 8,159 శ్మశాన వాటికల స్థలాలు గుర్తించారు. వీటి అభివృద్ధికి అంచనా వేయాలని సిద్ధం చేశారు. 32లక్షల 73వేల 40 మీటర్ల ప్రహరీగోడల నిర్మాణానికి రూ.288.69 కోట్లుగా అంచనా వేశారు. 3లక్షల 48వేల 642 ఎకరాలు భూమిని చదును చేసేందుకు రూ.55.23 కోట్లుగా అంచనాకు వచ్చారు. బొందలగడ్డలో బోర్లకు రూ.48కోట్లు, దహనవాటికలకు రూ.74కోట్లు అవసరమవుతాయని నిర్ణయించారు. గత నాలుగేండ్లలో వీటి అంచనా వ్యయం పెరిగి ఉంటుంది. 2015నాటికే మొత్తం రూ.466 కోట్లు బొందలగడ్డ ఖర్చుగా తెలిపారు. ఇప్పుడు చెత్తకేంద్రాలు, బొందలగడ్డలకే సుమారు రూ.1000కోట్లగా పైగా అవసరం. ఈ ఖర్చు తగ్గించుకునేందుకు స్థలం లేకుంటే జీపీ నిధులనుంచి కొనుగోలు చేయాలన్నారు. దాత నుంచి వసూలు చేయాలని చెప్పారు. నిధులు లేకుండా ఇతరులపై ఆధారపడి చేసే అభివృద్ధి పనులు పక్కాగా జరుగుతాయా? సమస్యలు తీరుతాయా? అనేది ప్రశ్న.

### నిధులు-స్థాయీ సంఘాలు

ముప్పై రోజుల ప్రణాళికకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా రూ.339కోట్లు మంజూరు చేయనున్నట్టు ప్రకటించింది. తరువాత కలెక్టర్ల సమావేశంలో జిల్లాకు రూ.2కోట్లు ఇస్తున్నట్టు తెలిపారు. ప్రతీ పంచాయతీకి చెత్త ఎత్తేందుకు ట్రాక్టర్, చెట్లకు నీరుపోసేందుకు ట్యాంకర్ కొనాలని చెప్పారు. ట్రాక్టర్‌కు బ్యాంకులో రుణం తీసుకున్నా ట్రాలీకి, ట్యాంకర్‌కు లక్షకు పైగా ఖర్చు వస్తుంది. రూ.1200 కోట్లకు పైగా అవసరపడతాయి. కేంద్ర ఆర్థిక సంఘం తలసరి రూ.4 ఇస్తుంది. దీనిని రూ.12కు పెంచాలని ఫిబ్రవరిలో హైదరాబాద్‌కు వచ్చిన ఆర్థిక సంఘాన్ని ముఖ్యమంత్రి కోరారు. వారు చర్చిస్తామన్నారు. ఈ తలసరి ఆదాయం కేంద్ర ఆర్థిక సంఘం పెంచకుండా గ్రామాల ఆర్థిక వనరులు పెరిగే అవకాశం లేదు. ప్రధానంగా పంచాయతీలకు స్థానిక పన్నుల (ఇంటి పన్నులు) ద్వారా 23శాతం, కేంద్ర ఆర్థికసంఘం ద్వారా గ్రామాలకు 55శాతం నిధులు వస్తున్నాయి. ఈనిధులతో గ్రామాల అభివృద్ధి అసాధ్యం. అందుకే ఊర్లను గతంలో డబ్బులున్న వారికి దత్తత పేర్లతో అప్పగించారు. ఇప్పుడు ఏకంగా కమిటీలో పెట్టుకుని పంచాయతీ సమావేశాలకు హాజరు పరచమని చట్టంలో చెప్పారు. ఒకనాడు భూస్వాముల పెత్తనం కింద బతికిన పల్లెలు నేడు కార్పొరేట్, సోషల్ రెస్పాన్స్‌బులిటీ పేరుతో పెట్టుబడుదారులకు అప్పజెప్పి అభివృద్ధి చేయాలనుకోవడం పాలకుల వైఫల్యాలకు నిదర్శనం. స్థాయీ సంఘాలు కమిటీలు వేసి వారి సూచనల మేరకు ప్రజల నుంచి పన్నులు వసూలు చేసే అవకాశం కూడా లేకపోలేదు. మరొకవైపు ఎమ్మెల్యేలు, ఎంపీలు నిధుల పేరుతో రాజకీయంగా గ్రామాలను అదుపాజ్ఞల్లో పెట్టుకుంటున్నారు. ఈ పద్ధతి మారాలి. పంచాయతీల అభివృద్ధికి కేరళ ప్రభుత్వ మార్గాన్ని అనుసరించాలి. అప్పుడే గ్రామ స్వరాజ్యం పరిఢవిల్లుతుంది. పంచాయతీ ప్రణాళికలు-నిధులు సద్వినియోగమవుతాయి.

సెల్: 94900 98484




గుర్రం రాంమోహన్‌రెడ్డి

# ప్రయివేటీకరణవైపే సర్కార్ అడుగులు

ప్రతిష్టాత్మకమైన ఆర్టీసీకి చేయూతనిచ్చి గట్టెక్కించాల్సిన పాలకులు విధ్వంస చర్యలకు పూనుకున్నారు. ఆర్థిక పరిపుష్టి కల్పించి ప్రయాణీకులకు విశిష్ట సేవలు అందించి ఉత్తమ సంస్థగా తీర్చిదిద్దాల్సిన పాలకులు ఒక పథకం ప్రకారం వినాశనకర చర్యలకు ఉపక్రమించారు. డిమాండ్లను పరిష్కరించకపోగా సమ్మె హక్కుపై ఉక్కుపాదం మోపుతూ టీఎస్ ఆర్టీసీని అస్థిరపర్చి ప్రయివేటీకరణ చేసేందుకు ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తున్నట్టు స్పష్టమవుతున్నది. వేల కోట్ల రూపాయల ఆస్తులను కలిగి దేశంలోనే ఉత్తమ సంస్థగా వెలుగొందుతున్న టీఎస్ ఆర్టీసీకి ఆర్థికంగా చేయూతనిచ్చి ఆదుకోవాల్సిన పాలకులు నిర్వీర్యం చేస్తున్నారు. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయాలని, పీఆర్సీ ఇవ్వాలని, ఆర్థికంగా ఆర్టీసీకి చేయూతనివ్వాలని, ఇతర హేతుబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేస్తే చెల్లదంటూ సమ్మెహక్కుపై ఉక్కుపాదం మోపుతూ కార్మికవర్గం హక్కులను ప్రభుత్వం కాలరాస్తున్నది. ప్రభుత్వం చేస్తున్న కుట్ర వెనక ప్రయివేటీకరణ మంత్రం దాగివున్నట్టు కార్మికవర్గంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కార్మికులతో చర్చలు చేపట్టే ప్రసక్తే లేదని మొండి వైఖరితో ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. కార్మికులతో చర్చలు జరపాలని, న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసినా లెక్కచేయకుండా తెలంగాణ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్నది. ప్రభుత్వ వైఖరితో మనస్తాపంతో ఇప్పటికే నలుగురు ఆర్టీసీ కార్మికులు మరణించారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తరువాత దాదాపు 90డిపోలతో 10వేల 140బస్సులు సేవలు అందిస్తున్నాయి. 52వేలకు పైగా ఉద్యోగులు టీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్నారు. ప్రభుత్వం వివిధ వర్గాలకు ఇస్తున్న రాయితీలను టీఎస్ ఆర్టీసీకి చెల్లించకపోవడంతో ఆర్టీసీ ఆర్థికంగా కుదేలవుతున్నది. బస్ పాసులపై ప్రభుత్వం రాయితీ రూపంలో రూ.600 కోట్లు చెల్లించాల్సివుంది. 2014 నుంచి 2019 వరకు ఆరేండ్ల కాలంలో రూ.2770 కోట్లు ప్రభుత్వం రాయితీలు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.710 కోట్లు మాత్రమే ఇచ్చింది. ఆర్టీసీకి రావాల్సిన రూ.2వేల కోట్లను చెల్లించలేదు. డీజిల్‌పై ఏడాదికి ఆర్టీసీ ప్రభుత్వానికి రూ.600 కోట్లు చెల్లిస్తున్నది. మోటారు వాహనాల పన్ను రూపంలో రూ.230 కోట్లు, జీఎస్టీ రూపంలో రూ.100 కోట్లు, టోల్ ప్లాజా రూపంలో రూ.60 కోట్లు ప్రభుత్వం దండుకుంటున్నది. ఏడాదికి రూ.1000 కోట్లు ఆర్టీసీ నుంచి ప్రభుత్వం పిండుతున్నది. దాదాపు ఆరేండ్ల కాలంలో ప్రభుత్వానికి ఆర్టీసీ రూ.5వేల కోట్లు చెల్లిస్తే ఇచ్చింది మాత్రం రూ.710కోట్లు మాత్రమే. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి డీజిల్ రూ.54 ఉండగా ప్రస్తుతం రూ.77కు చేరుకుంది. ఫలితంగా ఆర్టీసీపై రూ.6 వేల కోట్ల అదనపు భారం పడింది. డీజిల్‌పై పెరుగుతున్న భారాలను ప్రభుత్వమే భరించాలని ఆర్టీసీ జేఏసీ కోరుతున్నా ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల ఆర్టీసీపై మరో రూ.60 కోట్ల డీజిల్ భారం పడింది. ఆర్డినరీ, పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ డీలక్స్, రాజధాని, గరుడ, గరుడ ప్లస్, వజ్ర పేర్లతో ప్రయాణీకులకు అద్భుతమైన సేవలు అందిస్తున్న ఆర్టీసీకి రూ.50 వేల కోట్లకు పైగా ఆస్తులున్నాయి. రూ.3 వేల కోట్ల నష్టం ఆర్టీసీకి పెద్ద సమస్యే కాదు. ఈ మొత్తాన్ని ప్రభుత్వం భరించి ఆర్టీసీని ఆర్థికంగా గట్టెక్కించాలని కార్మికవర్గం కోరుతోంది. 2011లో సకల జనుల సమ్మె సందర్భంగా 40రోజులు కార్మికులు సమ్మె నిర్వహించి తెలంగాణ ఉద్యమంలో ప్రధాన భూమిక పోషిస్తే ప్రభుత్వం మాత్రం వారికి ఏరకమైన చేయూత ఇవ్వకుండా మొత్తంగా ఆర్టీసీని విధ్వంసం చేసి ప్రయివేటు పరం చేయాలన్న వక్రబుద్ధితో ఉంది. వివిధ రూట్లల్లో ప్రయివేటు అక్రమ రవాణా వల్ల ఆర్టీసీకి రూ.3వేల కోట్లు నష్టం వస్తున్నది. ప్రయివేటు అక్రమ రవాణాకు కళ్లెంవేస్తే ఆర్టీసీకి గణనీయమైన ఆదాయం వస్తుంది. సేవా దృక్పథంతో చూడాల్సిన ప్రభుత్వం వ్యాపార దృక్పథంతో చూస్తే సత్ఫలితాలు వచ్చే అవకాశం ఉండదు. రోజుకు లక్షల కిలోమీటర్లలో బస్సులు ప్రయాణిస్తూ కోటిమందికి పైగా తమ గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ కార్మికులు విశేష కృషి చేస్తున్నారు. ఐదేండ్ల కాలంలో 6వేల పోస్టులు ఖాళీలు కాగా వాటిని భర్తీ చేయకపోవడంతో కార్మికులపై అదనపు భారం పడినప్పటికీ ప్రయాణీకులకు మాత్రం టీఎస్ ఆర్టీసీ సేవలు అందిస్తూనే ఉన్నది. అలాంటి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తే నష్టమేమీలేదు. కానీ న్యాయసమ్మతమైన డిమాండ్లతో కార్మికవర్గం ఐక్యంగా సమ్మె సాగిస్తున్నప్పటికీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. అయినప్పటికీ మొక్కవోని ధైర్యంతో కార్మికవర్గం ముందుకు సాగడం అభినందనీయం. కార్మిక వర్గానికి సెల్యూట్ చేయాల్సిందే.

సెల్: 7981018644

# కాశ్మీర్ స్వయం ప్రతిపత్తి.. చారిత్రక వాస్తవాలు



కొండూరి వీరయ్య

అక్టోబరు 15వ తేదీ వ్యాసంలో స్వయం ప్రతిపత్తి అన్న భావనను క్రిప్స్ కమిషన్ లోపాయికారీ స్వతంత్ర భారత రాజ్యాంగ పరిషత్ ఎజెండాగా మార్చిన చారిత్రక నేపథ్యాన్ని చర్చించుకున్నాం. దఫ దఫాలుగా సాగిన చర్చలను ముగించి క్రిప్స్ కమిషన్ తన నివేదిక తుదిరూపం ఇచ్చింది. మరో దఫా కాంగ్రెస్, లీగ్ ప్రతినిధి మండలి లండన్ సంప్రదింపుల తర్వాత మే 16 కేబినెట్ మిషన్ ప్రణాళిక ప్రకారం అధికార బదిలీకి ఓ ఒప్పందం సిద్ధమైంది. ఈ ఒప్పందంలోనే సంస్థానాలకు స్వయం ప్రతిపత్తి, ప్రత్యేక హక్కులు, అధికారాలు గ్యారంటీ చేయబడ్డాయి. ఈ ఒప్పందం ప్రకారం 1948 జూన్ నాటికి బ్రిటిష్ ప్రభుత్వం దేశాన్ని వీడిపోవటానికి సిద్ధమైంది.


అయితే భారతదేశాన్ని చీల్చటానికి అంగీకరించాలా లేదా అన్న విషయంలో కాంగ్రెస్‌కు, గాంధీకి మధ్య తలెత్తిన విభేదాలు ఈ కాలంలోనే తారాస్థాయికి చేరాయి. ఓ వైపున 1946 చివర్లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో గాంధీ అభిప్రాయాన్ని కాదని క్రిప్స్ కమిషన్ ప్రతిపాదనలను అంగీకరించటం ఈ విభేదాలకు ముఖ్యమైన ఉదాహరణ. తాను జవసత్వాలు సమకూర్చి ఏరి కూర్చిన వర్కింగ్ కమిటీయే గాంధీని కాదన్నా తాను నమ్మిన సిద్ధాంతాన్ని ఎన్నడూ ఆయన వదిలి పెట్టలేదు. అటు వర్కింగ్ కమిటీ ముందు ఇటు బ్రిటిష్ ప్రభుత్వం ముందు, సంస్థానాల ముందు కూడా తన ప్రత్యామ్నాయాలు ముందుకు తెస్తూనే ఉన్నాడు.

ఈ కాలంలోనే లౌకిక సర్వమత సమ్మిళిత భారతం అవసరం పట్ల గాంధీ ప్రతిపాదన బలపరుస్తూ అనేక ఘటనలు చోటు చేసుకున్నాయి. కాంగ్రెస్, ముస్లింలీగ్ అనుసరించిన వైఖరుల వల్ల తూర్పున బెంగాల్, వాయువ్యాన పంజాబ్ రెండు ముక్కలైంది. పంజాబ్‌లో ప్రత్యేకించి హిందువులు, ముస్లింలు, సిక్కులు ఎవరికి వారు ప్రయివేటు సైన్యాలు సిద్ధం చేసుకోవటంతో విభజన సమయంలో సరిహద్దు రక్తసిక్తమైంది. అప్పటికి ఏమి చేయాలో తేల్చుకోని సంస్థానాధీశులు డిశంబరు 9న మొదలైన రాజ్యాంగ పరిషత్ సమావేశం నాటికి రాజ్యాంగ సభలో చేరలేదు. దాంతో ఎన్నికైన రాజ్యాంగసభలో 93స్థానాలు ఖాళీగా ఉన్నాయి. నాటి నుంచీ అనేక చారిత్రక పరిణామాలు వేగంగా జరిగిపోయాయి. జూన్ 11న ట్రావెన్కూర్ రాజు, జూన్ 12న నిజాం నవాబు తాము స్వతంత్రులుగా ఉంటామని ప్రకటనతో సర్దార్ పటేల్‌లో ఆందోళన మొదలైంది.

ఇదే అదనుగా తీసుకుని అటు బ్రిటిష్ ప్రభుత్వానికి, ఇటు ఆవిర్భవించనున్న భారత ప్రభుత్వానికి సమదూరం పాటిస్తున్న విపి మీనన్ తన ఫార్ములా ముందుకు తెచ్చాడు. సాధించిన స్వాతంత్ర్యం సంస్థానాల సింహద్వారం దగ్గరే ఆగిపోతుందన్న విపి మీనన్ ఆందోళనను పటేల్ వద్ద వ్యక్తం చేశాడు. నెహ్రూ, అబుల్ కలాం అజాద్, కృపలానీ, రాజగోపాలాచారిలకు వర్తమానం పంపి 'సంస్థానాలకు స్వయంప్రతిపత్తి' అంశంపై ఓ నిర్ణయానికి వచ్చాడు పటేల్. తదనుగుణంగా జూలై 5న "దేశ ప్రయోజనాలతో ముడిపడిన మూడు అంశాలు (రక్షణ వ్యవహారాలు, విదేశీ వాణిజ్యం, కమ్యూనికేషన్లు) మినహా సంస్థానాల నుంచి మేము మరేమీ కోరటం లేదు. తక్కిన విషయాల్లో స్వయం ప్రతిపత్తితో కూడిన వాటి ఉనికిని మేము తు.చ. తప్పకుండా గౌరవిస్తాం." అని విధాన ప్రకటన జారీ చేశారు.

జూలై 10న ఇదే సారాంశాన్ని వ్యక్తం చేస్తూ మౌంట్‌బాటన్ "మూడు అంశాలకు సంబంధించి మాత్రమే విలీనం జరుగుతుంది. అందువల్ల ఆర్థిక భారం ఏమీ ఉండబోదని విలీన ముసాయిదా ఒప్పందం పేర్కొంటుంది. కేంద్ర ప్రభుత్వానికి ఇతర అంశాల్లో ఎటువంటి అధికారం ఉండబోదని కూడా ముసాయిదాలో స్పష్టంగా ఉంది" అని హితవు చెప్పాడు. విలీనం కాగోరేవారు ఆగస్టు 15లోగా విలీనం కావాలని ప్రతిపాదించాడు. దీనికి బదులుగా రాజభరణాలు, స్వతంత్ర భారతంలో సంస్థానాధీశుల ఆస్తులకు రక్షణ, ప్రత్యేక సదుపాయాలు వంటివి అదనపు నజరానాలుగా ప్రకటించటానికి 'సర్దార్'

"భారతదేశంలో విలీనానికి ఒప్పించింది. ఈ చారిత్రక నేపథ్యాన్ని పక్కన పెట్టి కుత్సిత రాజకీయ ప్రయోజనాల కోసం ముస్లింలనో గాంధీ నెహ్రూలతో ద్రోహులుగా ముద్రించేందుకు సాగించే దుష్ప్రచారం చారిత్రక వాస్తవాల ముందు నిరూపణకు నిలువలేదన్నది అక్షర సత్యం."



పటేల్ వెనకాడలేదు. ఈ ఒప్పందం సంస్థానాధీశులకు బహుళ ప్రయోజనకారిగా మారటంతో వైశాల్యం రీత్యా కాశ్మీర్, హైదరాబాద్ తర్వాత పెద్ద గ్వాలియర్, బికనీర్, పాటియాల సంస్థానాలు విలీనపత్రాన్ని ముందుగా ఆమోదించాయి. తర్వాత మాత్రమే రాజ్యాంగ పరిషత్ సభలో సంస్థానాలకు చెందిన ప్రతినిధులు పాల్గొనటం మొదలైంది.

తొలి హోం శాఖ కార్యదర్శిగా వ్యవహ రించిన విపి మీనన్ మాటల్లో "సంస్థానాలకు లాభసాటి కాగల రాయితీలు ప్రకటించి పాటించగలిగిన వాడుగా, (తమ పట్ల) ఎంతో గౌరవ మర్యాదలు కూడా చూడగల ఉక్కు మనిషిగా సంస్థానాధీశులు భావించారు." రాజభరణాలు, సంస్థానాధీశులకు సంస్థానాల్లో విశాల ప్రాంతంలో విస్తరించి ఉన్న ఆస్తి హక్కులు గ్యారంటీ చేయటంలో సోషలిస్టు భావాలున్న నెహ్రూ ఆయన సహచర బృందంతో ఘర్షణపడగల 'ఉక్కుమనిషి' అని సంస్థానాధీశులు భావించారు. ఈ నేపథ్యం గమనిస్తే ఉక్కు మనిషి అన్న బిరుదు చరిత్ర ఏమిటో అర్థమవుతుంది.

సంస్థానాధీశులు ఈ ప్రతిపాదనలకు తలొగ్గేలా ఒత్తిడి తెచ్చిన పరిస్థితులకు విలక్షణ చారిత్రక నేథ్యం ఉంది. అప్పటికే తెలంగాణ, వున్న ప్రవాయలార్, తెభాగా రైతాంగ పోరాటాలు ఉధృత స్థాయిలో ఉన్నాయి. వీటికి తోడు ప్రధానంగా నిజాం నవాబు, ట్రావెన్కూర్ మహారాజ తాము భారతదేశంలో విలీనం కాబోమని, స్వతంత్ర దేశంగా ఉండగోరు తున్నామని ప్రకటించటంతో పాటు ట్రావెన్కూర్ మహారాజు పాకిస్థాన్ సహా ఇతర దేశాల్లో తమ రాయబారులను నియమించేందుకు సిద్ధమయ్యాడు. అప్పటికే స్వాతంత్ర్యోద్యమ సంబరాలకు సిద్ధమవుతున్న ప్రజలు ఈ ప్రకటనలు చూసి నిర్ఘాంత పోయారు. ఈ సంస్థానాధీశులకు వ్యతిరేకంగా రెండో పోరాటానికి తెరతీసింది. ఈ ప్రాంతాల్లో ప్రజల్లో ప్రాబల్యం కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ విశాలాంధ్రలో ప్రజారాజ్యం, ఐక్య కేరళ ఉద్యమాలకు పురుడు పోసింది. ఈ పరిస్థితుల్లో ఈ ఉద్యమాలు విజయవంతమై కాంగ్రెస్‌లోని సోషలిస్టు భావాలు కలిగిన వారు ఈ పంథా అనుసరించటానికి సిద్ధపడితే తమ పరిస్థితి విషమిస్తుందన్న అవగాహనే సంస్థానాధీశులను జూలై 10 నాటి మౌంట్‌బాటన్ ముందుకు తెచ్చిన రాజీ ఒప్పందాన్ని అంగీకరింపచేసేలా ఒత్తిడి తెచ్చాయి.

ఇదేసమయంలో ఉత్తర దిక్కున తలపాగాగా ఉన్న కాశ్మీర్ రాజు హరిసింగ్ కూడా తాము స్వతంత్రంగా ఉండటానికి అవకాశం ఉందన్న క్రిప్స్ కమిషన్ కీలక సిఫార్సు నేపథ్యంలో పాకిస్థాన్‌తో సంప్రదింపులు జరుపుతున్నాడు. జూన్‌లో రెండుసార్లు హరిసింగ్‌ను కలిసిన "కాశ్మీర్ పాకిస్థాన్‌లో విలీనం అయినా భారతదేశానికి అభ్యంతరం లేదని" పటేల్ అభిప్రాయాన్ని తెలియచేస్తాడు. అప్పటికే హరిసింగ్‌కు వ్యతిరేకంగా సాగుతున్న కాశ్మీర్ విముక్తి ఉద్యమ పోరాటంలో కాశ్మీర్ భవిష్యత్తును ప్రజలే నిర్ణయించాలన్న డిమాండ్ అంతర్భాగంగా ఉంది. నేషనల్ కాన్ఫరెన్స్ సాగిస్తున్న ఉద్యమం, దాని లక్ష్యాల నేపథ్యంలో షేక్ అబ్దుల్లా పట్ల గాంధీకి సదభిప్రాయం ఉండేది. భారతదేశాన్ని లౌకిక దేశంగా నిలబెట్టాలంటే కాశ్మీర్ భారతదేశంలో విలీనం కావాలన్నది గాంధీ కోరిక.


దీనికనుగుణంగా కాశ్మీర్ ప్రజల మనోభావాలు కూడా భారతదేశం వైపే మొగ్గాయి. అయితే వల్లభాయ్‌పటేల్ దేశంలోని మిగిలిన సంస్థానాధీశులతో కుదుర్చుకున్న ఒప్పందం తరహాలో హరిసింగ్‌తో ఒప్పందం కుదుర్చుకోరాదని, హరిసింగ్ పాలనకు ప్రజామోదం లేదన్న వాదనను షేక్ అబ్దుల్లా ముందుకు తెచ్చాడు. అప్పటికే క్యాబినెట్ కమిషన్ సంప్రదింపుల్లో స్వయంప్రతిపత్తి, ప్రజాభిప్రాయ సేకరణ మార్గాన్ని అంగీకరించిన పటేల్ అబ్దుల్లా డిమాండ్‌తో సందిగ్ధంలో పడ్డాడు. పటేల్ అభిప్రాయానికి కట్టుబడాలంటే హిమాలయాలను సైతం వేడెక్కిస్తున్న కాశ్మీర్ విముక్తిపోరాట లక్ష్యాలను తిరస్కరించాలి. అలా చేయటం దేశాన్ని మరో సుడిగుండంలోకి నెడుతుందని గాంధీ హెచ్చరించాడు. ఓ వైపున కాశ్మీర్ భవిష్యత్తు నిర్ణయించాల్సింది ప్రజలేనంటూ ఆగస్టు చివర్లో గాంధీ ప్రకటించటంతో నేషనల్ కాన్ఫరెన్స్ డిమాండ్‌కు మరింత మద్దతు తోడైంది. మరోవైపున స్వయంప్రతిపత్తి ప్రజలదే తప్ప పాలకులది కాదని అబ్దుల్లా ముందుకు తెచ్చిన నినాదం కాశ్మీర్‌లో ఏకతాటిపై నడిపించింది. భారతదేశంలో విలీనానికి ఒప్పించింది. ఈ చారిత్రక నేపథ్యాన్ని పక్కన పెట్టి కుత్సిత రాజకీయ ప్రయోజనాల కోసం ముస్లింలనో గాంధీ నెహ్రూలతో ద్రోహులుగా ముద్రించేందుకు సాగించే దుష్ప్రచారం చారిత్రక వాస్తవాల ముందు నిరూపణకు నిలువలేదన్నది అక్షర సత్యం.

సెల్: 9871794037



దీపావళి అంటేనే మిఠాయిలు. నోరు తీపి లేకుండా ఏ పండుగ లేదు. ఆ మిఠాయిలు రెగ్యులర్‌వి కాకుండా.. కాస్త భిన్నంగా ప్రయత్నిస్తే.. ఆరోగ్యానికి ఆరోగ్యం. ఆనందానికి ఆనందం. ఈ పండుగవేళ మీరూ ఈ మిఠాయిలను ప్రయత్నించండి.

# ఆనందం.. ఆరోగ్యం...



## డ్రైఫ్రూట్ లడ్డూ

**కావలసిన పదార్థాలు:**
ఖర్జూరాల తురుము: కప్పు, బాదం: టేబుల్‌స్పూన్లు, ఎండుద్రాక్ష: 2 టేబుల్‌స్పూన్లు, జీడిపప్పు: 2 టేబుల్‌స్పూన్లు, అంజీర్ (ఎండువి): పది, డెసికేటెడ్ కొబ్బరి: 2 టేబుల్‌స్పూన్లు, యాలకులు: రెండు

**తయారుచేసే విధానం :**
బాదం వేయించాలి. అంజీర్ సన్నగా తరగాలి. మిక్సీలో యాలకులు వేసి పొడి చేయాలి. తరవాత ఖర్జూరం, అంజీర్, జీడిపప్పు, బాదం, ఎండుకొబ్బరి అన్నీ వేసి కచ్చాపచ్చాగా రుబ్బాలి. మిశ్రమాన్ని గిన్నెలో వేసి కావాల్సిన సైజులో ఉండలుగా చేయాలి.



## ఆలూ జామూన్

**కావలసిన పదార్థాలు:**
ఉడికించిన ఆలుగడ్డలు– 2, పంచదార– 1 కప్పు, నీరు – 1 కప్పు, మైదా – 2 టీ స్పూన్లు, యాలకుల పొడి –1 టీ స్పూను, వేయించడానికి నూనె.

**తయారుచేసే విధానం :**
ఉడికించిన ఆలుగడ్డల్ని మెత్తగా చిదిమి అందులో యాలకులపొడి, మైదా వేసి బాగా కలుపుకుని చిన్నచిన్న ఉండలుగా చేసుకుని నూనెలో బంగారు రంగు వచ్చేలా వేగించి ఉంచుకోవాలి. కప్పు నీటిలో పంచదార వేసి తీగపాకం వచ్చేక వేగించి ఉంచుకున్న ఆలుగడ్డ ఉండల్ని అందులో వేయాలి. గులాబ్‌జామ్‌ల్లా ఉబ్బి తినడానికి బాగుంటాయి.

## సాబుదానా పాయసం

**కావలసిన పదార్థాలు:**
సాబుదానా – ఒక కప్పు, పాలు – 4 కప్పులు, పంచదార – ఒక కప్పు, జీడిపప్పు పలుకులు – 15, కిస్‌మిస్ – గుప్పెడు, యాలకులు – 6 (పొడి చేసుకోవాలి)

**తయారుచేసే విధానం :**
ముందుగా సాబుదానాని ఆరు లేక ఏడు గంటలు నానబెట్టి, నీరు తీసేయాలి. ఒక గిన్నెలో రెండు కప్పుల నీరు పోసి సాబుదానాను సన్నని మంటపై ఉడికించుకోవాలి. అడుగు అంటకుండా కలుపుతూ ఉండాలి. ఉడికిన తర్వాత నాలుగు కప్పుల పాలు పోసి, కొద్దిగా కాగాక పంచదార వేసి రెండు నిముషాలు ఉడికించాలి. తర్వాత ఒక చిన్న పాత్రలో నెయ్యి వేసి అందులో జీడిపప్పు, కిమిస్‌లు వేసి వేయించాలి. ఉడికిన సాబుదానా పాయసంలో యాలకులపొడి, వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్‌లను వేసి కలిపి దించుకోవాలి. వేడివేడిగా సర్వ్ చేయాలి.





## అంజీర హల్వా

**కావలసిన పదార్థాలు:**
ఎండు అంజీర – ఒకటింబావు కప్పు, నెయ్యి – మూడు టేబుల్‌స్పూన్లు, బాదం పొడి – అరకప్పు, చక్కెర – నాలుగు టేబుల్‌స్పూన్లు, పాలపొడి – ఐదు టేబుల్‌స్పూన్లు, యాలకులపొడి – పావు చెంచా, బాదం పలుకులు – టేబుల్‌స్పూను.

**తయారుచేసే విధానం :**
ఓ గిన్నెలో సగం వరకూ నీళ్ల తీసుకుని అందులో అంజీర వేసి పొయ్యిమీద పెట్టాలి. అవి కాస్త మెత్తగా అయ్యాక దింపేసి నీళ్ల వంపేయాలి. వీటిని మిక్సీజారులోకి తీసుకుని మెత్తని ముద్దలా చేసుకుని తీసుకోవాలి. బాణలిలో నెయ్యి కరిగించి బాదంపొడి వేయించాలి. రెండు నిమిషాలయ్యాక ముందుగా చేసుకున్న అంజీర ముద్ద, పాలపొడీ, చక్కెరా, అరకప్పు నీళ్ల పోసి మంట తగ్గించాలి. ఐదు నిమిషాలయ్యాక యాలకులపొడి వేయాలి. అది దగ్గరకు అయ్యాక దింపేసి బాదం పలుకులు అలంకరిస్తే చాలు.



## ఆపిల్ పాయసం..

**కావలసిన పదార్థాలు:**
ఆపిల్‌పండు– రెండు, కండెన్స్‌డ్ మిల్క్– 200గ్రా., పాలు(కాచి చల్లార్చి ఫ్రిజ్‌లో పెట్టినవి)– 2 కప్పులు, బాదం, పిస్తా, కుంకుమపువ్వు– రుచికి సరిపడా

**తయారుచేసే విధానం :**
ముందుగా కండెన్స్‌డ్ మిల్క్‌లో చల్లని పాలు కలపాలి. ఆపిల్ పండ్ల తొక్కు తీసి గ్రేటర్‌తో సన్నగా తురిమి పాలమిశ్రమంలో కలపాలి. చివరగా బాదం, పిస్తా పప్పుల్ని సన్నగా తురిమి వేయాలి. కుంకుమపువ్వు చల్లి అందించాలి. తాగే తీపిని బట్టి అవసరమైతే కాస్త పంచదార కూడా కలుపుకోవచ్చు.

# ఈ ఆహారంతో బ్రెస్ట్‌క్యాన్సర్ దూరం

నేటి మహిళలను ఇబ్బందిపెడుతున్న ఆరోగ్య సమస్యల్లో బ్రెస్ట్ క్యాన్సర్ ఒకటి. జీవనశైలిలో మార్పులు ఇతరత్రా పలు కారణాల వల్ల పట్టణ మహిళల్లో ఇది ఎక్కువగా కన్పిస్తోంది. దగ్గరి సంబంధీకుల్లో ఎవరైనా ఈ మహమ్మారినుంచీ ప్రమాదాన్ని తగ్గించుకోవాలంటే మొదటినుంచీ ఆహారంలో జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.



- బీటా కెరొటిన్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకుంటే బ్రెస్ట్ క్యాన్సర్ ప్రమాదం తగ్గుతోందని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. మామూలు క్యారట్ల కన్నా బేబీ క్యారట్లలో ఉండే బీటా కెరొటిన్‌ను శరీరం తేలిగ్గా గ్రహించగలుగుతుంది. ఆ తేడా ఏకంగా 500 శాతం ఎక్కువ. కాబట్టి లేలేత క్యారట్లను ఆహారంలో తప్పనిసరి చేసుకోవడం మంచిది.
- నిండు ఎరుపుతో నోరూరించే చెర్రి పండ్లు తినండి. వాటిల్లో ఉండే ఒక పదార్థం క్యాన్సర్‌ని నిరోధిస్తుందని మంచి పేరు.
- వెల్లుల్లి సైతం క్యాన్సర్ కణాల్ని చంపేస్తుంది. అయితే దాన్ని వండుతున్నట్లైతే మాత్రం పొట్టు తీసి, తరిగి ఒక పదినిమిషాలు ఉంచండి. తర్వాతే వంటలో వేయండి. పొట్టు తీయగానే వేడి చేస్తే అందులో క్యాన్సర్‌తో పోరాడే పదార్థాలు తయారయ్యే అవకాశం తగ్గుతుంది.
- విటమిన్ 'డి' తగుపాళ్లలో తీసుకుంటే బ్రెస్ట్ క్యాన్సర్ ప్రమాదం తక్కువ. కాబట్టి వైద్య సలహాతో తగినంత విటమిన్ 'డి' ఆహారంలో ఉండేలా చూసుకోవాలి.
- టమాటాలు వాడండి. కూరల్లో, సూపుల్లో, రసం తీసి... ఏదో ఒక రూపంలో టమాటా తీసుకుంటే అందులో ఉండే లైకోపిన్ బ్రెస్ట్ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.
- రిఫైన్‌డ్ ధాన్యం కన్నా తక్కువ పాలిష్ పట్టిన ధాన్యం వాడాలి. పూర్తిగా రిఫైన్‌డ్ ధాన్యం వాడిన మహిళల్లో బ్రెస్ట క్యాన్సర్ ఎక్కువగా వచ్చినట్లు అధ్యయనాలు చెప్తున్నాయి.
- చల్లగా అయినా, వేడిగా అయినా గ్రీన్ టీ తాగండి.
- వారానికి రెండుసార్లు పాలకూర తిన్నవాళ్లలో... బ్రెస్ట్ క్యాన్సర్ ప్రమాదం సగానికి సగం తగ్గినట్లు పరిశోధనలో తేలింది. ✿

# జుట్టు నెరుస్తోందా?



కొందరికి చిన్నవయస్సులోనే జుట్టు తెల్లబడుతుంటుంది. దీనిని బాలనెరుపు అంటారు. దీంతో కొందరు ఈ సమస్యకు తక్షణ, సులువైన పరిష్కారంగా డై మొదలు పెడతారు. అయితే దీనివల్ల చర్మ సమస్యల వంటి ప్రతికూల ప్రభావాలతో బాటు జుట్టు కూడా బలహీనపడి కాంతిని కోల్పోతుంది. అయితే బాల్యం, యవ్వనంలో ఈ సమస్య వస్తే దానిని తగు చిట్కా వైద్యం, ఆహార నియమాల సాయంతో ఎదుర్కోవచ్చు.

- బాలనెరుపు ఉన్నవారు రోజూ కప్పు ఉసిరికాయ రసం తాగితే జుట్టు కుదుళ్ళు బలపడటమే గాక నెరుపు ఆగుతుంది.
- 10 గ్రాముల వెల్లుల్లి పొట్టును బూడిద చేసి 100 మి.లీ ఆలివ్ ఆయిల్ లో కలిపి 10 రోజులు నిల్వ చేసి దాన్ని రోజూ రాత్రి తలకు రాసుకొని ఉదయం తలస్నానం చెయ్యాలి.
- కరివేపాకు, గుంటగలగరాకు, పొన్నగంటి కూర ఈ మూడింటినీ కలిపి రుబ్బి తలకు రాసి ఆరిన తర్వాత తలస్నానం చెయ్యాలి. ఈ మిశ్రమాలతో పాటు నేల ఉసిరిని కూడా కలుపుకుంటే మంచి ఫలితం ఉంటుంది.
- రెండు మూడు కప్పుల నీటిలో గుప్పెడు రాచ ఉసిరికాయలు వేసి ఉడికిన తర్వాత గుజ్జుగా చేసి దానికి సమపాళ్లలో గోరింటాకు పొడి కలిపి కుదుళ్లకి పట్టించాలి. ఇలా వారానికి కనీసం 3 సార్లు చేస్తే క్రమంగా తెల్ల జుట్టు నల్లగా మారుతుంది.
- ఒక గిన్నెలో 4 చెంచాల చొప్పున నిమ్మరసం, కాఫీ పొడి, గుడ్డుసొన, 2 చెంచాల కొబ్బరినూనె, 2 చెంచాల వడగట్టిన ఉసిరి రసం కలిపి 3 గంటలపాటు అలాగే ఉంచాలి. తర్వాత దానిని జుట్టు కుదుళ్ళ మొదలు చివరలు వరకు పట్టించి ఆరిన తర్వాత తలస్నానం చేస్తే తెల్లజుట్టు నల్లబడుతుంది.
- గోరింటాకు, మందార ఆకు, కరివేపాకు ఈ మూడింటినీ సమపాళ్ళలో కలిపి రుబ్బి తలకు పట్టించి, ఆరిన తర్వాత రాసి తలస్నానం చేస్తుంటే క్రమంగా బాలనెరుపు పోయి, జుట్టు నల్లబడుతుంది.
- ఒక గుప్పెడు తులసి ఆకులను తీసుకుని ఒక కప్పు నీటిలో వేసి, కాచిన తర్వాత ఆ నీటిని గోరు వెచ్చగా ఉన్నప్పుడు కుదుళ్ళలోకి ఇంకేలా రోజూ రాస్తూ ఉంటే జుట్టు నల్లగా మారుతుంది.
- రోజువారీ ఆహారంలో కరివేపాకును పచ్చడి, పొడి వంట రూపాల్లో విరివిగా వాడాలి.

పరగడుపునే రుబ్బిన పచ్చి కరివేపాకు ముద్ద తీసుకుంటే మరింత మెరుగైన ఫలితం ఉంటుంది. ✿

# పాలు తాగుతున్నారా?



స్త్రీలు నేడు సూర్యోదయం మొదలు సూర్యాస్తమయం వరకు ఇంటా బయట నిర్విరామంగా పనులు చేస్తూనే ఉంటారు. కాలంతో పోటీ పడుతు పరుగులు తీసే మహిళల ఆరోగ్యానికి సరైన పోషక ఆహారం ఎంతైనా అవసరం. కానీ సమయం లేదనో, మరేదైనా కారణంచేతనో సరైన ఆహారాన్ని తీసుకోలేకపోతున్నారు. అటువంటివారికి పాలు చక్కగా ఉపకరిస్తాయి.

- మహిళలకు అందుబాటులో ఉండే అత్యంత బలవర్ధకమైన ఆహారంలో పాలు ఒకటి. పాలు అతి తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారం మాత్రమే కాకుండా మంచి ఆరోగ్యాన్ని, ఆయుర్దాయాన్ని కూడా పెంచుతాయి. మహిళలకు వయస్సు మీరే కొద్ది కాల్షియం తగ్గి ఎముకలు విరగడం, ఎముకలకు సంబంధించి వ్యాధులు సోకడం వంటివి జరుగుతుంటాయి. కనుక ప్రతిరోజు పాలను తీసుకోవడం చాలా ముఖ్యమని వైద్య నిపుణులు చెబుతున్నారు.
- పాలలో 87 శాతం నీరు, 4 శాతం కొవ్వు పదార్థాలు, 4.9 శాతం కార్బోహైడ్రేట్లు, 3.35 శాతం ప్రోటీన్లు, 0.75 శాతం ఖనిజ లవణాలు లభిస్తాయి. పాలలో లాక్టోజ్ అనే విశిష్టమైన చక్కెర పూర్తిగా కరిగిపోయి ఉంటుంది. అంతేకాక ఇందులో ఎ, బి, సి, డి విటమిన్లు కూడా లభిస్తాయి.
- చిన్న వయస్సు అంటే 7-10 వయస్సు గల అమ్మాయిలు రోజుకు సుమారు 3-4 గ్లాసుల పాలు, పెరిగే వయస్సులో నాలుగు గ్లాసుల కంటే ఎక్కువ పాలు, పాతికేళ్ళ వయస్సులో 2 గ్లాసుల పాలు రోజూ తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. పాలు తాగేందుకు ఇష్టపడని వారైతే పాల నుంచి తయారైన పెరుగు, మజ్జిగ, వెన్న, నెయ్యి, ఐస్ క్రీమ్‌లు, చాక్లెట్‌లు మొదలైన వాటిని తీసుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ✿

# బలవంతపు పెండ్లి నుంచి బయటపడి...


"పప్పా ఐ లవ్ యూ.. కానీ నువ్వు కోరుకున్నట్టుగా నేను ఉండలేకపోతున్నా. ఓ అపరిచితుడిని నేను పెండ్లి చేసుకోలేను" 37 ఏండ్ల కిందట... ఇంటిని వదిలిపోతూ ఓ యువతిరాసిన లేఖ. ఖండాలు దాటినా... మనసులోని భావజాలం మాత్రం మారలేదు. అక్కల లాగే ఆమెకూ.. పెండ్లి చేసేద్దామనుకున్నారు. ఆ పెండ్లిని కాదనుకుని... ఆమె బయటికి వేసిన ఒక్క అడుగు.. ఇప్పుడు ఎందరి జీవితాల్లోనో వెలుగులు నింపుతోంది. ఆ ఆశాకిరణం జస్విందర్ సంఘేరా.


కూతురు నటాషాతో జస్విందర్

ఉత్తరాదిన చాలా కుటుంబాల్లాగే జస్విందర్ కుటుంబం లండన్‌లోని డెర్బీలో స్థిరపడింది. చదువంతా అక్కడే సాగింది. పెరిగిందంతా అక్కడే... దాంతో అక్కడి జీవన విధానమే అలవడుతుంది. పెరుగుతున్న వయసులో ప్రభావాలే జీవితాంతం పనిచేస్తాయి. జస్విందర్‌కు అలాగే. కుటుంబం లండన్‌కయితే వెళ్లింది కానీ... తమ గౌరవాన్నంత ఇంట్లోని ఆడవాళ్లతోనే ముడిపెట్టే మనస్తత్వం మారలేదు. జస్విందర్‌కు 14 ఏండ్ల వయసులో తల్లి వచ్చిన పక్కన కూర్చుని... 20 ఏండ్ల యువకుడి ఫొటో చూపించి... 'నువ్వు ఇతడిని పెండ్లి చేసుకోబోతున్నావు. ఎందుకంటే నీకు ఎనిమిదేండ్లప్పుడే నేను మాట ఇచ్చాను. మా తల్లిదండ్రులు చెప్పినట్టే నేను నడుచుకున్నాను. నువ్వు కూడా అలాగే నడుచుకోవాలి. నీకు ఇంకో ఛాయిస్ లేదు' అని చెప్పింది. ఏదో ఒకరోజు ఇలా జరుగుతుందని జస్విందర్‌కు తెలుసు. ఎందుకంటే అక్కలకు ఇలాగే జరిగింది. కానీ ఆమె తన అక్కల్లా ఉండిపోదలుచుకోలేదు. చేసుకోనని చెప్పింది. స్కూల్ మాన్పించారు. ఇంట్లో బంధించారు. తన బెడ్‌రూమ్ కిటికీలోంచి దూకి పారిపోదామనుకుంది. కానీ సాధ్యపడలేదు. అమ్మాయి స్కూల్‌కు ఎందుకు రావడం లేదని యాజమాన్యం కూడా అడగలేదు. ఎందుకంటే.. ఆసియా నుంచి వలస వచ్చిన కుటుంబాల్లో సాధారణంగా జరిగే తంతు ఇదని వాళ్లకూ తెలుసు. అందుకే ఇంటినుంచి బయటికి వచ్చి... ఆప్త మిత్రురాలి సోదరుడు పనిచేసే ఫ్యాక్టరీ బయట ఎదురుచూసింది. అతడు రాగానే... నేను ఇంటినుంచి పారిపోతున్నా... నాకు సాయం చేయమని అర్థించింది. ఇంటినుంచి బయటికైతే వచ్చింది. కానీ ఎక్కడకు వెళ్లాలో తెలియదు. పార్కుల్లో బెంచీల మీద పడుకుంది. చివరకు తల్లిదండ్రులు... పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాళ్లు ఆమెను పట్టుకున్నారు. తిరిగి తన తల్లిదండ్రులకు అప్పజెప్పొద్దని పోలీసులను వేడుకున్నది. "అప్పజెప్పకుండా ఉండాలంటే... కచ్చితంగా తల్లిదండ్రులతో ఒకసారి మాట్లాడాలి" అని చెప్పారు పోలీసులు. అలాగే ఫోన్ చేసింది. జరిగిందేదో జరిగిపోయింది... ఇంటికొచ్చేయమంటారని ఎదురుచూసింది. కానీ అలా జరగలేదు. "మేం ఫొటోలో చూపించిన అబ్బాయిని పెండ్లి చేసుకోకపోతే.. మా దృష్టిలో నువ్వు చనిపోయినట్టే"నన్నారు. అదెంత సీరియస్ మాటో... 1981లో ఆమెకు అర్థం కాలేదు. కాలం గడిచిపోయింది. ఆ బాధ మాత్రం పోలేదు. కొన్నేండ్లపాటు ఏడ్చింది. బాధపడింది. ఇప్పుడామె తల్లిదండ్రులు లేరు. తనకంటే ముందే పెండ్లి చేసుకున్న అక్క రాబినా... భర్త వేధింపులను భరించలేక ఆత్మహత్య చేసుకుంది. మిగిలిన అన్నదమ్ముళ్లు, అక్కచెల్లెళ్లు బతికే ఉన్నారు. వాళ్ల పిల్లలకు సైతం పిల్లలయ్యారు. కానీ ఆమెను మాత్రం క్షమించలేకపోయారు. ఆమె చేసిన ఒకే ఒక నేరం... లండన్‌లో ఉండి ఫొటోలో చూపించిన భారతీయ వ్యక్తిని పెండ్లి చేసుకోకపోవడం. ఆమె ముందు అక్కలందరూ అలాగే చేసుకున్నారు. కానీ ఆమె ఒక్కతే ఎదిరించింది. ఇంటినుంచి పారిపోయింది. ఫలితం మొత్తం కుటుంబానికి దూరమైంది.

ఇంటినుంచి పారిపోయేందుకు సాయం చేసిన మిత్రురాలి సోదరుడు జెస్సీతోనే కలిసి జీవించడం మొదలుపెట్టింది. 19 ఏండ్లకు ఓ పాప పుట్టింది నటాషా. తన కుటుంబం దగ్గరకు రానివ్వకపోయినా జెస్సీ కుటుంబం వాళ్లను దూరం పెట్టలేదు. సరికదా ఎంతో సహకారమందించారు. ఎవరితో ఉన్నా.. తల్లిదండ్రులు లేని పూడ్చలేనిది. అందుకే ఆమె నుంచి ఆ బాధను దూరం చేయడానికి జెస్సీ లాంగ్‌డ్రైవ్‌స్‌కి తీసుకెళ్లేవాడు. అర్ధ రాత్రిపూట డెర్బీలోని జస్విందర్ వాళ్ల ఇంటికి తీసుకెళ్లేవాడు. తన ఇంటిని చూస్తూ అక్కడ గంటలు గంటలు కూర్చునేది. పొద్దుటే అక్కలు, అన్నల పిల్లలు ఆడుకుంటుంటే చూసేది. ఆమె గుండిపగిలిపోయేది. దాన్నుంచి నెమ్మదిగా బయటపడింది. తాను కుమిలిపోకుండా తనలా బాధపడుతున్న అమ్మాయిలకు జీవితాన్నివ్వాలనుకుంది. 'కర్మ నిర్వాణ' సంస్థను ఏర్పాటు చేసింది. ఇప్పుడు జస్విందర్ వయసు 53 ఏండ్లు. యూకేలో ఉన్న ఎంతోమంది ఆసియా అమ్మాయిలు... బలవంతపు పెండ్లిళ్లకు బలవ్వకుండా కాపాడుతోంది. ప్రస్తుతం వెయ్యి మంది ఆ సంస్థలో ఉన్నారు. అందులో 58శాతం మంది ఇలాంటి బలవంతపు పెండ్లిళ్ల బాధితులే. ✿

# పౌర సమాజమే ఆర్టీసీని రక్షించుకోవాలి



డా॥ లచ్చయ్య గాండ్ల

కండ్లముందు కదలాడే దేవుడిగా భావించిన ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా తప్పుడు విధానాలు అనుసరించి, ఉద్యోగులు స్థానిక డివిజన్లలో పని చేయకూడదని 370 జీవోను తెచ్చి, తాట తీస్తానని బెదిరిస్తే సెక్రటేరియట్‌లోనే గోచి ఊడేదాకా చీపుర్లు పట్టుకొని తరిమిన ఘటన చరిత్రలో కనుమరుగు కాలేదు. కాబోదు కూడా. తానే సర్వస్వమని, తనదే అసలు సిసలు మానవ రేస్ అని విర్రవీగి రెండో ప్రపంచ యుద్ధానికి కారకుడైన హిట్లర్ కుక్కచావు చచ్చాడు. సంస్కరణల పేరున ఢిల్లీ టు దౌలతాబాద్ తిరిగి దౌలతాబాద్ టు ఢిల్లీకి రాజధానిని మార్చి పిచ్చివాడిగా మారిన తుగ్లక్ పాలన చరిత్ర పుస్తకాలు చదివే వారందరికీ తెలిసిందే.

బహుశా కేసీఆర్ వీరందరికంటే అతీతుడా.. కాడు. కాలేడు కూడా! పోతే హిట్లర్ గొప్పతనం గురించి గోబెల్స్ అనే భజనపరుడు చిలువలు, పలువలు చెప్పేవాడు. అందుకే గోబెల్స్ ప్రచారం అనే నానుడి. ఇప్పుడు గోబెల్స్ పాత్రను కూడా కేసీఆరే పోషించుకుంటూ, ఆర్టీసీపై తప్పుడు ప్రచారం చేస్తున్నాడు. ఆయన మాటల ప్రకారమే ఆర్టీసీని రిపేర్ చేయాలని భావిస్తే, గత ఆరేండ్లుగా చేసిందేమిటో ఆయన ముందుగా చెప్పాలి.

ఒకప్పుడు కేంద్రంలో కార్మిక శాఖ మంత్రిగా పని చేసిన కేసీఆర్‌కు కనీస కార్మిక చట్టాలు తెలియవనుకోలేం. ఒక కార్మికుడిని గానీ, ఉద్యోగిని గానీ తొలగించాలంటే చట్టబద్ధంగా వ్యవహరించాలి. సరైన సంజాయిషీ అడగకుండా, ఆ కారణాలు సరిగా లేనప్పుడు మాత్రమే చర్య ఎందుకు తీసుకోవద్దో కోరుతారు. అదీ సంబంధిత అధికారి మాత్రమే. రాజ్యాంగంలో ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి సర్వస్వం అని లేదు. వారు పదవీ నిర్దేశకులు మాత్రమే. సంబంధిత శాఖ అధికారి న్యాయపరమైన అంశాల్ని, ఇబ్బందుల్ని పరిశీలించి చర్యలు తీసుకుంటారు. చివరికి సస్పెన్షన్ చేయాలన్నా ఈ తతంగమంతా ఉంటుంది. కానీ ఈ రాష్ట్రంలో ఓ ముఖ్యమంత్రి అంతా తానై, తన ఫాంహౌస్‌లా రాష్ట్రాన్ని భావిస్తూ ప్రకటనలివ్వడం హాస్యాస్పదం. ఆయన ఊహిస్తున్నట్టు ఆర్టీసీ కార్మికులు సెల్ఫ్ అవుట్ అయ్యారనడం ప్రపంచపు వింతే. దీనికి మంత్రివర్గం కూర్చోవాలి. చర్చించాలి. ఒప్పుకుంటే చట్ట సవరణ జరగాలి. ఓ జీవో అని మాత్రమే భావించినా గవర్నర్ ఆమోదముద్ర పడాలి. అయినా ఎవరైనా కోర్టుకు వెళ్తే అక్కడ నిలదొక్కుకోవాలి. ఇప్పటికే ఉస్మానియా హాస్పిటల్, ఎర్రమంజిల్, సెక్రటేరియట్ కూల్చివేతలపై కోర్టు వేసిన మొట్టికాయలు కేసీఆర్‌కు ఇంకా సరిపోనట్టున్నవి.

ఆర్టీసీ ఎపిసోడ్‌కు ముందు, రెవెన్యూ ఎపిసోడొకటి చూసాం. కుక్క తోకను ఆడిస్తుంది గానీ, తోక కుక్కను ఆడించదన్న తాత్విక చింతన స్వయాన కేసీఆర్ ప్రస్తావించారు. అంటే ప్రభుత్వం కుక్క అయితే దాని తోక రెవెన్యూ సిబ్బంది అన్నమాట. ఇది వాస్తవమే అనుకుందాం. కానీ ఎన్టీఆర్ సంఘటన జ్ఞప్తికి తెచ్చుకున్నా, ఒరిస్సాలో ఒకనాటి బిజు పాట్నాయక్ ఘనత గుర్తెరిగినా ఉద్యోగులు కుక్కను ఎలా ఆడించారో తెలుస్తుంది. తనకు తెలిసిందే వేదం అనుకునే కేసీఆర్‌కు, సెక్రటేరియట్‌లో అడుగుపెట్టే ధైర్యం మాత్రం లేదు. బహుశా ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇంత పిరికి ముఖ్యమంత్రి కనపడరు. ఇలాంటి వ్యక్తి ఆర్టీసీ కార్మికులు ఒంటరి వారని, వారు ఈ రాష్ట్ర పౌరులు కారన్నట్టుగా ప్రేలాపన చేయడం హాస్యాస్పదం.



రజాకార్లను ఎదుర్కొన్న చరిత్రనే కాదు, బ్రహ్మానందారెడ్డిని, వెంగల్‌రావును, చెన్నారెడ్డిని చివరికి నియంత పోకడలు పోయిన ఇందిరాగాంధీనీ ఎదుర్కొన్న జనం తెలంగాణవారు. చివరికి వైఎస్ఆర్‌నూ ముప్పుతిప్పలు పెట్టింది తెలంగాణ ప్రజలే గానీ, నిరవధిక నిరాహార దీక్ష పేరుతో నాటకమాడిన కేసీఆర్ కాదు. 2012 మార్చి 10న జరిగిన మిలియన్ మార్చ్‌కు, సెప్టెంబర్ 27న జరిగిన సాగర హారం సందర్భంగా కేసీఆర్ ఆడిన నాటకం చరిత్ర పుటల్లో దాగి ఉంది.

తెలంగాణ ఏర్పడి దశాబ్దాలు, శతాబ్దాలు కాలేదు. చరిత్రను సృష్టించిన యువకులంతా ఇంకా యువకులుగానే ఉన్నారు. కనీస హామీలు నెరవేరని రాష్ట్రంలో నెత్తుటి మరకలపై పాలన సాగిస్తున్న కేసీఆర్‌ను చూస్తూనే ఉన్నారు. నిజంగా ఆర్టీసీ సమ్మె అనుచితమని భావిస్తే ప్రజల్లో, యువకుల్లో రెఫరెండం పెట్టే ధైర్యం కేసీఆర్‌కు ఉందా? రోమ్‌నగరం తగలబడుతుంటే ఫిడేల్ వాయించిన నీరో చక్రవర్తిలా మొత్తం రాష్ట్రమంతటినీ ఓ తోకలా భావించి తానాడించినట్టే తోక ఆడాలనడం, సమస్యల్ని పెనంపై నుంచి పొయ్యిలోకి తోయడమే.

అయితే ఈ విషయం సీరియస్‌గా ఆలోచించాల్సింది పౌర సమాజమేనని ఆర్టీసీ సమ్మె సందర్భంగా గుర్తించాలి. ఏ సమ్మె జరిగినా సంబంధిత సిబ్బందిదనే భావన, జీత భత్యాల పెంపుదలకే అనే తప్పుడు భావన నుంచి బయటపడాలి. సమ్మె నేపథ్యాన్ని విధిగా అవగాహన చేసుకోవాలి. ఆర్టీసీ బాగుంటే లాభపడేది ప్రజలే గాని, కార్మికులు కాదు. పోతే వారికి కొంత మేరకు ఉద్యోగ అవకాశాలుండవచ్చు. కాని రాయితీల ద్వారా, పిల్లలు ఉచిత పాసుల ద్వారా, ఊరూరా రవాణా సౌకర్యం ద్వారా లబ్ధిపొందుతున్నది ప్రజలే. కేసీఆర్ తలచినట్టు ముందు 20 శాతం ప్రైవేటుకు అప్పజెబితే రానున్న నాలుగేండ్లలో ఇది 50 శాతానికి చేరుకుంటే ఏ రాయితీ కూడా ఉండదు. ఈ రంగంలో పని చేసే సిబ్బందికి ఉద్యోగ భద్రత ఉండదు. అన్నింటికీ మించి ప్రయాణికుల ప్రాణాలకు గ్యారెంటీ ఉండదు. ఇప్పటికే ఈ మిడిమిడి డ్రైవర్ల హస్తలాగవాన్ని చవిచూస్తున్నాం. ఇదే జరిగితే లాభాల రూట్లలోనే బస్సులు నడుస్తాయి. లాభాలు రాని రూట్లలో ఆర్టీసీని నడిపి మరింత నష్టాల్ని చూపి మొత్తంగా రవాణా సౌకర్యాన్ని ప్రైవేటుకు అప్పజెబుతారు. రాష్ట్రంలో జరగబోయేది ఇదే.

ఇప్పటికే విద్యారంగం చేజారింది. పిల్లల్ని ప్రైవేటులో చదివించలేని పరిస్థితి. ఇప్పుడున్న ఈ కాస్త ప్రభుత్వ రంగ రవాణా సంస్థను కాపాడుకోకుంటే భవిష్యత్తులో ఏ రంగాన్నీ ప్రభుత్వం నడపదు. కండ్లముందు నిజాం చక్కెర కర్మాగారం అస్థిపంజరం కనపడుతూనే ఉంది. వట్టిపోయిన విశ్వవిద్యాలయాలున్నాయి. ఆర్టీసీని కాపాడుకోవాల్సింది పౌర సమాజమే. ఈ లెక్కన కేసీఆర్ అంటే ఏంటో గుర్తించాల్సిందీ పౌరులే.

సెల్ : 9440116162

# విద్యాభివృద్ధికి ఆర్టీసీని రక్షించుకుందాం



జమ్మి అశోక్

రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికి ఆర్టీసీ చాలా దోహద పడుతుంది. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ప్రయాణం ద్వారా తల్లిదండ్రులు వారి పిల్లలను ధైర్యంగా స్కూళ్లకు, కాలేజీలకు పంపిస్తున్నారు. పల్లెకు బడి బస్సు వచ్చి వారి ఇంటిముందు విద్యార్థిని తీసుకొని మళ్లీ సాయంత్రం జాగ్రత్తగా విద్యార్థులను ఇండ్లకు చేరవేస్తున్నది. బడి బస్సు అమ్మాయిలకు రక్షణగా నిలుస్తుందని కూడా తల్లిదండ్రుల నమ్మకం. విద్యా రంగంలో ఆర్టీసీ కార్మికుల కృషి మరువలేనిది. ఆర్టీసీ విద్యార్థులను గమ్యస్థానాలకు చేర్చడమే గాక, పేద, మధ్య తరగతి విద్యార్థుల కోసం ఉచిత బస్‌పాస్ సౌకర్యం కూడా అందిస్తోంది. ఆర్టీసీ బస్‌పాస్ అప్లికేషన్ కోసం స్పాన్సర్లను అడిగి స్పాన్సర్ల ద్వారా విద్యార్థులకు తోడుగా నిలుస్తున్నది. అన్నింటికీ మించి విద్యార్థులకు ఆర్టీసీ భద్రతగా నిలుస్తుంది. ఇది ప్రభుత్వానికి కన్పించడం లేదా? ఈరోజు ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుండా, విద్యా సంస్థలకు దసరా సెలవులు ఈ నెల 13 వరకు 16 రోజులు ఇచ్చారు. ఇప్పుడు 19 వరకు పొడిగిస్తే మొత్తం 22 రోజులు సెలవుల వల్ల విద్యార్థులు తమ విలువైన సమయాన్ని కోల్పోతున్నారని ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిలబస్ పూర్తికాక ప్రభుత్వ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవలే నీతి ఆయోగ్ 20 పెద్ద రాష్ట్రాలకు ప్రకటించిన స్కూల్ ఎడ్యుకేషన్ క్వాలిటీ ఇండెక్స్‌లో తెలంగాణ అట్టడుగున 18వ ర్యాంక్‌లో దిగబడిన సంగతి తెలిసిందే. విద్యార్థులు ఆర్టీసీకి, వారి పోరాటానికి మద్దతుగా నిలుస్తారనే భయంతోనే సెలవులు ప్రకటించి సమ్మె నిర్వీర్యానికి ప్రయత్నిస్తున్నారా? అనే అనుమానాలు లేకపోలేదు. విద్యార్థుల సంక్షేమం గురించి ఆలోచిస్తున్న ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని విద్యార్థి సంఘాలు కూడా డిమాండ్ చేస్తున్నాయి. ఆర్టీసీ సమ్మె ద్వారా ప్రధానంగా వివిధ జిల్లాల్లో గ్రామీణ ప్రాంతాల నుంచీ మారు మూల ప్రాంతాల నుంచీ చదువు కోసం పట్టణాలకు, జిల్లా కేంద్రాలకు ప్రయాణం చేస్తున్నారు. ఈ విద్యార్థులకు ఆర్టీసీ సమ్మె శాపంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4 లక్షల నుండి 6 లక్షల మంది విద్యార్థులు ఆర్టీసీలో రోజూ ప్రయాణం చేస్తున్నారు. నేటి సమ్మె వల్ల వారంతా చదువులు కొనసాగించలేక పోతున్నారు. అంటే రాష్ట్ర వ్యాప్తంగా కనీసం 5 లక్షల మంది విద్యార్థులు ఆర్టీసీ సమ్మె కారణంగా తమ చదువులకు దూరమవుతున్నారు. మాది ప్రజాస్వామ్య యుత ప్రభుత్వం అంటూనే విద్యని ప్రైవేటు పరం చేస్తున్న ప్రభుత్వం ఇప్పుడు ఆర్టీసీనీ ప్రయివేటు పరం చేసేందుకు కుట్ర చేస్తున్నది.

1932లో నైజాం నవాబు కాలంలో నైజాం స్టేట్ రైల్ & రోడ్ ట్రాన్స్‌పోర్ట్ పేరు మీద 27 బస్సులు, 166 మంది ఉద్యోగులతో ప్రారంభమై, గత 87 ఏండ్లలో లక్ష మంది శ్రామికులు, కోట్ల మంది ప్రజల కష్టంతో కూడబెట్టిన ఆర్టీసీ ఇది. ప్రస్తుతం ఆర్టీసీకి 97 డిపోలు, 357 బస్టాండ్లు, 3,687 బస్ రూట్లు, 13 రీజియనల్ ఆఫీసులు, 10,450 బస్సులున్నాయి. ఇవికాక దాదాపు 60,000 కోట్ల ఆస్తి ఉన్నది. ప్రతి ఏడాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల రూపంలో ఆర్టీసీ రూ.4,000 కోట్లు చెల్లిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆసియాలోనే అతి పెద్ద సంస్థగా ఆర్టీసీకి గుర్తింపు ఉంది. లక్షలమంది కార్మికులు కూడబెట్టిన ఆస్తి ఇది. అలాంటి కార్మికుల శ్రమకు గుర్తింపు లేదా? ప్రజాస్వామ్యంలో కార్మికులకు సమ్మె హక్కు లేదా? తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు చెప్పాలి. ప్రజా సేవా రంగాలు అనివార్యంగా ప్రభుత్వం బాధ్యతతో నిర్వహించాల్సిన రంగాలు. కానీ విద్య, వైద్యరంగాల్లో ప్రైవేటీకరణ పెరిగిపోయింది. ఆర్టీసీ లో కూడా ప్రైవేటు బస్సులను అనుమతించడం ద్వారా ఈ సమస్య మొదలైంది. ప్రైవేటు, కార్పొరేట్ శక్తులు మొత్తం రవాణా రంగాన్ని లాభాల కోసం తమ చేతిలోకి తీసుకోజూస్తున్నాయి. అవే నేడు ప్రభుత్వాన్నీ శాసిస్తున్నాయి.


సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రైవేటు బస్సుల యాజమాన్యాల చార్జీల దోపిడీ ప్రజలను జలగల్లా పట్టి పీడిస్తుంది. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వైద్య సౌకర్యం కోసం వెళ్లడానికి గ్రామీణ ప్రాంతాల్లో వున్న వెనుకబడిన ప్రజలు దోపిడీకి గురవుతున్నారు. ఒకతల్లి తన కూతుర్ని హాస్పిటల్‌కు తీసుకు వెళ్లడానికి బస్సుచార్జీలు చూసి కన్నీరు పెట్టుకుంటుంది. రూ.60 చార్జీ వుంటే దానికి రెట్టింపు రూ.120 వసూలు చేస్తున్నారు. బస్సు చార్జీలు చెల్లించలేక ఇలాంటి తల్లులు ఎంతోమంది కన్నీరు పెట్టుకుంటున్నారు. ప్రజల రోజువారీ ఆరోగ్య సమస్యల నేపథ్యంలో ఆర్టీసీ కార్మికుల సమ్మె ఇంకా ప్రభావాన్ని చూపెడుతుంది. ప్రభుత్వం కాలయాపన చేస్తూ, ప్రైవేటు చార్జీల దోపిడీని కూడా అరికట్టడం లేదు. రాష్ట్రంలో సమ్మె మొదలైనప్పటి నుంచి బస్సుల్లో టిక్కెట్లు లేవు. ఇష్టానుసారంగా ప్రజలనుంచి దోపిడీ చేస్తున్నారు. ఇది ప్రభుత్వానికి పట్టదా? ఆర్టీసీ ఆస్తులు ప్రైవేటుపరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఖమ్మంలో డ్రైవర్ శ్రీనివాసరెడ్డి, హైదరాబాద్‌లో సురేందర్‌గౌడ్ ప్రభుత్వ వైఖరిపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నారు. ఉద్యోగుల తల్లిదండ్రులు ప్రభుత్వ ప్రకటనలను చూసి గుండెపోటుతో మరణిస్తున్నారు. ఈ సమ్మెకు ప్రభుత్వం వెంటనే పరిష్కారమార్గం చూపించకపోతే మరో సకల జనుల సమ్మె రాష్ట్రంలో మొదలవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి లోకం కూడా పోరుబాట పడుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. అప్పుడే సమస్య పరిష్కారమవుతుంది.

సెల్ : 9515657095

అభ్యుదయ భావాలు, విప్లవ భావాలు, ఛాందస భావాలు అంటూ భావాల గురించి మనం అనేక సందర్భాల్లో మాట్లాడుకుంటాం. వాటికి సంబంధించిన అర్థ తాత్పర్యాలూ మనకు అవగతమే. కానీ భావాలు అనేవి ఎలా ఏర్పడతాయి? అసలు భావాలు అంటే ఏమిటి? సరైన భావాలు ఏవి? మొదలైన విషయాలపై ఈ సారి కొంత చర్చిద్దాం.

భావాలను, చైతన్యాన్ని, ఆలోచనను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఒక్క మానవ మెదడుకే ఉంది. ఎందుకంటే అది జీవ రూపాల సుదీర్ఘకాల పరిణామం యొక్క ఉత్పత్తి. అంటే మనిషి, మనిషిగా రూపెత్తే క్రమంలో ప్రకృతితో చేసిన పోరాట ఫలితం అది. మెదడులోని సెరెబ్రత్ కార్టెక్స్ పరిణామంలో పెద్దది. ఇది మానవ సంభాషణలను, అంగాలను, హస్తాల చేష్టలను నియంత్రిస్తుంది. మెదడు అనేది ఆలోచనా పరికరం. మానవుడు అస్తిత్వంలోకి వచ్చాక అభివృద్ధి చేసుకున్నది మెదడును కాదు. దాని ఉపయోగాన్ని, దానిలోని సామర్థ్యాలను. కాలక్రమంలోమనిషి చేసే పనులు పెరిగాయి. ప్రకృతిలోని అనేక వస్తువులతో భౌతిక వాస్తవికతతో సంబంధాలు పెరిగాయి. ఈ క్రమంలో జీవన విధానాన్నీ అభివృద్ధి చేసుకున్నాడు.

## కవితా కాంతి




భావాల మొక్కకు
చెమటచుక్కల నీరు పోస్తే
పెరిగిన మహావృక్షమే మార్క్సిజం.
సమతా మమతలూ...
పూలూ పండ్లూ..



– స్ఫూర్తి,
9490098694

# భావాలు ఎలా ఏర్పడతాయి?




కె. ఆనందాచారి

ఆలోచన ఇంద్రియావబోధల నుండి వస్తుంది. ఇంద్రియావ బోధ అంటే తెలివి, ఎరుక, గ్రహణశక్తి లేక జ్ఞానం. మంట దగ్గరికి వెళ్తే కాలుతుందనేది చర్మం ద్వారా (ఇంద్రియ జ్ఞానం) అవగతమౌతుంది. ఇదే ఎరుక. కాలుతుందనే ఆలోచనతో దాని పరిసరాలకు వెళ్లడు. వెళ్లకూడదనే ఆలోచన ఇంద్రియావబోధ ద్వారా తెలిసింది. దీనిద్వారానే ఆలోచన మొదలవుతుంది. ఆలోచన లేకుండా భావం లేదు. కాబట్టి ఇంద్రియావ బోధలేని భావం లేదు. ఆలోచన ఆరంభానికి ప్రపంచాన్ని చూడాలి. ప్రకృతితో సామూహిక సంబంధంలోంచే భావాలు ఏర్పడతాయి. ఎందుకంటే అరణ్యం లో ఒక్కడుగానే పెరిగిన శిశువుకు ఏ భావాలూ ఉండవు. సామాజిక సంబంధాలు, సామాజిక కార్యకలాపాలు పెరిగితే ఇంద్రియావబోధలు పెరుగుతాయి. అందుకని ఆదిమ మానవుని భావాలకంటే ఆధునిక మానవుని భావాలు అధికంగా ఉంటాయి. కాబట్టి మానవుని సామాజిక జీవనమే భావాల పుట్టుకకు కారణం. పంచేంద్రియాల ద్వారా గ్రాహకమైన జ్ఞానం, ఒక గెంతు ద్వారా భావ దశకు చేరుకుంటుంది. ఇదొక భావనీకరణ క్రమం. మంట ఒకసారి కాలి, మరొకసారి లేదా మరోరోజు కాలకపోతే మంట కాలుతుందనే భావం ఏర్పడదు. ఒక స్థిరమైన భావానికి, సూత్రీకరణకు వచ్చేది, మంట ఎప్పుడైనా, ఎక్కడైనా కాలే గుణాన్ని కలిగి ఉంటుందనేది ఆచరణలో రుజువైన అంశంగానే ఒక భావాన్ని ఏర్పర్చుకుంటాం. అంటే సరైన భావాలకు, సూత్రాలకు ఆచరణ ద్వారా జరిగే నిర్ధారణలే కారణమవుతాయి. జంతువుకంటే మానవుని ఇంద్రియావ బోధ పరిధి విశాలమైంది. ఎందుకంటే మానవ కార్యకలాపాల పరిధి కూడా విశాలమైంది. ఇవి జ్ఞానేంద్రియాల భావాల అభివృద్ధికి తోడ్పడతాయి.

మనిషి సమాజంలో జీవిస్తాడు. సాటి వారితో కలిసి శ్రమిస్తాడు. అతడి సంపూర్ణ జీవన విధానం సామాజికమైంది. అందుకనే అతని సామాజిక కార్యకలాపం ఇంద్రియావ బోధలను విస్తృత పరుస్తుంది. కాబట్టి సామాజిక కార్యకలాపం ఇంద్రియావ బోధలు, వీటి నుండి భావాలు, భావాల నుండి ఆలోచనలు అభివృద్ధి చెందుతాయి. శ్రమలోనే ఆలోచన, సంభాషణల మూలాలు లభిస్తాయి. మానవ అస్తిత్వానికి మౌలిక షరతు శ్రమ. 'మనిషిని సృష్టించేది శ్రమ' అని ఎంగెల్స్ స్పష్టం చేశాడు. మానవుడు తన జీవనాధారాల ఉత్పత్తిలో పరికరాల తయారీలో పాదార్థిక జీవిత ఉత్పతిలో సామాజిక నిర్మాణం ఏర్పడింది. ఫలితంగా మనుషులు, మనుషులుగా పని చేయడం ప్రారంభమైంది. ఈ క్రమంలోనే భావాలు నిర్మించుకున్నారు. అభివృద్ధి చేశారు. మాట్లాడటం మొదలు పెట్టారు.

మానవ శ్రమలో చైతన్యం, సహకారం, లక్ష్యం ఉంటాయి. మానవుని కార్యకలాపాలు పెరగటం వల్ల శ్రమ పెరిగింది. తత్ఫలితంగా సమిష్టి, సహకార కార్యాచరణ పెరిగింది. పరిసరాల పట్ల నూతన అవగాహనలూ పెరిగాయి. దీంతో ఒకరితో ఒకరు తమ ఆలోచనలు పంచుకోవాల్సి వచ్చింది. ఈ అవసరాన్నుండే చెప్పుకునే సాధనాన్ని సాధించాడు. శ్రమలోనే భాషా మూలాలున్నాయి. జంతువు నుండి మానవుడు వేసిన ముందడుగు ఈ ద్వితీయ సంకేత వ్యవస్థ. ఇంద్రియ ప్రేరణలు జ్ఞానేంద్రియావ బోధల నుండి మానవుడు వేసిన ముందడుగు భావాలు.

మనం ఎదురుగా ఉన్న వస్తువులను చూస్తాం. ఆ వస్తువుల గురించి ఆలోచిస్తాం. మనం ఒక వస్తువును, భౌతికాంశాన్ని చూసినప్పుడు దానితో మనకున్న సంబంధం తో గమనిస్తాం. వాటి లక్షణాలను చూస్తాం. వాటిని గ్రహించి, భావాలను ఏర్పర్చుకుంటాం. దీనిలో ఆలోచనాశక్తి ఉంది. ఒక క్రూర జంతువు ఎదురు పడిందనుకో, ఏం చేయాలో మానవుని మెదడులోకి ఒక ఆలోచన వస్తుంది. ఒక పెద్ద దుడ్డు కర్ర కోసం వెతుకుతాడు. ఎందుకంటే సన్నకర్రతో దాన్ని ఎదుర్కోలేమని అనుభవం ద్వారా తెలిసిన జ్ఞానం. అప్పుడు అడవిలో తిరిగేప్పుడు పెద్ద కర్రను కలిగి ఉండాలనే ఆలోచన ఏర్పడింది. ఈ ఆలోచనను తోటి మానవునికీ చెప్పగలుగుతాడు. ఏం చేయాలి? ఏం జరగాలి. అనే దానికి ఆలోచనే ప్రతినిధి. ఆలోచనల్లో ప్రయోగాలు చేస్తాం. పర్యవసానాలను ఆ చరణలో పెడతాం. ఫలితాలను, ప్రయోగాలను నిరూపిస్తాం. ఇది ఆలోచనాసారం. శ్రమ ప్రక్రియ ఫలితం. ఒక జంతువు నుండి రక్షణకు దుడ్డుకర్ర సరిపోతుంది. మరి ఒక జంతువును చంపి ఆహారంగా మార్చుకోవాలనే లక్ష్యానికి నాలుగు వైపుల నుండి కర్రలతో జంతువుపై దాడి చేయాలనే వ్యూహం ముందుగా పన్నుతాడు. జంతువులు కూడా తమ ఆహార వేట రూపాన్ని మెదడులో చిత్రిస్తాయి. కానీ పరికరాన్ని తయారు చేసుకోలేవు. పరికరాన్ని తయారు చేసే డిజైన్ మనిషి మెదడులో ఉంటుంది. కాబట్టి ఈ విషయాల లక్షణాలపై భావాలు ఉంటాయి. అప్పుడు లక్ష్యాన్ని సాధిస్తాడు. భావాలు రూపుదిద్దుకున్నాక చైతన్యం అద్భుతంగా అభివృద్ధి చెందింది. ఇది ఒక జంతువు నుండి మానవ జీవితానికి వేసిన గెంతు. మానవుడు ప్రకృతిని ఉపయోగించడమే కాక దానిపై యాజమాన్యాన్ని సాధించాడు. అలాగే భావాలలో కేవలం విషయాలను దర్శించి ప్రదర్శించడమే కాక, విషయాల అంత:సంబంధాలను, కారణాల జాడలను తెలుసుకున్నాడు. ఇలా భాష ద్వారా ఆలోచనా శక్తి పెరిగింది. భావాల అభివృద్ధీ పెరిగింది. ఇవన్నీ సంభాషణతోనే అభివృద్ధి చెందాయి. సంభాషణ సామాజిక అవసరంగా ప్రారంభమైంది. అందుకని భాష, భావాలు, ఆలోచనలు, చైతన్యం మొదలైనవన్నీ సామాజిక చలనం యొక్క ఉత్పాదితాలు. సామాజిక చలనాలన్నింటికీ శ్రమ కారణం.




మార్క్స్ మార్గం @ 200 +
29

భావాలు భాష ద్వారానే సాధారణీకరించబడతాయి. ఉదాహరణకు, కుర్చీ, బల్ల, కారు. ఇవి విషయాలకు సంబంధించినవి. ఎరుపు, నలుపు ఇవి గుణాలకు సంబంధించినవి. నడక, పరుగు ఇవి చర్యలకు సంబంధించినవి. కింద, పైన ఇవి సంబంధాలకు సంబంధించినవి. సామాజిక సంబంధంలో సాధారణ భావాలు అధికంగా నిర్మాణమవుతాయి. ప్రత్యక్షంగా సంబంధంలేని వస్తువుల పై భావాలను నిర్మించుకోగలమా? నిర్మించుకోగలము. మనుషులు ప్రత్యక్షంగా కనపడతారు. పొట్టి, పొడవు, లావు ఇవన్నీ మనకు కనపడేవి. కానీ కనపడని లక్షణాలూ ఉంటాయి. ఉదాహరణకు దుర్మార్గుడైన మనిషి అన్నాననుకోండి. ఈ లక్షణం మనకు కనపడదు. ఇలాంటి సాధారణ భావాలు అనేకం వాడుతుంటాము. సామాజిక, నైతిక, మత, తాత్విక భావాలన్నీ సాధారణ భావాలే. మనిషి అనగానే చూపిస్తాము. కానీ హక్కులు అన్నామనుకో ఏం చూపిస్తాం. కేవలం వివరిస్తాం. కుర్చీ అనేది ఒక సాధారణ భావం. ఎలాంటి కుర్చీ, ఇనుపదా, చెక్కదా, ఇవి ప్రత్యేకతలు. కానీ కుర్చీ అనేది కూర్చునేది అనేది సాధారణ భావం. మానవుల సాధారణ భావాల అభివృద్ధిపై మరో ముఖ్యమైన ప్రభావమూ ఉంది. అది మానవుల సాపేక్ష అజ్ఞానం. నిస్సహాయత. ఉదాహరణకు పంటలు పండుతున్నాయి. పశు సంపద పెరుగుతోంది. కానీ వాటి అభివృద్ధి ప్రక్రియలోని అంతర్గత కారణాలు వారికి తెలియదు. ఫలితంగా అదృశ్య శక్తులపై భావాలను నిర్మించడం ప్రారంభించాడు. జంతువులు, మనుషులలో గుప్త శక్తులున్నాయని తొలి మానవులు భావించారు. జ్ఞానేంద్రియాలకు తెలువవనుకున్నారు. అదృశ్య శక్తులపై సాధారణ భావాలు మతం, మత ధర్మ శాస్త్రాలు అభివృద్ధి చెందాయి. మానవుల మధ్య సంబంధాలు సాధారణ భావాల అభివృద్ధికి ముఖ్యమైన మూలధారం. ఎవరు ఏం చేయాలి? ఎవరు ఏ వారసత్వానికి సంబంధీకులు ఇవన్నీ సామాజిక సంబంధాలకు సంబంధించిన భావాలు. ఆ తర్వాత గుంపు పెద్దకు సంబంధించిన భావాలు. తర్వాత వ్యక్తిగత ఆస్తి. దీనిపై ఆస్తికి సంబంధించిన భావాలు, తరువాత భూమిపై కొందరి ఆధిపత్యం వెలిసింది. భూ సంబంధాల భావాలు ఏర్పడ్డాయి. వాటికి సంబంధించిన హక్కులు, బాధ్యతలు, హోదాలపై భావాలు. యాజమాన్యంపై భావాలు. దుక్కి దున్నడం. పంట పండటం ఇవి ఇంద్రియావ బోధలు గ్రహించగల వాస్తవం. పంటను తింటాం. కానీ పంట ఉత్పత్తిని సొంతం చేసుకునే హక్కు ఇంద్రియావ బోధలకు అందదు. సామాజిక ఉత్పత్తి పరిణామంలో కొన్ని సామాజిక సంబంధాలు ఏర్పడతాయి. ఆ సంబంధాల ఫలితమే ఈ హక్కులు. అంటే గణ సమాజపు సహకారం, చైతన్యం క్రమంగా ప్రత్యేక వ్యక్తుల చైతన్యంగా మారుతుంది. సామాజిక ఉత్పత్తి క్రమంలో అందరూ సమానమే అన్న భావం పోయి, కొందరు ప్రత్యేక హక్కులు గల వారనే భావం ఏర్పడింది. ప్రత్యేక హక్కులు కలిగి భూమినీ, ఉత్పత్తినీ సొంతం చేసుకున్నవారు శ్రమ చేయాల్సిన అవసరం లేకపోయింది. ఇక్కడే శారీరక శ్రమ నుండి మానసిక శ్రమ విడివడింది. శ్రమ విభజన జరిగింది. శ్రమ విభజన గుంపును ప్రత్యేక శక్తులుగా విభజిస్తుంది. కాబట్టి వారు చేసే శ్రమకు సంబంధించిన అనుభవాల నుండి భావాలు ఉద్భవిస్తాయి. సాధారణ భావాల నిర్మాణంలో, శారీరక శ్రమ నుండి మానసిక శ్రమ వేరుపడి భావాలు వైరుధ్యంలోకి వచ్చాయి. శారీరక శ్రమకు దూరంగా ఉండి, మానసిక శ్రమ చేసే కొందరు వ్యక్తులు రుషులు, మునులు, విజ్ఞులు, పెద్దలు, నాయకులు, పండితులు, కవులు, పురోహితుల అవతారమెత్తారు. వీరు భావాల నిపుణులుగా ప్రసిద్ధికెక్కారు. శారీరక శ్రమకు దూరమైన కొద్దీ, సమాజంలోనీ, ప్రకృతిలోని సంబంధం తెగిపోతుంది. దీంతో వారి సాధారణ భావాలలో మహాత్యాలు బయలుదేరాయి. వాస్తవాల నుండి ఏర్పడే సాధారణ భావం పావురంలా ఎగిరిపోతుంది. ఇక చైతన్యం అనేది స్వీయ పొగడ్తలకు లోనవుతుంది. వాస్తవాలు తెలుసుకోకుండా వాస్తవాల గురించి ఆలోచిస్తుంది. ప్రపంచానికి దూరమైన సిద్ధాంతాలను, మత ధర్మం, తత్వ శాస్త్రాలను, నీతి శాస్త్రాన్ని నిర్మిస్తుంది. దీని ఫలితంగా సమాజ మానసిక అభివృద్ధి ప్రక్రియలో వైరుధ్యాలు ఏర్పడతాయి. ఒకవైపు అసలైన, వాస్తవ ప్రపంచంతో నిర్మితమైన భావాలు. మరోవైపు భ్రమలతో కూడిన భావాలు. భౌతిక ప్రపంచంతో సామాజిక సంబంధాలతో సంబంధం లేని చైతన్యం నుండి ఉద్భవించినవే భావవాదం యొక్క భావాలు. అందుకు భిన్నంగా నిత్య ఆచరణతో సమాజం, ప్రకృతి సంబంధంతో ఏర్పడేవి భౌతికవాద భావాలు. భౌతికవాద భావాలను ఈ ప్రపంచాన్ని మానవులు తమకు ప్రయోజనకరంగా మార్చుకోవడంలోనే సరైన భావాలు ఏర్పడతాయి.

సెల్ : 9948787660

# ప్రభుత్వంపై ప్రజల్లో అసహనం పెరుగుతుందా?



డా॥ పోలం సైదులు


తెలంగాణ అంటేనే ఉద్యమాల గడ్డ. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో ఉద్యమ పాఠాలు నేర్పిన పార్టీ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించాక జరిగిన ఎన్నికలలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, రెండో దఫా సైతం అధికారాన్ని చేజిక్కిచ్చుకున్న పార్టీ క్రమంగా ప్రజల మన్ననలను కోల్పోతుందా? అంటే ఈ ఐదేండ్ల పరిపాలన కాలంలో జరిగిన సంఘటనలు, జరుగుతున్నా తీరు, దానికోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలను చూస్తుంటే నిజమనిపిస్తుంది. ఏ ప్రభుత్వమైనా ప్రజల దృష్ట్యా నేరుగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా న్యాయాన్యాలను విచారించి, మేధావులతో చర్చించి, నిర్ణయాలు ప్రకటించి, అందులో సైతం ఏమైనా ఒప్పుకోలేని విషయాలుంటే, ఎందుకు ఒప్పుకోలేని పరిస్థితి ఏర్పడిందో వివరణ ఇచ్చి సర్దిచెప్పే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

ఆర్టీసీ కార్మికులు సమ్మె చేయడం, ప్రారంభంలోనే అణిచివేసే ధోరణితో బెదిరించడం, ఆ తర్వాత కొలువులే లేకుండా చేస్తామని ప్రకటించడం, తాత్కాలిక సిబ్బందిని నియమించుకొని పోలీసుల సహాయంతో బస్సులను నడపడంతో కార్మికులు ఉద్యమాన్ని ఉదృతం చేయడమే గాక, ప్రతిపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు సైతం మద్దతు తెలిపి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నాయి. కానీ ప్రభుత్వ మొండి వైఖరితో ఇద్దరు కార్మికులు ఆత్మార్పణమయ్యారు. ఆ కుటుంబాల పరిస్థితి తలుచుకుంటే ఎవరికైనా గుండె బరువెక్కుతోంది. దీనంతటికీ కారణం ఎవరు? ప్రతి సమస్యకు ఒక పరిష్కార మార్గముంటుంది. దాని ప్రకారమే నడవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. గత చరిత్రను తిరగేస్తే జయలలిత, ఇందిరాగాంధీ, నందమూరి తారక రామారావులు ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే ఏం జరిగిందో అందరికీ తెలిసిందే. మొదటిసారి ప్రభుత్వ ఏర్పాటుకు ముందు ఇచ్చిన హామీలు నిరుద్యోగ నిర్మూలన, నిరుద్యోగ భృతి, విద్యా వ్యవస్థలో మార్పులు, రెండు గదుల ఇండ్లు వంటివి నెరవేరకపోవడంతో ప్రజలు ప్రభుత్వంపై అసహనంతో ఉన్నారు. మొన్నీమధ్య జరిగిన ఇంటర్మీడియేట్ పరీక్షా ఫలితాలు, విద్యార్థుల ఆత్మహత్యలు, ఇసుక అక్రమ రవాణా, రైతులపై జరిగిన లాఠీచార్జి, మల్లన్న సాగర్ విషయాలలో ప్రజలు లేవదీసిన ఉద్యమాల ఫలితంగా ప్రజలు అధికార పార్టీపై కోపంతోనే ఉన్నారు.

సమాజంలో ప్రభుత్వమంటే ఇంటి పెద్దలా, తండ్రి పాత్ర పోషిస్తుంది. అన్ని రకాల విభాగాలు పిల్లలలాంటివారు. కొన్నిసార్లు కుటుంబంలో చిన్నచిన్న కలహాలు, గొడవలు వచ్చినా కూర్చోని మాట్లాడుకోవడం, సర్ది చెప్పుకోవడం లాంటివి చేస్తూ గాడిలో పెట్టడంలో కుటుంబ పెద్ద కీలకపాత్ర పోషిస్తాడు. సమాజంలో సైతం అలాగే కొనసాగితే మనుగడ సక్రమ దారిలో పయనిస్తుంది. ఇరువురి మధ్య సమన్వయ లోపం వలన సర్దుబాటు గాకుంటే వాటి ఫలితాన్ని ఇద్దరు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ప్రభుత్వం గ్రహించాలి. ప్రభుత్వ బాధ్యతారాహిత్య మొండి వైఖరితో కార్మిక సోదరులిద్దరు ఆత్మ హత్యలకు పాల్పడటం దురదృష్టకరం. అలాంటి ఆలోచన ఎవ్వరికి రాకూడదు. ఏదైనా పోరాడి సాధించుకోవాలి. ఆత్మహత్యలు పరిష్కారం కాదు.

సెల్ : 9441940361

# అణు విద్యుత్ పెను విధ్వంసం




టి. హరికష్ణ

కొన్ని రోజులుగా నల్లమల అటవీ ప్రాంతంలో యురేనియం వెలికితీతకు సంబంధించిన ముందస్తు కార్యక్రమాలను తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలు తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ నల్లమలలో యురేనియం నిక్షేపాలు ఎంత మొత్తంలో ఉన్నాయో ఖచ్చితంగా అంచనా వేసేందుకు సర్వే చేయడానికి అనుమతి ఇచ్చినది. యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(యుసీఐఎల్) అనే ప్రభుత్వ సంస్థ సర్వే మొదలు పెట్టింది. ఇందుకోసం 10 సెప్టెంబరు 2019న నల్లగొండ జిల్లా దేవరకొండకు వచ్చిన యూసీఐఎల్ అధికారులను పర్యావరణ కార్యకర్తలు, ప్రజలు ఏకమై అడ్డుకున్నారు. అటవీ హక్కుల చట్టం 2005, పీసా చట్టం 1/70 ప్రకారం వన్యప్రాణులను సంరక్షించాలని నినదించారు. యురేనియం లాంటి అణుధార్మిక పదార్థాల కేంద్రకాలను చిన్న అణుకేంద్రకాలుగా విడగొట్టినపుడు స్వల్ప మొత్తంలో పదార్థం (ద్రవ్యరాశి) ధ్వంసమై శక్తిగా మారుతుంది. ధ్వంసమయ్యేది అతి స్వల్పమే అయినా వెలువడే శక్తి మాత్రం అపారం. ఒక కిలో బొగ్గును మండిస్తే 8కిలోవాట్స్ ఉష్ణం వెలువడితే 1 కిలో యురేనియం నుంచి 24,000,000కిలోవాట్స్ ఉష్ణం ఉత్పత్తి అవుతుంది. అంటే బొగ్గుతో ఉత్పత్తి అయ్యే ఉష్ణం కంటే యురేనియంతో ఉత్పత్తి అయ్యే ఉష్ణం ముప్పై లక్షల రెట్లు ఎక్కువ.

యురేనియం బదులుగా థోరియం లాంటి ఇతర అణుధార్మిక పదార్థాలను కూడా ఈ ప్లాంట్లలో ఇంధనంగా వాడుకోవచ్చని ప్రభుత్వాలు వింత వాదనలు వినిపిస్తుంటాయి. ఇవి అణుధార్మిక పదార్థాలను ఉత్పత్తి చేస్తే పర్యావరణానికి, ప్రజలకు జరిగే నష్టాన్ని తక్కువ చేసి చూపుతున్నాయి. ఒకవేళ భూకంపాలు, సునామీలు లాంటి ప్రకృతి విపత్తులు సంభవించి అణువిద్యుత్ ప్లాంట్లు ప్రమాదానికి గురైతే జరిగే నష్టాన్ని పూర్తిగా దాచిపెడుతున్నాయి. నిజాలు దాచి నష్టాన్ని తక్కువ చేసి చూపి కేవలం లాభాలనే ఎక్కువ చేసి చూపడం ప్రజల్ని వెర్రివాళ్లను చేయడమే.

భారత ప్రభుత్వం పై కారణాల వల్లనే కాక చైనా అమెరికా తరువాత కర్బన ఉద్గారాలలో భారత్ మూడో స్థానంలో ఉన్నందువల్ల, వాటిని 2005తో పోల్చినపుడు 2030 నాటికి 33 నుంచి 35 శాతానికి తగ్గించుకుంటానని పారిస్‌లో 2016న జరిగిన ఒప్పందంపై సంతకం చేసినందువల్ల కూడా ఈ అణువిద్యుత్ పట్ల మక్కువ పెంచుకున్నాయి. అంతేకాదు యునైటెడ్ నేషన్స్ పారిస్ క్లైమేట్ సదస్సులో 2040 నాటికి దేశం ఉత్పత్తి చేస్తున్న మొత్తం విద్యుత్‌లో 40 శాతం విద్యుత్‌ను పునరుత్పాదన లేదా అణువిద్యుత్ ద్వారా ఉత్పత్తి చేసి హరిత వాయు ఉద్గారాలను తగ్గిస్తానని వాగ్దానం చేసినందువల్ల కూడా ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి అనువిద్యుతే ప్రత్యామ్నాయం అని ప్రభుత్వాలు భావిస్తున్నాయి.



అణువిద్యుత్ వల్ల కర్బన ఉద్గారాలు గణనీయంగా తగ్గించగలుగుతాయేమొగాని పర్యావరణానికి జరిగే నష్టాన్ని మాత్రం నివారించలేము ఎందుకంటే యురేనియం త్వకాలు చేపట్టిన ప్రాంతాల్లో మిగిలిన వ్యర్థాలు గాలిని నీటిని కలుషితం చేస్తాయని తెలిసిన తరువాత అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాలు కూడా చాలా చోట్ల యురేనియం తవ్వకాలను నిలిపివేశాయి. ఒక టన్ను ముడిపదార్థం నుంచి కేవలం 2.94 గ్రాముల శుద్ధిచేసిన యురేనియం లభిస్తుందని తెలిసింది. మిగిలిందంతా వ్యర్థపదార్థమే. ఈ వ్యర్థాలు కూడా పర్యావరణానికి తీవ్రమైన హాని కలుగచేసే రేడియోధార్మికతను వెలువరుస్తాయి. ఐఏఈఏ ఈ వ్యర్థాలను పదిలపరచడానికి మార్గదర్శకాలను రూపొందించింది. కానీ ఈ మార్గదర్శకాలను పాటించే దేశాలు కొన్ని మాత్రమే. ఖచ్చితంగా నిబంధనలను పాటించకపోవడం వల్ల ఈ అణువ్యర్థాలు ఎంత హాని కలిగిస్తాయో అనడానికి మనదేశంలోని జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన జాదుగూడ యురేనియం మైనింగ్ ప్లాంటే ఓ ఉదాహరణ. అక్కడ ఇప్పటికే కొన్ని వందల మంది క్యాన్సర్‌తో మరణించారు. ఏ కారణం లేకుండా గర్భస్రావాలు కావడం, అంగవైకల్యంతో జన్మించడం జన్యుపరమైన లోపాలతో పుట్టడం అక్కడ ఇప్పటికే సర్వసాధారణం. ఇవే రకమైన వ్యాధులతో ఆంధ్రప్రదేశ్ కడప జిల్లాలోని తుమ్మలపల్లి యురేనియం మైనింగ్ ప్రాంతలోని ప్రజలు కూడా బాధపడుతున్నారు.

ప్రపంచ అనుభవాలు కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేవు. 26 ఏప్రిల్ 1986న రష్యా(ఉక్రేయిన్) లో గల చెర్నొబిల్ అణువిద్యుత్ కేంద్రంలో జరిగిన ప్రమాదం వల్ల సుమారు 4 వేల మంది మరణించారు. లక్షలాది మంది ఇప్పటికీ వివిధ అనారోగ్యాలకు గురవుతున్నారు. పర్యావరణం కూడా రేడియోధార్మికతకు గురవ్వడం వల్ల ఆ ప్రాంతంలో కూరగాయలతో పాటు పాలలో కూడా ఇప్పటికీ ప్రమాదకర స్థాయిలో రేడియోధార్మిక పదార్థాలు ఉన్నాయని పరిశోధనలు చెబుతున్నాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయ అనుమతి ఇచ్చిన యురేనియం మైనింగ్‌కు ఉద్దేశించబడిన ప్రాంతం నల్లమల అభయారణ్యంలో ఉంది. సర్వే కొరకు అనుమతి ఇవ్వబడ్డ ప్రాంతపు విస్తర్ణం 83 చదరపు కిలోమీటర్లు. అంటే సుమారుగా 20, 510 ఎకరాలన్నమాట. ఈ లెక్కన ఈ మైనింగ్ వల్ల తెలుగు రాష్ట్రాలకు ఊపిరితిత్తులుగా పేరొందిన నల్లమల అడవిలో 20 నుంచి 30 వేల ఎకరాల అడవి ధ్వంసం అయిపోతుందన్నమాట.

ఆశ్చర్యమైన విషయమేమిటంటే ఈ ప్రాంతంలోనే అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ఉంది. దేశంలోనే రెండో అతిపెద్దదైన ఈ రిజర్వ్ ఫారెస్టును కాపాడాలనే నెపంతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అక్కడ నివసిస్తున్న ఆదివాసులైన చెంచులను బలవంతంగా ఇతర ప్రాంతాలకు తరలించాలని చూసాయి. అప్పుడు మనుషులకన్నా పులులు ముఖ్యమని భావించిన ప్రభుత్వాలు ఇప్పుడు మాత్రం మనుషులు, పులులు వన్యప్రాణులకన్నా, యురేనియమే ముఖ్యమని భావిస్తున్నాయి. ప్రభుత్వాల బాధ్యతారాహిత్యానికి ఇది ఒక మంచి ఉదాహరణగా నిలుస్తున్నది. నష్టాల జాబితా ఇంతటితో అయిపోలేదు. ఈ ప్రాంతంలో యురేనియం మైనింగ్ మొదలుపెడితే దీనికి కేవలం 0.5 కిలోమీటర్ల దూరంలోని శ్రీశైలం రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ద్వారా నీళ్లు కూడా కలుషితం అవుతాయి. అంటే లక్షలాది ప్రజానీకం భద్రత ప్రమాదంలో పడుతుంది.

ఇన్ని కారణాల వల్ల నల్లమలలో యురేనియం మైనింగ్‌ను వ్యతిరేకించాల్సి ఉన్నది. కనుక ఖర్చు ఎక్కువా తక్కువా అనే చర్చ పక్కనబెట్టి పర్యావరణహితమైన పురుత్పాదక శక్తి వనరులైన సౌర, పవన, జలవిద్యుత్తులే దేశాభివృద్ధికి కీలకమని 1960లోనే సూచించిన డీడీవంటి ధార్మికుల స్ఫూర్తితో అణువిద్యుత్‌కు వ్యతిరేకంగా ఐక్యపోరాటం చేయాల్సి ఉంది.

సెల్ : 9494037288

epaper.navatelangana.com

# నవచిత్రం


ప్రభాస్

## వార్ 2తో బాలీవుడ్ ఎంట్రీ


ప్రభాస్ తన 40వ పుట్టిన రోజుని లండన్‌లో సెలబ్రేట్ చేసుకున్నారు. అయితే బర్త్ డే సందర్భంగా తన కొత్త చిత్రానికి సంబంధించిన ఏదైనా అప్‌డేట్ వస్తుందని ఊహించిన అభిమానులకు నిరాశే ఎదురైంది. ప్రస్తుతం రాధాకృష్ణ దర్శకత్వంలో నటిస్తున్న చిత్ర షూటింగ్ అప్‌డేట్ తప్ప టైటిల్‌గానీ, ఫస్ట్‌లుక్‌గానీ విడుదల చేయలేదు. అలాగే కొత్త సినిమాలకు సంబంధించి కూడా ఎలాంటి ప్రకటన రాలేదు. దీంతో ఆయన ఫ్యాన్స్ కాస్త నిరాశగానే ఉన్నారు. ఈ నేపథ్యంలో లండన్ నుంచి తిరిగొచ్చాక కొత్త సినిమా ప్రకటన చేయబోతున్నట్టు తెలుస్తుంది. అంతేకాదు దీపావళి కానుకగా తాజా చిత్ర ఫస్ట్‌లుక్ వచ్చే అవకాశం ఉందట. కొత్త ప్రాజెక్ట్‌ల విషయానికి వస్తే ఆయనతో సినిమా చేసేందుకు ఇప్పుడు పరుశు రామ్, సురేందర్‌రెడ్డి క్యూలో ఉన్నారు. అలాగే పలువురు బాలీవుడ్ దర్శకులు కూడా రెడీగా ఉన్నారట. మరి వీరిలో ఎవరికి ప్రభాస్ గ్రీన్ సిగ్నల్ ఇస్తారనేది సస్పెన్స్‌గా మారింది. మరోవైపు బాలీవుడ్ ఎంట్రీకి కూడా ప్రభాస్ రంగం సిద్ధం చేసుకుంటున్నారట. అయితే 'వార్ 2'లో ప్రభాస్ నటించే ఛాన్స్ ఉందని తెలుస్తుంది. హృతిక్ రోషన్, టైగర్ షరాఫ్ హీరోలుగా రూపొందిన 'వార్' చిత్రం గాంధీ జయంతికి విడుదలై భారీ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. దీనికి సీక్వెల్‌ని తీసే ఆలోచనలో యష్‌రాజ్ సంస్థ ఉంది. హృతిక్ రోషన్ పాత్రని అలాగే ఉంచి, టైగర్ షరాఫ్ పాత్రకిగానూ ప్రభాస్‌ని ఎంపిక చేయాలని భావిస్తున్నారు. హృతిక్, ప్రభాస్ కాంబినేషన్‌లో సినిమా అంటే ఇది జాతీయ స్థాయిలో మరో భారీ సినిమా అవుతుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. మరి ప్రభాస్ తెలుగు సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? లేక 'వార్ 2'తో డైరెక్ట్‌గా బాలీవుడ్ ఎంట్రీ ఇస్తారా? అన్నది ప్రస్తుతానికి సస్పెన్స్.


అట్లీ, మహేష్ కోనేరు, హరీష్ శంకర్ తదితరులు

## మహిళలందరికి విజిల్ అంకితం


విజయ్, నయనతార జంటగా అట్లీ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బిగిల్'. ఏజీయస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కల్పాతి ఎస్.అఘోరాం, కల్పాతి ఎస్.గణేశ్, కల్పాతి ఎస్.సురేశ్ నిర్మించిన ఈ చిత్రాన్ని 'విజిల్'గా ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై మహేష్ కోనేరు తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. దీపావళి సందర్భంగా తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో అతిథిగా విచ్చేసిన ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ మాట్లాడుతూ, 'నేను అట్లీ సినిమాలకు పెద్ద అభిమానిని. విజయ్‌గారితో ఆయన చేసిన సినిమాలకు తెలుగులో పెద్ద ఫ్యాన్సే ఉన్నారు. ఈ సినిమా ట్రైలర్ చూడగానే గూజ్‌బమ్స్ వచ్చాయి. అట్లీ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారని అర్థమైంది. కమర్షియల్ సినిమాలను తెరకెక్కించే అట్లీ కమర్షియల్ అంశాలతోపాటు హై ఎమోషన్స్‌ను ఈ సినిమాలో చూపిస్తున్నారు. కచ్చితంగా ఈ సినిమాని ఎంటైర్ ఇండియాలోని ప్రేక్షకులు అభినందిస్తారు. ఇది ఆయన కెరీర్ బెస్ట్ చిత్రంగా నిలవాలని కోరుతున్నా. ఓ రైటర్‌గా, డైరెక్టర్‌గా కంటే, ఓ ఫ్యాన్‌గా ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్నాను. అలాగే అట్లీగారు త్వరలోనే షారూక్ ఖాన్‌తో సినిమా చేయబోతున్నారు. నేను షారూక్ అభిమానిగా ఈ కాంబో కోసం ఎదురుచూస్తున్నా. నిర్మాత మహేష్‌కి ఆల్ ది బెస్ట్' అని అన్నారు. 'నేను తెలుగులో సినిమా చేయాలని చాలా కాలంగా కలకంటున్నాను. త్వరలోనే ఆ కల నేరవేరనుంది. ఎన్టీఆర్ చాలా మంచి హృదయమున్న వ్యక్తి. నా ప్రతి సినిమాకు ఆయన ఫోన్ చేసి అభినందిస్తుంటారు. నాపై చూపిస్తున్న ప్రేమకు థ్యాంక్స్. తెలుగు ప్రేక్షకులు చాలా గొప్పగా ప్రేమిస్తారు. ఈ సినిమాను తెలుగులో 700 థియేటర్స్‌లో విడుదల చేస్తుండటం గొప్పగా అనిపిస్తుంది. నా బ్రదర్ విజయ్ లేకుండా నేను లేను. ఆయన వల్లే నేనీ స్థాయిలో ఉన్నాను. ఇది యాక్షన్ డ్రామా ఎమోషన్స్ ఉన్న స్పోర్ట్స్ చిత్రం. కేవలం ఫుట్ బాల్ స్పోర్ట్ మాత్రమే కాదు.. చాలా ఎమోషన్స్‌ను క్యారీ చేస్తుంది. అలాగే స్త్రీ సాధికారతను తెలియజేస్తుంది. ఈ సినిమాను మహిళలకు అంకితమిస్తున్నాను. ప్రస్తుత సమాజంలో మహిళలపై ఎన్నో అత్యాచారాలు జరుగుతున్నాయి. ఆ కారణాలతో నేను ఈ కథను రాశాను. ప్రతి మహిళ, పురుషుడు ఈ సినిమాను చూడాలి. సినిమా తమిళం కంటే తెలుగులోనే పెద్ద హిట్ అవుతుందని నమ్ముతున్నాను. ఈ సినిమాను మహిళల కోసమే చేశా. ఎ.ఆర్.రెహమాన్, నయనతారలకు థ్యాంక్స్' అని దర్శకుడు అట్లీ చెప్పారు. మహేష్ కొనేరు మాట్లాడుతూ, 'ఈ సినిమాకి తమిళంలోనే కాదు, తెలుగులోనూ అంతే క్రేజ్ ఉంది. అడ్వాన్స్ బుకింగ్స్‌కు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వస్తుంది. ఇదేదో తమిళ సినిమా అనో, దక్షిణాది సినిమా అని చెప్పడం కంటే ఇండియన్ సినిమా అని చెప్పడానికి సంతోషపడుతున్నాను. ఇందులో కంటెంటే కింగ్. విజయ్‌గారు, అట్లీగారు గత చిత్రాల ద్వారా తెలుగులో మంచి ఆదరణను సంపాదించుకున్నారు. ఇప్పుడు ఈ సినిమాను తెలుగులో విడుదల చేసే అవకాశాన్ని నాకు ఇచ్చినందుకు ధన్యవాదాలు' అని చెప్పారు.

## మత్తు వదలరా !


శ్రీ సింహా

ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి చిన్న కుమారుడు శ్రీ సింహా హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'మత్తు వదలరా'. రితేష్‌రానా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై చిరంజీవి, హేమలత సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ని బుధవారం హీరో ఎన్టీఆర్ ట్విట్టర్ ద్వారా విడుదల చేశారు. 'కాలం వేగంగా పరిగెడుతోంది. నా తమ్ముళ్లు చాలా పెద్దవాళ్లైపోయారు' అంటూ ఎన్టీఆర్, హీరోగా పరిచయం అవుతున్న శ్రీసింహాకు, సంగీత దర్శకుడిగా పరిచయం అవుతున్న కాలభైరవ (ఎమ్.ఎమ్.కీరవాణి పెద్ద కుమారుడు)కు, అలాగే చిత్రయూనిట్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్మాత చిరంజీవి (చెర్రీ) మాట్లాడుతూ, 'ఇది హాస్యభరితంగా సాగే మర్డర్ మిస్టరీ థ్రిల్లర్. దర్శకుడు రితేష్ రానా చివరి వరకు ఆసక్తికరమైన కథనంతో సాగే మంచి కథను తయారుచేశారు. కంటెంట్ అద్భుతంగా ఉంది. యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో మేమే ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాము. ఈ చిత్రంతో కొత్తవారినెందరినో టాలీవుడ్‌కు పరిచయం చేస్తున్నాము. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతుంది. త్వరలోనే చిత్ర టీజర్‌ను విడుదల చేస్తాం' అని అన్నారు. సత్య, వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఎడిటింగ్: కార్తీక్ శ్రీనివాస్. కెమెరా: సురేష్ సారంగం.

## చుల్‌బుల్ పాండే హంగామా


సల్మాన్ ఖాన్


'పుట్టుకతోనే ఎవరూ పొగరుబోతు కాడు, ప్రతి ఒక్కడి వెనకాల ఓ కథ ఉంటుంది' అని అంటున్నారు సల్మాన్ ఖాన్. ఆయన హీరోగా, సోనాక్షి సిన్హా కథానాయికగా నటిస్తున్న చిత్రం 'దబాంగ్ 3'. 'దబాంగ్' సిరీస్‌లో భాగంగా వస్తున్న మూడో చిత్రమిది. ప్రభుదేవా దర్శకత్వం వహిస్తున్నారు. హిందీతోపాటు తెలుగు, తమిళంలో సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ చిత్ర తెలుగు ట్రైలర్‌ని బుధవారం విడుదల చేశారు. ముంబయి నుంచి సల్మాన్ ఖాన్ రిలీజ్ చేశాడు. ముంబయి, బెంగుళూరు, చెన్నైలో కూడా అభిమానుల సమక్షంలో ఆయా భాషల ట్రైలర్‌ని విడుదల చేశారు. 'దబాంగ్' మార్క్ యాక్షన్, వినోదం మేళవింపుగా ట్రైలర్ ఉంది. ముఖ్యంగా సల్మాన్ చేసే వినోదం ఆకట్టుకుంటుంది. యాక్షన్ సైతం మెప్పిస్తుంది. 'ఖాకీ వేస్తే పోలీస్, తీస్తే రౌడీ, టోటల్‌గా ఆల్‌రౌండర్‌ని. ఆటకైనా, వేటకైనా రెడీ' వంటి తన స్టయిల్‌లో సల్మాన్ చెప్పే డైలాగులు ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచాయి. ఇందులో సల్మాన్ చుల్‌బుల్ పాండేగా అలరించనున్నారు. రజ్జోగా సోనాక్షి నటిస్తుంది. ఇదిలా ఉంటే ఇందులో కన్నడ స్టార్ సుదీప్ విలన్‌గా నటిస్తుండటం విశేషం. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ఈ చిత్రాన్ని క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 20న విడుదల చేయనున్నారు.

## బోల్డ్‌గా మరోసారి


కైరా అద్వానీ

'లస్ట్ స్టోరీస్' అనే వెబ్ సిరీస్‌లో బోల్డ్ క్యారెక్టర్‌తో మంత్రముగ్ధుల్ని చేసిన కైరా అద్వానీ మరోసారి బోల్డ్ పాత్రలో కనిపించబోతుంది. తాజాగా నటిస్తున్న 'ఇందూ కి జవానీ' చిత్రంలో ఆమె పాత్ర చాలా బోల్డ్‌గా ఉంటుందట. నేటి అమ్మాయిలను ప్రతిబింబించేలా, ట్రెండీగా, ఆకర్షించేలా, చమత్కారిగా కనిపించనున్నట్టు తెలుస్తుంది. ముఖ్యంగా ఆన్‌లైన్ డేటింగ్, బ్రేకప్‌లను ప్రతిబింబిస్తుందని కైరా చెబుతుంది. 'ఇందులో ఘాజియాబాద్‌కి చెందిన ఇందూ అనే అమ్మాయిగా కనిపిస్తాను. నా పాత్ర నేటి అమ్మాయిల జీవన శైలిని ప్రతిబింబిస్తుంది. నాకు బాగా నచ్చింది. నా పాత్ర చుట్టూతే సినిమా కథ నడుస్తుంది. ఇది చాలా బలమైన పాత్ర. దీనికోసం ప్రత్యేకంగా ప్రిపేర్ అవుతున్నాను. ఘాజియాబాద్‌లోని అమ్మాయిలు, వారి వ్యవహారశైలిని గమనిస్తున్నా. నా కెరీర్‌లో ఇలాంటి పాత్రని గతంలో చేయలేదు. అందుకే జాగ్రత్తలు తీసుకుంటున్నా' అని తెలిపింది. ప్రస్తుతం సినిమా షూటింగ్ లక్నోలో జరుగుతుంది. అక్కడ కైరాపై పలు బోల్డ్ సీన్స్‌ని చిత్రీకరిస్తున్నారట. అబీర్ సేన్‌గుప్తా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఆదిత్య సీల్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఇక ఇటీవల 'కబీర్ సింగ్'తో భారీ విజయాన్ని అందుకున్న కైరా ప్రస్తుతం 'గుడ్‌న్యూస్', 'లక్ష్మీబాంబ్', 'షేర్షా', 'భూల్ భులైయా 2' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

## దీపావళి గిఫ్ట్ రెడీ


మహేష్‌బాబు

'స్పైడర్', 'భరత్ అనే నేను', 'మహర్షి' వంటి సందేశాత్మక కమర్షియల్ చిత్రాలతో మెప్పించిన మహేష్‌బాబు తాజాగా పూర్తి వినోదానికి ప్రాధాన్యతనిచ్చి 'సరిలేరు నీకెవ్వరు'లో నటిస్తున్నారు. ఎంటర్‌టైన్‌మెంట్ చిత్రాలకు కేరాఫ్‌గా నిలుస్తున్న అనిల్ రావిపూడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. మహేష్ సరసన రష్మిక మందన్నా కథానాయికగా నటిస్తుంది. చాలా కాలం తర్వాత లేడీ సూపర్‌స్టార్ విజయశాంతి రీ ఎంట్రీ ఇస్తూ ఇందులో బలమైన కీలక పాత్ర పోషిస్తున్నారు. దిల్‌రాజ్ సమర్పణలో జీఎంబీ బ్యానర్‌తో కలిసి అనిల్ సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'ఒక్కడు' తర్వాత మరోసారి ఇందులో కర్నూలు కొండారెడ్డి బురుజు హైలైట్‌గా నిలవనుంది. ఇటీవల దసరా సందర్భంగా విడుదల చేసిన బురుజు వద్ద గొడ్డలి పట్టుకుని నిల్చొని ఉన్న మహేష్ లుక్ ఆకట్టుకుంది. తాజాగా దీపావళి కానుకగా సినిమాకి సంబంధించిన మరో సర్‌ప్రైజ్‌ని ఫ్యాన్స్‌కి అందించనున్నారట. అయితే ఈ సారి విజయశాంతి అభిమానులకు ట్రీట్ ఇవ్వాలని భావిస్తున్నారు. దీపావళి సందర్భంగా ఈ చిత్రంలోని విజయశాంతి ఫస్ట్‌లుక్‌ని రిలీజ్ చేయనున్నారని తెలుస్తుంది. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోన్న ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా జనవరి 12న గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నారు.

### రాజమౌళితో సైన్స్ ఫిక్షన్..

త్వరలో మహేష్‌బాబు, రాజమౌళి కాంబినేషన్‌లో ఓ సినిమా ఉండనుందని గతంలో వార్తలు వినిపించాయి. మహేష్ సైతం ఈ విషయాన్ని తెలిపారు. అయితే వీరి కాంబినేషన్‌లో ఎలాంటి సినిమా ఉండబోతుందనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. ఈ నేపథ్యంలో ఓ సంస్థ వీరి కాంబినేషన్‌లో ఎలాంటి సినిమా అయితే బాగుంటుంది? అని ఆన్‌లైన్ పోల్ నిర్వహించింది. ఇందులో మెజారిటీగా సైన్స్ ఫిక్షన్ బాగుంటుందని ఓట్ చేయడం విశేషం. 'జేమ్స్‌బాండ్' తరహా సైన్స్ ఫిక్షన్ చిత్రం బాగా సూట్ అవుతుందని తమ అభిప్రాయం వ్యక్తం చేశారు.

## డిఫరెంట్ యాక్షన్ థ్రిల్లర్


'ఖైదీ'లో కార్తీ

కార్తీ హీరోగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో 'ఖైదీ' చిత్రం రూపొందింది. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్.ఆర్.ప్రకాష్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు, తిరుప్పూర్ వివేక్ తమిళంలో నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాల్లో శ్రీ సత్యసాయి ఆర్ట్ అధినేత కె.కె.రాధామోహన్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. తాజాగా సెన్సార్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా నిర్మాత కె.కె.రాధామోహన్ మాట్లాడుతూ, 'డిఫరెంట్ యాక్షన్ థ్రిల్లర్‌గా సినిమా తెరకెక్కుతుంది. పాటలు, రొమాన్స్ లేకుండా ఇలాంటి యాక్షన్ ప్రధాన చిత్రంలో నటించి కార్తీ నటుడిగా తన ప్రత్యేకతని చాటుకున్నారు. తాజాగా ఇది సెన్సార్ పూర్తి చేసుకొని యు/ఎ సర్టిఫికెట్ పొందింది. దీపావళి కానుకగా సినిమాని గ్రాండ్‌గా విడుదల చేస్తున్నాం. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో సాగే వెరైటీ సినిమా ఇది. విభిన్నమైన చిత్రాలను ఆదరించే తెలుగు ప్రేక్షకులు ఈ సినిమాకి కూడా అఖండ విజయాన్ని చేకూరుస్తారన్న నమ్మకంతో ఉన్నాం. తెలుగు రాష్ట్రాల్లో మా బ్యానర్‌పై సినిమాని రిలీజ్ చేయడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సి.ఎస్., సినిమాటోగ్రఫీ: సత్యన్ సూర్యన్, ఎడిటింగ్: ఫిలోమిన్ రాజ్.


అజయ్ దేవగన్, జాన్వీ కపూర్, విక్కీ కౌశల్

## యుద్ధభూమిలో పోరాటం !

**గత కొంత కాలంగా బయోపిక్‌ల ట్రెండ్ దాదాపు అన్ని చిత్ర పరిశ్రమలో కొనసాగుతుంది. స్ఫూర్తివంతమైన ప్రముఖులు, స్పోర్ట్స్ బయోపిక్‌లు, రాజకీయ నాయకులు, సామాజిక వేత్తలను తెరపై ఆవిష్కరిస్తూ ఆడియెన్స్‌ని ఆకట్టుకుంటున్నారు. తాజాగా సైనిక ప్రధానంగా బయోపిక్‌లు రాబోతున్నాయి. సైనికుడు అంటే యుద్ధభూమిలో వీరోచితమైన పోరాటానికి, ధైర్య సాహసాలకు కేరాఫ్‌గా నిలుస్తారు. తమ విధి నిర్వహణలో ప్రత్యర్థులను మట్టు పెట్టి దేశం కోసం ప్రాణాలు అర్పించడంలో ముందే ఉంటారు. అలా దేశం కోసం ప్రత్యర్థులతో, టెర్రరిస్ట్‌లతో పోరాడి చరిత్రలో నిలిచిపోయిన కొందరు వీర సైనికాధికారుల జీవితాల ఆధారంగా బాలీవుడ్‌లో బయోపిక్‌లు రూపొందుతున్నాయి. అందులో భాగంగా పస్తుతం దాదాపు ఓ ఆరు సైనిక బయోపిక్‌లు తెరకెక్కుతుండటం విశేషం.**

దేశభక్తి నేపథ్యం, స్వాతంత్ర్య సమరం, దేశం కోసం ప్రాణాలు అర్పించిన సైనిక జీవితాలు ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటాయి. ఆయా చిత్రాలను ఆదరించేందుకు భాషా బేధం లేకుండా ఆడియెన్స్ ముందుకొస్తారు. ఇప్పటికే దాదాపు అన్ని భాషల్లోనూ అనేక సైనిక, పోలీస్ ప్రధాన దేశభక్తి చిత్రాలు వచ్చి బాక్సాఫీసు వద్ద కలెక్షన్ల వర్షం కురిపించాయి. ప్రస్తుతం హిందీలో అలాంటి సినిమాలు తెరకెక్కుతున్నాయి. వాటిలో ఒకటి అజయ్ దేవగన్ నటిస్తున్న 'భుజ్: ది ప్రైడ్ ఆఫ్ ఇండియా'. 1971లో ఇండో-పాక్ యుద్ధం ప్రధానంగా ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కి చెందిన అధికారి విజయ్ కర్నిక్ జీవితం ఆధారంగా, ఆయన యుద్ధంలో పోరాడిన తీరు నేపథ్యంలో ఈ సినిమా రూపొందుతుంది. అజయ్ దేవగన్ ఇందులో ఐఏఎఫ్ అధికారి విజయ్‌గా నటిస్తున్నారు. అభిషేక్ దుదైయా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని అజయ్ దేవగన్, భూషణ్ కుమార్ వంటి పలువురు నిర్మిస్తున్నారు. ఇందులో అజయ్ దేవగన్‌తోపాటు సంజయ్ దత్, పరిణీతి చోప్రా, సోనాక్షి సిన్హా, రానా, ప్రణిత వంటి భారీ తారాగణం నటిస్తుంది. ఇది వచ్చే ఏడాది ఆగస్ట్‌లో విడుదల కానుంది. అయితే పాకిస్థాన్ దాడులతో భుజ్ ఎయిర్‌పోర్ట్ దెబ్బతినడంతో స్థానిక మహిళలు, తన టీమ్‌తో అప్పటికప్పుడు ఎయిర్‌పోర్ట్ నిర్మించి భారత విమానాలు సురక్షితంగా ల్యాండ్ అయ్యేలా విజయ్ చేయడం విశేషం. కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్‌తో వీరోచితంగా పోరాడి ప్రత్యర్థులను మట్టు పెట్టడంలో కీలక భూమిక పోషించిన తొలి మహిళా ఎయిర్ ఫోర్స్ లెఫ్టినెంట్ ఆఫీసర్ గుంజన్ సక్సేనా జీవితం ఆధారంగా తాజాగా 'గుంజన్ సక్సేనా: ది కార్గిల్ గర్ల్' పేరుతో ఓ బయోపిక్ తెరకెక్కుతుంది. ఇందులో గుంజన్‌గా అతిలోక సుందరి శ్రీదేవి తనయ జాన్వీ కపూర్ నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఆమె ఫస్ట్ లుక్ ఆకట్టుకుంటోంది. గుంజన్‌గా జాన్వీ ఒదిగిపోయారు. శరన్ శర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కరణ్ జోహార్, అపూర్వ మెహతా నిర్మిస్తున్నారు. ఇది వచ్చే ఏడాది మార్చిలో విడుదల కానుంది. కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందిన కార్గిల్ హీరో విక్రమ్ బత్రా జీవితం ఆధారంగా 'షేర్షా' పేరుతో ఓ సినిమా తెరకెక్కుతుంది. విక్రమ్ బత్రా పాత్రలో సిద్దార్థ్ మల్హోత్రా నటిస్తుండగా, విష్ణు వర్ధన్ దర్శకత్వం వహిస్తున్నారు. కరణ్‌జోహార్, అపూర్వ మెహతా, షబ్బీర్ బాక్స్వాలా నిర్మిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోన్న ఈ సినిమా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. భారతీయ సైనికుల త్యాగాల నేపథ్యంలో పలువురు ఇండియన్ సోల్జర్స్ జీవితాలను బేస్ చేసుకుని యాక్షన్ డ్రామాగా 'శాటిలైట్ శంకర్' పేరుతో ఓ సినిమాని రూపొందిస్తున్నారు. ఇర్ఫాన్ కమల్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో యువ కథానాయకుడు సూరజ్ పంచోలి సైనికుడిగా నటిస్తున్నారు. ఇటీవల విడుదలైన ట్రైలర్ విశేషంగా ఆకట్టుకుంటుంది. మేఘా ఆకాష్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సల్మాన్ ఖాన్ అతిథిగా మెరవనుండటం విశేషం. ఇది వచ్చే నెల నవంబర్‌లో రిలీజ్ కాబోతుంది. ఇటీవల ఉరి ఘటన నేపథ్యంలో రూపొందిన 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్' చిత్రంతో జాతీయ అవార్డుని గెలుచుకున్న విక్కీ కౌశల్ మరో సైనిక ప్రధాన చిత్రంలో నటిస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో బ్రిటీష్ ఇండియన్ ఆర్మీ చీఫ్‌గా, స్వాతంత్ర్యం వచ్చాక ఇండియా ఆర్మీ చీఫ్‌గా పనిచేసి 1971లో ఇండో-పాక్ యుద్ధంలో కీలక పాత్ర పోషించిన ఆర్మీ అధికారి సామ్ బహదూర్ జీవితం ఆధారంగా తెరకెక్కబోతున్న చిత్రంలో ఆయన సామ్ బహదూర్‌గా కనిపించనున్నారు. మేఘనా గుల్జర్ ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు. త్వరలో ఇది ప్రారంభం కాబోతుంది. యంగ్ హీరో వరుణ్ ధావన్ సైతం సైనికుడిగా మారబోతున్నారు. ఇండియన్ లెఫ్టినెంట్ అధికారి అరుణ్ ఖేటర్పాల్‌గా కనిపించనున్నారు. ఇది కూడా 1971 ఇండో-పాక్ యుద్ధ నేపథ్యంలోనే తెరకెక్కబోతుండటం విశేషం. ఈ యుద్ధంలో బసంతూర్ ప్రాంతంలో సెకండ్ లెఫ్టినెంట్ అధికారిగా ఉన్న అరుణ్ పాక్‌పై సాహసోపేతంగా పోరాడారు. ఈ చిత్రానికి శ్రీరామ్ రాఘవన్ దర్శకత్వం వహిస్తున్నారు.


సూరజ్ పంచోలి, వరుణ్ ధావన్, సిద్ధార్థ్ మల్హోత్రా

# ఇంగ్లీష్ మీడియంపైనే మోజు

## ఆంగ్ల మాధ్యమంలో 85 శాతం మంది చేరిక

- తెలుగు మీడియానికి నిరాదరణ
- గతేడాది కంటే తగ్గిన 7,122 మంది
- డిగ్రీ ప్రవేశాల్లో అమ్మాయిలే అధికం
- అబ్బాయిల కన్నా 9.22 శాతం ఎక్కువ


ఫైల్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో డిగ్రీ విద్యార్థుల్లో ఇంగ్లీష్ మీడియంపైనే మోజు ఉన్నది. డిగ్రీలో చేరుతున్న విద్యార్థుల్లో ఎక్కువ మంది ఇంగ్లీష్ మాధ్యమంలో చేరేందుకు ఆసక్తి చూపడమే ఇందుకు నిదర్శనం. ఇంగ్లీష్ మాధ్యమంలో చదివితే ఉన్నత చదువులకు వెళ్లేందుకు అవకాశం లభిస్తుంది. దాంతోపాటు విదేశాల్లో చదవడమూ సులభమవుతుంది. అన్నింటికంటే ఉద్యోగ అవకాశాలు ఇంగ్లీష్‌పై అవగాహన ఉంటేనే లభిస్తాయి. అందుకే విద్యార్థులు ఎక్కువ మంది ఇంగ్లీష్ మాధ్యమంలో చదవడానికే మొగ్గుచూపుతున్నారు. 2019-20 విద్యాసంవత్సరంలో డిగ్రీ కోర్సుల్లో మొత్తం 2,22,707 మంది ప్రవేశాలు పొందారు. వారిలో ఇంగ్లీష్ మీడియంలో 1,90,325 (85.46 శాతం), తెలుగు మాధ్యమంలో 30,763 (13.82 శాతం), అరబిక్‌లో 72 (0.03 శాతం), హిందీలో 55 (0.02 శాతం), ఉర్దూ మాధ్యమంలో 1,492 (0.67 శాతం) మంది విద్యనభ్యసిస్తున్నారు. ఇంగ్లీష్ మాధ్యమంలో చదివే విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతున్నది. గత విద్యాసంవత్సరంలో మొత్తం 2,01,867 మంది చేరారు. వారిలో ఇంగ్లీష్ మీడియంలో 1,62,300 (80.40 శాతం) మంది ప్రవేశం పొందారు. అంటే గత విద్యాసంవత్సరం కంటే ఈ విద్యాసంవత్సరంలో ఇంగ్లీష్ మీడియంలో చేరిన వారి సంఖ్య 28,025కి పెరిగింది. అంటే 5.06 శాతం అధికంగా చేరారు. ఇక తెలుగు మీడియంలో చేరే విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గుతున్నది. గత విద్యాసంవత్సరంలో తెలుగు మాధ్యమంలో చేరిన విద్యార్థులు 37,885 (18.77 శాతం) ఉన్నారు. గత విద్యాసంవత్సరం కంటే ఈ విద్యాసంవత్సరంలో 7,122 మంది విద్యార్థులు తగ్గారు. అంటే 4.95 శాతం విద్యార్థులు తక్కువగా చేరారు. తెలుగు మాధ్యమంలో చదివితే ఉన్నత విద్యకు వెళ్తే ఎక్కువ ఇబ్బందులు ఉండడంతోపాటు ఉపాధి అవకాశాలు తక్కువగా దొరుకుతాయని విద్యార్థులు భావిస్తున్నారు. అందుకే ఇంగ్లీష్ మీడియంపైనే మోజు పెరుగుతుండడం గమనార్హం. ఇంగ్లీష్ మాధ్యమంతోనే భవిష్యత్తు ఉంటుందని ఎక్కువ మంది విద్యార్థులు భావించి చేరుతున్నారు.

**డిగ్రీలో చేరేందుకు అబ్బాయిల అనాసక్తి**

డిగ్రీ కోర్సుల్లో అమ్మాయిలే అధికంగా చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన గణాంకాలే ఇందుకు నిదర్శనం. 2019-20 విద్యాసంవత్సరంలో డిగ్రీలో 2,22,707 మంది విద్యార్థులు చేరారు. వారిలో 1,21,620 (54.61 శాతం) మంది అమ్మాయిలే ఉన్నారు. ఇక డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు అబ్బాయిలు అనాసక్తి కనబరుస్తున్నారు. ఈ విద్యాసంవత్సరంలో అబ్బాయిలు 1,01,087 (45.39 శాతం) మంది చేరడం గమనార్హం. అంటే అబ్బాయిల కన్నా అమ్మాయిలు 20,533 (9.22 శాతం) మంది అధికంగా ప్రవేశం పొందారు. గత విద్యాసంవత్సరం ప్రవేశాలను గమనించినా అమ్మాయిలే ఎక్కువగా చేరారు. గత విద్యాసంవత్సరంలో మొత్తం 2,01,867 మంది ప్రవేశం పొందారు. వారిలో అమ్మాయిలు 1,07,384 (53.20 శాతం) మంది ఉంటే, అబ్బాయిలు 94,483 (46.80 శాతం) మంది ఉన్నారు. అంటే అబ్బాయిల కంటే అమ్మాయిలు 12,901 మంది అధికంగా చేరారు. అబ్బాయిలు ఎక్కువ మంది వృత్తి విద్యా కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అందుకే డిగ్రీ కోర్సుల్లో తక్కువగా చేరుతున్నారు.

**డిగ్రీకి తగ్గుతున్న ప్రాధాన్యత**

డిగ్రీ విద్యకు ప్రాధాన్యత తగ్గుతున్నది. డిగ్రీలో భర్తీ అయ్యే సీట్ల కంటే మిగులుతున్న సీట్లే అధికంగా ఉండడమే నిదర్శనం. డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ద్వారా భర్తీ అవుతున్నాయి. 2019-20 విద్యాసంవత్సరంలో మొత్తం 4,55,265 సీట్లున్నాయి. వాటిలో 2,22,707 (48.92 శాతం) సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా 2,32,558 (51.08 శాతం) సీట్లు మిగిలాయి. అంటే భర్తీ అయిన వాటి కన్నా మిగిలిన సీట్లే అధికంగా ఉండడం గమనార్హం. ఇంకోవైపు గత విద్యాసంవత్సరంలో 2,33,419 మంది ప్రవేశాలు పొందారు. ఈ విద్యాసంవత్సరంలో 10,712 మంది డిగ్రీలో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గింది. అంటే డిగ్రీలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదని అర్థమవుతున్నది. వృత్తి విద్యా కోర్సుల్లో చేరడం, ఇతర రాష్ట్రాలకు వెళ్లడం వల్ల విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నదని విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు. ఇక దోస్త్ పరిధిలో లేని కాలేజీలు 118లో 42,460 సీట్లున్నాయి. వాటిలో చేరే విద్యార్థుల సంఖ్య 22,902. గత విద్యాసంవత్సరంలో ఆ కాలేజీల్లో 31,552 మంది చేరారు. గతేడాది కంటే ఈ విద్యాసంవత్సరంలో 8,650 మంది తక్కువగా చేరారు. సాంఘిక సంక్షేమ, గిరిజన డిగ్రీ గురుకులాలు అందుబాటులోకి రావడం, ప్రయివేటు డిగ్రీ కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పించడం వల్ల దోస్త్ పరిధిలో లేని కాలేజీల్లో చేరేందుకు కొంతమంది విద్యార్థులు ఆసక్తి చూపలేదని తెలుస్తున్నది.

**డిగ్రీ సీట్ల భర్తీ వివరాలు (2019-20)**

| మాధ్యమం | చేరిన విద్యార్థులు | శాతం |
|---|---|---|
| ఇంగ్లీష్ | 1,90,325 | 85.46 |
| తెలుగు | 30,763 | 13.82 |
| ఉర్దూ | 1,492 | 0.67 |
| అరబిక్ | 72 | 0.03 |
| హిందీ | 55 | 0.02 |
| మొత్తం | 2,22,707 | 100 |

## రైతు ఆత్మహత్యాయత్నం

(మొదటిపేజీ తరువాయి)

తెలుసుకున్న రంగారెడ్డి, తాండూరు తదితర ప్రాంతాలకు చెందిన రైతులు అక్కడకు వచ్చి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కమీషన్ ఏజెంట్లు, హమాలీల చర్యల కారణంగా తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వారి అవసరం తమకు లేదని వాదించారు. బస్తా బరువును 85 కిలోల నుంచి 50 కిలోలకు తగ్గించాలని కోరుతున్నారని, ఇలా చేస్తే తమకు ఎకరం పంటకు రూ.12వేలు నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. అంతేకాకుండా, కమీషన్ ఏజెంట్లు, హమాలీలకు అధికారులు అనుకూలంగా వ్యవహరిస్తూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని నినాదాలు చేశారు. ఇదే సమయంలో కమీషన్ ఏజెంట్లు మాట్లాడుతూ.. మార్కెట్‌లో హమాలీలు లేకుండా పని కాదని, 50కిలోల బస్తాలే తేవాలంటే రైతులు ఒప్పుకోవడం లేదని అన్నారు. ఈ క్రమంలోనే ఓ రైతు వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుంటుండగా సమీపంలో ఉన్న కానిస్టేబుల్ అడ్డుకున్నాడు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో మంత్రి నిరంజన్‌రెడ్డి రైతుల వద్దకు వచ్చి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన సర్దుమణిగింది. ఈ సందర్భంగా హమాలీల సంఘం అధ్యక్షులు నర్సింహా మాట్లాడుతూ.. ఒప్పందం ప్రకారం 65, 50 కిలోల బస్తాలను మాత్రమే అమలు పరచాలని డిమాండ్ చేశారు.

## ఆహారం.. ఔషధమూ కల్తీ

(మొదటిపేజీ తరువాయి)

వెలుగు చూశాయి. ఇటీవల పాలలో కల్తీ జరుగుతుందన్న ఆరోపణల నేపథ్యంలో నిర్ధారణ కోసం 15 నమూనాలు సేకరించగా రాష్ట్రంలో 12 నమూనాల్లో కల్తీ ఉన్నట్టు ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహించిన పరీక్షా ఫలితాలు స్పష్టం చేశాయి. అయితే వీటికన్నా ఎక్కువగా కల్తీ చేసి జనం ప్రాణాలతో దళారులు,వ్యాపారులు కోట్లు కూడబెట్టుకున్నట్టు స్పష్టమవుతున్నది. 2017 నాటి గణాంకాలు కూడా ఎన్సీఆర్బీ నివేదక వెలుగులోకి వచ్చినా.. కల్తీ నియంత్రణలో పెద్దగా మార్పు లేదన్న అభిప్రాయం ప్రజాసంఘాల నుంచి వ్యక్తమవుతున్నది.

**ఫ్రెండ్లీ పోలీసు ఇదేనా..?**

ఇక్కడి పోలీసు ఫ్రెండ్లీ పోలీసు అని చెప్పుకుంటున్నది ప్రభుత్వం..కానీ పోలీసు వేధింపులతో పౌరుల మరణాలు, పని స్థలాల్లో లైంగిక వేధింపులు, మానవ అక్రమ రవాణా, నేరపూరిత అతిక్రమణ కేసుల నమోదులోనూ తెలంగాణలో ఎక్కువగా ఉన్నాయి. ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీసు వ్యవస్థకు అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తున్నా..ఆ దిశగా పనిచేయటంలేదన్న ఆందోళన అందరిలోనూ వ్యక్తమవుతున్నది. ఇదే విషయాన్ని ఎన్సీఆర్బీ ధ్రువీకరించింది. పోలీసులు అనుసరిస్తున్న థర్డ్ డిగ్రీ చర్యల వల్ల కానీ..మరో కారణాల తోప్రమాదవశాత్తు ఎక్కువ మంది పౌరులు మరణిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని నివేదికలో పేర్కొంది. ఈ విషయంలో కల్లోలిత కాశ్మీర్ రాష్ట్రాన్ని మించిపోయింది. పోలీసు చర్యలు, ఎన్‌కౌంటర్లలో 10 మంది పౌరులు చనిపోయారు. ఉద్యమాలను అణగదొక్కటానికే అన్నట్టు గా ఖాకీలు రెచ్చిపోతున్న తీరు కూడా చర్చనీయాంశంగా మారుతున్నది. ఇక ఐపీసీ 354-ఏ సెక్షన్ కింద 658 కేసుల నమోదుతో దేశంలో 10వ స్థానంలో నిలవగా, పని ప్రదేశాలు, కార్యాలయాల్లో లైంగిక వేదింపులతో కింద 117 కేసులతో మొదటి స్థానంలో ఉంది. మహారాష్ట్ర 82 కేసులతో రెండవ స్థానంలో నిలిచింది. నగరాల వారీగా చూస్తే 25 కేసులతో ఢిల్లీలో మొదటి స్థానంలో ఉండగా ఆ తర్వాత 24 కేసులతో హైదరాబాద్ నిలిచింది. మానవ అక్రమ రవాణాకు సంబంధించి రాష్ట్రంలో 184 కేసుల కుగాను 77 కేసులు మహిళల, బాలికల అక్రమ రవాణాకు సంబం ధించినవే. ఇరువర్గాల మధ్య మతఘర్షణలకు సంబంధించి రాష్ట్రంలో 126 కేసులు నమోదు కాగా, హైదరాబాద్ లోనే 21 చోటు చేసుకున్నాయి. గిరిజనులపై లైంగికదాడుల్లోనూ రాష్ట్రంలో పరిస్థితి దయనీయంగా ఉన్నది. ఈ దురాగతాలపై11 కేసులు నమోదు అయ్యాయి.

**మరణాల్లో రెండో స్థానం**

వైద్యచికిత్సలో నిర్లక్ష్యం కారణంగా చోటు చేసుకున్నమరణాల్లో బీజేపీ పాలిత ఉత్తర్‌ప్రదేశ్, టీఎంసీ పాలనలోని వెస్ట్‌బెంగాల్, బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం ఉన్న బీహార్ల తర్వాత 20 కేసులతో మన రాష్ట్రం నాలుగవ స్థానంలో నిలిచింది. మెడికల్ హబ్ అని ప్రచారం చేస్తున్న హైదరాబాద్ నగరం లక్నో తర్వాత హైదరాబాద్ నగరం తర్వాత ఆరుగురు రోగుల నిర్లక్ష్యపు చావులతో రెండవ స్థానంలో ఉండటం గమనార్హం. తెలంగాణలో తినే ఆహారమే కాదు. ప్రయివేట్‌లో భారమవుతున్న వైద్యం కూడా సామాన్య ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నదని ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. రాష్ట్రంలో కల్తీని నియంత్రించే ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు లేకపోయినా..పట్టించుకోవటంలేదు. ఉన్న సిబ్బందికి అందుతున్న మాముళ్లే కారణంగా రాష్ట్రంలో పరిస్థితి మరింతగా దిగజారుతున్నదనే వాదనకు బలం చేకూరుతున్నది.

## జనం చస్తున్నా.. పట్టదా..!

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. ఇలాగే చూస్తూ ఉంటే పరిస్థితులు చేజారిపోతే ఏం చేస్తారనీ, పూర్వం యూరప్‌లో ప్లేగూ వచ్చి వేలాది మంది మరణించారనీ, అప్పుడు ఇద్దరు పోప్‌లు కూడా చనిపోయారనీ, ఇలాంటి మహమ్మారికి ధనిక పేద అనే తారతమ్యం ఉండదని పేర్కొంది. జనం చస్తుంటే ఎవ్వరూ స్పందించడం లేదనీ, చిచ్చు కార్చిచ్చు అయ్యేలా కాకుండా సర్కార్ చర్యలు ఉండాలనీ, సమస్య జఠిలం అయితే ఎవ్వరూ ఏం చేయలేని నిస్సహాయులు అవుతారని హెచ్చరించింది. డెంగీ వంటి విషజ్వరాలపై ప్రభుత్వ చర్యలు నామమాత్రంగా ఉన్నాయంటూ వైద్యురాలు కరుణ, లాయర్ రాపోలు భాస్కర్ వేరువేరుగా వేసిన పిల్స్‌ను బుధవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్, జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. డెంగీ వంటి విషజ్వరాలతో జనం చనిపోతున్నారని,ఎవరూ పట్టించుకున్న పాపానపోలేదని ఇప్పటికే ఎంతో సమయం, అనేక అవకాశాలు ఇచ్చినా ప్రభుత్వం నుంచి చర్యలు మాత్రం అంతంత మాత్రంగానే ఉంటున్నాయని వ్యాఖ్యానించింది. ఒక జడ్జి డెంగీ కారణంగా చనిపోయారనీ, ప్రభుత్వం అవగాహన కల్పించి ఉంటే ఈ పరిస్థితులు జనానికి కూడా వచ్చేవి కావని అభిప్రాయపడింది. హైకోర్టు కండ్లు తెరవదని అనుకోవద్దని, అలానే కండ్లు మూసుకుని ఉండదనీ, విషజ్వరాలకు జనం చిక్కుతుని చనిపోతుంటే.. తాము కండ్లు తెరిచే ఉంటామని తేల్చి చెప్పింది. అనకూడదు కానీ..బ్యూరోక్రాట్స్‌లో ఎవరికైనా ఈ తరహా పరిస్థితి ఎదురైతేగానీ మార్పు రాదా అని ప్రశ్నించింది. నిర్లక్ష్యం తగదనీ, పరిస్థితులు చేజారితే ఏం చేయాలో తెలియని అయోమయపరిస్థితులు ఉత్పన్నం అవుతాయని హెచ్చరించింది. దోమల్ని లార్వా దశలోనే అంతం చేయాలనీ, ప్రభుత్వం కళ్లు తెరవకపోతే పరిణామాలు తీవ్రం అవుతాయని హెచ్చరించింది. డ్రోన్ల సాయంతో మురికివాడల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, ఫాగింగ్ బాగా చేయాలని, మీడియా ద్వారా ఎక్కువ ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్న సూచనలు ఎక్కడా అమలు కాలేదని ఆగ్రహాన్నివ్యక్తం చేసింది.డెంగీ నివారణకు చర్యలు తీసుకుంటున్నామని, దోమల సంఖ్య తగ్గిందని, డెంగీ రాకుండా తీసుకోవాల్సిన ప్రచారానికి కూడా పెద్ద ఎత్తున ప్రాధాన్యత ఇస్తున్నామని అడ్వకేట్ జనరల్ బి.ఎస్.ప్రసాద్ చెప్పారు. ఒక నెల తర్వాత మరో నెలకి కేసులు తగ్గకపోగా పెరగడం ఏమిటని హైకోర్టు ప్రశ్నించింది. దోమల్ని నివారించేందుకు 'ఫ్రైడే డ్రై డే.. అనే నినాదంతో చర్యలు తీసుకుంటున్నామని ఏజీ చెప్పారు. గాంధీ జయంతి రోజున సారా అమ్మకాల్ని అడ్డుకునేందుకు డ్రై డే అమలు చేయడం తెలుసునని, దోమల నివారణకు ఫ్రై డే ఏంటో తెలియడం లేదని, ఆనినాదం కూడా సరిగా లేదని వ్యాఖ్యానించింది. దోమల నివారణకు డ్రోన్లు వినియోగించాలని, మనుషులు ఫాగింగ్ మిషన్లు తీసుకువెళ్తే వాటి వల్ల ఫలితాలు ఆలస్యం అవుతాయని, ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కలిగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని ఆదేశిస్తే ఇప్పటి వరకూ అలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించింది. బోర్డులు ఏర్పాటు చేశామని ఏజీ చెప్పారు. చిన్న బోర్డులు పెడితే ఉపయోగం లేదనీ, పెద్ద హోర్డింగ్స్ ద్వారా అవగాహన కల్పించాలని, హైదరాబాద్‌లో ఎక్కడా ఆ తరహాలో బోర్డులు తమకు కనబడలేదని వ్యాఖ్యానించింది. హైదరాబాద్‌లోనే ఇలాంటి పరిస్థితులు ఉంటే రాష్ట్రంలో ఇంకెలా ఉందోనని ఆందోళన వ్యక్తం చేసింది. దోమలు ఎన్ని ఉన్నాయో తేల్చే మిషన్లు ఉన్నాయని, దోమలు తగ్గాయని ఏజీ చెప్పారు. ఉన్న దోమల వల్ల రోగాలు పెరగవని చెప్పగలరా, అందుకే ప్రభుత్వం నివారణ చర్యలతోపాటు రోగాలు రాకుండా అవగాహన కార్యక్రమాల్ని చేపట్టాలని పదే పదే చెబుతున్నామని తెలిపింది. దోమల లెక్కింపు మిషన్లు కాదని, దోమల నివారణ మిషన్లు అవసరమని చెప్పింది. విచారణ గురువారానికి వాయిదా వేసింది.

## దేశానికి పట్టిన పీడ.. ప్రయివేటీకరణ



(మొదటిపేజీ తరువాయి)

ఒక్కరూ కార్మికులను విమర్శించటం లేదని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల జీవన ప్రమాణాలు అందరికీ తెలుసని, అయినా ముఖ్యమంత్రి కేసీఆర్ అధిక జీతాలు ఇస్తున్నట్టు తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. కేరళ, బెంగాల్‌లో ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టీసీ కార్మికులు సౌకర్యాలు పొందుతున్నారని చెప్పారు. ఇక్కడ ఆర్టీసీ కార్మికులకు కేవలం రూ.3000 పెన్షన్ ఇస్తుండగా, కేరళ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పెన్షన్ అందిస్తున్నట్టు తెలిపారు. సంస్థకు రావాల్సిన రూ.2,800 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో సాధ్యమవుతున్న విలీనం తెలంగాణలో ఎందుకు కాదని ప్రశ్నించారు. సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ మైండ్ గేమ్ ఆడుతున్నారని విమర్శించారు. అక్టోబర్ 30న సకలజనుల సమరభేరిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**కేసీఆర్ కంటే ముందే సంఘాలు : చాడ**

ముఖ్యమంత్రి కేసీఆర్ కంటే ముందే ఆర్టీసీ సంఘాలు పుట్టాయని, సంఘాలు లేని ఆర్టీసీని ఏర్పాటు చేయాలనుకోవడం మూర్ఖపు చర్య అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. ప్రజల తిరుగుబాటును ఎవరూ అడ్డుకోలేరన్నారు. ఆత్మగౌరవం కోసం పోరాడాల్సిన సమయం వచ్చిందన్నారు.

**వెనక్కి తగ్గేది లేదు: అశ్వత్థామరెడ్డి**

ఆర్టీసీ కార్మికుల 26 డిమాండ్లపై వెనక్కి తగ్గేది లేదని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి అన్నారు. తాము విలీనంపై వెనక్కి తగ్గినట్టు ముఖ్యమంత్రి కేసీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. హైకోర్టులో తమ లాయర్ ఎక్కడా విలీనంపై వెనక్కి తగ్గుతున్నట్టు మాట్లాడలేదని, కావాలంటే రికార్డులరె పరిశీలించాలని సూచించారు. 2012లో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.

**పార్టీలను విలీనం చేసుకున్నట్టే ఆర్టీసీనీ చేయాలి: వీహెచ్**

కాంగ్రెస్, టీడీపీలను టీఆర్ఎస్‌లో విలీనం చేసుకున్నట్టే ఆర్టీసీనీ ప్రభుత్వంలో విలీనం చేసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. సమ్మె చేస్తున్న కార్మికులు సెల్ఫ్ డిస్మిస్ అయ్యారని కేసీఆర్ అంటున్నారని, సచివాలయానికి రాని ముఖ్యమంత్రిని ఎన్ని సార్లు డిస్మిస్ చేయాలని ప్రశ్నించారు. సమ్మెపై అసదుద్దీన్ ఓవైసీ ఎందుకు మాట్లాడాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, టీడీపీ నాయకులు నన్నూరి నర్సిరెడ్డి, తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షులు చెరుకు సుధాకర్, పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు సంధ్య, టీజేఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, శివసేన నాయకులు సుదర్శన్, ఎంప్లాయిస్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి పద్మాకర్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యనారాయణ, ఏఐఆర్‌టీఎఫ్ నాయకులు అనంత సుబ్బరామిరెడ్డి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## పాలకులు శ్రద్ధ పెట్టి ఉంటే...

**న్యూఢిల్లీ :** తెలంగాణ ఆర్టీసీ బాగుపడాలంటే, సంస్థ నష్టాల బాట నుంచి బయటపడాలంటే అది రాష్ట్ర ప్రభుత్వం వల్లే అవుతుంది. ఈ మాట ప్రతిపక్ష నాయకులు, పార్టీలు చెప్పటం లేదు. రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా ఏర్పాటుచేసిన కమిటీ చెబుతోంది. థర్డ్ పార్టీగా ఐఐఎం-బెంగుళూరు వారు ఆర్టీసీ సంస్థపై 2005లో సమగ్ర అధ్యయనం చేయగా, వారు తెలియజేసిన విషయాల్ని తాజాగా ఓ జాతీయ ఆంగ్ల దినపత్రిక ప్రచురించింది. ఆర్టీసీ నష్టాలకు ప్రధాన కారణంగా నిలుస్తున్న అంశాలు...ఆ సంస్థ పరిధిలోనివి కావనీ, ఇవి రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోకి వచ్చే (డీజిల్‌పై పన్ను, రాయితీలు, సబ్సిడీలు) అంశాలనీ 'ఐఐఎం-బెంగుళూరు' నివేదిక స్పష్టంగా తేల్చింది. సమస్యలు ఏండ్లుగా ఉండిపోవటం వల్లనే సంస్థ ఆర్థికంగా కుంగిపోయిందని నివేదిక పేర్కొన్నది.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ సంస్థలపై సమగ్ర అధ్యయనం కోసం గత పదేండ్లలో రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగు కమిటీల్ని ఏర్పాటుచేసింది. ఐఏఎస్ అధికారులు, మంత్రుల నేతృత్వంలో మూడు కమిటీలు ఏర్పాటుకాగా, థర్డ్ పార్టీగా 'ఐఐఎం-బెంగుళూరు' నేతృత్వంలో నాలుగో కమిటీ ఏర్పాటైంది. ఆర్టీసీ కార్మిక సంఘాలు, ఉద్యోగుల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ వచ్చిన నేపథ్యంలో ఈ నాలుగు కమిటీలను అప్పటి పాలకులు ఏర్పాటుచేయాల్సి వచ్చింది. సంస్థ లాభనష్టాలు, ప్రభుత్వం ఇస్తున్నది ఎంత? అన్నవాటిపై వాస్తవ గణాంకాలు బయటకు రావాలని కార్మికసంఘాలు కోరుకున్నాయి.

2005లో ఈ నాలుగు కమిటీలు సంస్థపై అధ్యయనం చేశాయి. ఇందులో ఐఐఎం-బెంగుళూరి వారి అధ్యయనంలో తేలిన అంశాలు ఇలా ఉన్నాయి. ఆర్టీసీకి తీవ్ర నష్టాలు తెచ్చిపెడుతున్న రెండు అంశాలు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోనివి. స్టూడెంట్ పాస్‌లు, జర్నలిస్టు పాస్‌లు, సంస్థ ఉద్యోగుల ప్రయాణాలపై రాయితీలు, వివిధ రకాల సబ్సిడీలు...తిరిగి గ్రాంట్ రూపంలో ప్రభుత్వం చెల్లించాలి. కానీ అలా చెల్లించటం లేదు. సామాజిక, సంక్షేమ పథకాలు అమలుజేయటాన్ని ఆర్టీసీ కార్మికులు వ్యతిరేకించటం లేదు. ఆ సబ్సిడీని గ్రాంట్ రూపంలో తిరిగి ప్రభుత్వం చెల్లించాలని కోరుకుంటున్నాయి. ఇది ఆర్టీసీ నిర్వహణకు సంబంధించిన అంశం కాదు. ప్రభుత్వానికి సంబంధించిన అంశం. రాయితీల భారం దింపాల్సింది ప్రభుత్వమే.

లాభాలు వచ్చే మార్గాల్ని ప్రయివేటు బస్సు ఆపరేటర్లకు అప్పజెప్పటం, నష్టాలు వచ్చే రూట్లలో ఆర్టీసీ బస్సుల్ని తిప్పటం..ఇది అందరికీ తెలిసిన విషయమే. అయితే నష్టాలు వచ్చే రూట్లలో ప్రభుత్వ రాయితీలు సంస్థకు పెద్ద గుదిబండలా మారింది. దీనికి తోడు డీజీల్‌పై పన్ను, మోటార్ వాహనాల పన్ను సంస్థను మరింత ముంచాయి. ఇందులో ప్రధానంగా డీజీల్‌పై వసూలు చేస్తున్న పన్ను చాలా ఎక్కువగా ఉంది. ఇంధనంపై పన్ను, మోటార్ వాహనాల పన్ను...అంశాలు కూడా ఆర్టీసీ నిర్వహణకు సంబంధించినవి కాదు. వీటి ద్వారా ఏర్పడుతున్న ఆర్థిక భారాన్ని ఆర్టీసీ తప్పించుకోలేదు. కారణం ఇవి ప్రభుత్వ పరిధిలోని అంశాలు.

1993-96 మధ్య నష్టాల్ని తగ్గించుకోవటం కోసం ఉద్యోగ నియామకాల్ని ఆపేశారు. టికెట్ల ధరలను పెంచారు. అయినా సంస్థ లాభాలబాటలోకి వెళ్లలేదు. నష్టాలు మరింత పెరిగాయి. దీనికి కారణమేంటని లెక్కలు చూస్తే...డీజిల్‌పై పన్ను, వాహనాల పన్ను అని తేలింది. సంస్థను కాపాడాలన్న సదుద్దేశమే ఉండి ఉంటే...ప్రభుత్వాలు ఇంత పెద్ద ఎత్తున పన్నులు వసూలు చేయవని ఐఐఎం-బెంగుళూరు నివేదిక స్పష్టంగా తెలిపింది. 1990-2002 మధ్య మోటార్ వాహనాల పన్ను క్రమంగా పెంచుతూ వెళ్లారు. దీంతో రూ.75.06 కోట్లు ఉన్న పన్ను....రూ.337కోట్లకు పెరిగింది. ఆర్టీసీ చెల్లిస్తున్న మోటార్ వాహనాల పన్ను ఐదు రేట్లు పెరిగింది.

**ప్లానింగ్ కమిషన్‌లోనూ ఇదే చెప్పారు...**

'రిపోర్ట్ ఆఫ్ సబ్ గ్రూప్ ఆన్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్స్'(ఎస్ఆర్‌టీయూ) అనే పేరుతో ప్లానింగ్ కమిషన్ కూడా 2016లో ఒక నివేదిక విడుదల చేసింది. జాతీయ స్థాయిలో దీనిని అధ్యయనం చేసింది. నిత్యం పెరుగుతున్న డీజిల్ ధరలకు, వాటిపై చెల్లిస్తున్న ఇంధనం పన్నుకు అనుగుణంగా టికెట్ల ధరలు పెరగలేదు. వివిధ వర్గాలకు టికెట్ల ధరల్లో ఇస్తున్న రాయితీలు తిరిగి గ్రాంట్ రూపంలో ప్రభుత్వం నుంచి రావటం లేదు. కేవలం లాభాపేక్షను దృష్టిలో పెట్టుకోకుండా, మారుమూల ప్రాంతాలకు బస్సు సర్వీసులు నడుపుతున్నారు. ఇవన్నీ కూడా సంస్థను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని ప్లానింగ్ కమిషన్ తన నివేదికలో స్పష్టంగా తెలిపింది.

## జూరాలలో 33 గేట్లు ఎత్తివేత

- ఆరు యూనిట్లతో విద్యుదుత్పత్తి

**నవతెలంగాణ - ధరూర్**

మహబుబ్‌నగర్ ఉమ్మడి జిల్లా వరప్రదాయిని అయిన జోగులాంబ గద్వాల జిల్లా జూరాల ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వచ్చి చేరడంతో నిండుకుండలా దర్శనమిస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి వరద భారీగా వస్తుండటంతో 33గేట్లు ఎత్తి దిగువ ప్రాంతమైన శ్రీశైలం ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేస్తున్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాలకూ నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి జూరాలకు ఇన్‌ఫ్లో 3లక్షల 40వేల క్యూసెక్కులు వస్తోంది. ఈ క్రమంలో 20వేల 850క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ఆరు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. అందుకోసం 44వేల 492 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఒక్కో యూనిట్‌లో 39 మెగావాట్ల చొప్పున ఆరు యూనిట్లలో 234 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

## మరో డ్రైవర్ గుండె ఆగింది

**నవతెలంగాణ-యాచారం, జహీరాబాద్**

ఆర్టీసీ సమ్మెలో భాగంగా నిరసనలో చురుగ్గా పాల్గొంటూ వచ్చిన డ్రైవర్ గుండె ఒక్కసారిగా ఆగిపోయింది. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మాల్ గ్రామంలో మంగళవారం రాత్రి ఈ ఘటన విషాదం నింపింది. సిద్దగోని రమేశ్‌గౌడ్(35) 2019లో ఆర్టీసీ డ్రైవర్‌గా చేరి, ప్రస్తుతం ముషీరాబాద్-1 డిపోలో విధులు నిర్వహిస్తున్నాడు. 18రోజులుగా నిరసనలో పాల్గొన్న రమేశ్‌కు మంగళవారం ఉదయం గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి అదేరాత్రి మరణించాడు. మృతుడికి భార్య పరమేశ్వరి, ఏడాది కూతురు ఉంది. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే తన భర్త మృతిచెందాడని భార్య పరమేశ్వరి వాపోయింది. బుధవారం నిర్వహించిన అంత్యక్రియల్లో ఇబ్రహీంపట్నం కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ తీరుతో మనస్తాపానికి గురై సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ డిపో కండక్టర్ సోఫియా ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కొన్నిరోజులుగా దిగాలుగా ఉంటున్న ఆమె నడుస్తున్న బస్సులోంచి దూకి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. సంగారెడ్డికి వెళ్లే బస్సులో ఎక్కిన ఆమె కోహీర్ చౌరస్తా వరకు వెళ్లగానే దూకేందుకు యత్నించింది. తోటి ప్రయాణికులు అడ్డుకుని జహీరాబాద్ డిపో కార్మికులకు తెలిపారు. కార్మికులు, యూనియన్ నాయకులు వచ్చి నచ్చజెప్పి, జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. సోఫియాకు భర్త లేడనీ, వచ్చే జీతంతోనే పిల్లలను పోషించుకుంటోందనీ కార్మికులు తెలిపారు. గత నెల జీతం ఇంకా రాకపోవడంతో ఆవేదనకు గురైందన్నారు.

## అగ్నిప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలు ఏమిటి?: హైకోర్టు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

వచ్చే ఏడాది జనవరి 1 నుంచి నాంపల్లి మైదానంలో నిర్వహించే ఎగ్జిబిషన్‌లో అగ్నిప్రమాదాలు వంటివి జరగకుండా తీసుకోబోయే చర్యల్ని తెలపాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ అభిషేక్‌రెడ్డిల డివిజన్ బెంచ్ కోరింది. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్, ఇతర ప్రతివాదులకు నోటీసులు ఇచ్చింది.

## నామ్‌కే వాస్తే..

(మొదటిపేజీ తరువాయి)

నుంచే డైరెక్షన్ వస్తున్నట్టు ఆర్టీసీ జేఏసీ నాయకులు ఆరోపిస్తున్నారు. నివేదిక కూడా అక్కడే తయారుచేసి, ఈడీలతో సంతకాలు పెట్టించుకున్నా ఆశ్చర్యం లేదనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఈడీల కమిటీకి అసలు చట్టబద్ధత ఉన్నదా...అని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి ప్రశ్నించారు. ఏ అధికారాలు లేని కమిటీని ప్రభుత్వం ఎందుకు నియమించిందో కూడా అర్థంకావట్లేదన్నారు. అయితే న్యాయస్థానం అడిగిన ప్రశ్నలకు కేవలం సాంకేతికంగా సమాధానం చెప్పేందుకే ఈ కమిటీని నియమించినట్టు ప్రచారం జరుగుతున్నది. మంగళవారం ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన పత్రికా ప్రకటన ఇదే విషయాన్ని ధ్రువీకరిస్తున్నట్టు ప్రభుత్వ వర్గాల్లో కూడా చర్చ జరుగుతున్నది. రెండు, మూడు రోజుల్లో ఈడీల కమిటీ నివేదికను ఆర్టీసీ ఇన్‌చార్జి ఎమ్‌డీ సునీల్‌శర్మకు ఇస్తే...దాన్ని ఆయన ప్రభుత్వానికి ఫార్వర్డ్ చేస్తారు. దాన్ని పరిశీలించి, అవసరమైన మార్పులు, చేర్పులతో హైకోర్టుకు ఆ కాపీని ఇవ్వాలనేదే ప్రభుత్వ ఉద్దేశంగా ఉన్నదని రవాణారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సమస్యను పరిష్కరించాలనే చిత్తశుద్ధి ప్రభుత్వంలో ఏకోశానా కనిపించట్లేదనేది వారి వాదన. ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వం సర్కస్ ఫీట్లు చేస్తున్నదని ప్రతిపక్ష రాజకీయపార్టీలు తీవ్రంగా ఆక్షేపిస్తున్నాయి. ఈడీల కమిటీ జేఏసీ నేతల్ని చర్చలకు పిలవాలా...లేదా...అనే డైలమాలోనే ఉన్నట్టు తెలుస్తున్నది. చర్చల కోసం తమకు ఎలాంటి ఆహ్వానం అందలేదని బుధవారం జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి తెలిపారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం డిమాండ్‌ను తాము ఎక్కడా వదులుకోలేదనీ, 26 డిమాండ్లకు కట్టుబడి ఉన్నామని, ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తున్నదని అన్నారు.

**సమ్మె పరిష్కరించపోతే..**

హోంశాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్ త్రివేది ఆకస్మిక బదిలీపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఆర్టీసీ సమ్మె గురించి నచ్చని విషయాలను సూచించి ఉంటారన్న కారణంతోనే ఆయనను జైళ్ల శాఖ డీజీగా బదిలీ చేసినట్టు అధికారవర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వం ఇదే తరహాలో వ్యవహరిస్తే..మరో విద్యుత్ ఉద్యమం తరహాలో ఆందోళనలు పెరుగుతాయని ముఖ్యమంత్రి సన్నిహితులు వ్యాఖ్యలు చేసినట్టు సమాచారం.

**ఉధృతంగా ఆందోళనలు**

ఆర్టీసీ కార్మికుల ఆందోళనలు ఉధృతంగా జరుగుతున్నాయి. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ధూంధాంలు, వంటావార్పు కార్యక్రమాలు నిర్వహించారు. కార్మికుల ఆత్మహత్యలు, మానసిక క్షోభతో జరుగుతున్న హఠాన్మరణాలు పెరుగుతున్నాయి. ఇప్పటి వరకు 12 మంది ఆర్టీసీ సమ్మె కాలంలో చనిపోయారు. తాజాగా జహీరాబాద్ డిపోకు చెందిన మహిళా కండక్టర్ సోఫియా ఆత్మహత్యాయత్నం చేశారు. ఆమె ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ముషీరాబాద్ డిపోకు చెందిన డ్రైవర్ ఎస్ రమేష్ 18 రోజులుగా సమ్మెలో పాల్గొంటున్నాడు. సెప్టెంబర్ మాసం జీతాన్ని కూడా ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఆర్థికంగా అవస్థలు పడుతున్నాడు. మంగళవారం రాత్రి అతను గుండె ఆగి మరణించాడు. దీనితో ఆర్టీసీ కార్మికులు ముషీరాబాద్ డిపో ఎదుట నిరసనకు దిగారు. జాతీయ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు హెచ్ వీ అనంత సుబ్బారావు, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కె పద్మాకర్, కర్ణాటక ఆర్టీసీకి చెందిన యూనియన్ నాయకులు ఆర్ఎఫ్ కవలాయ్‌కర్ టీఎస్ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. ప్రభుత్వం వారితో చర్చలు జరిపి, సమస్యను తక్షణం పరిష్కరించాలని అనంతసుబ్బారావు డిమాండ్ చేశారు. ఈమేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావుకు లేఖ కూడా రాసినట్టు వివరించారు. దిల్‌సుఖ్‌నగర్‌లో జరిగిన ధూంధాం కార్యక్రమంలో ప్రతిపక్ష రాజకీయపార్టీలు, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు. టీఎస్ఆర్టీసీ జేఏసీ కో కన్వీనర్ కె రాజిరెడ్డి (ఎంప్లాయీస్ యూనియన్) ఓ సుధ (సూపర్‌వైజర్స్ అసోసియేషన్), పి రవీందర్‌రెడ్డి (స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్), సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కార్యదర్శివర్గ సభ్యులు బి వెంకట్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, సీపీఐ(ఎమ్ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు సూ ర్యం, గోవర్ధన్, వీ హనుమంతరావు (కాంగ్రెస్), వినోద్‌కుమార్ (బీజేపీ), చెరుకు సుధాకర్ (తెలంగాణ ఇంటిపార్టీ), జస్టిస్ చంద్రకుమార్ (తెలం గాణ ప్రజాపార్టీ), మందకృష్ణ (ఎమ్ఆర్‌పీఎస్) సంధ్య (పీఓడబ్ల్యు), విమ లక్క (అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య) తదితరులు పాల్గొన్నారు, వందలాదిమంది కార్మికులు, ప్రజలు ఈ ఆందోళనలో భాగస్వాములు అయ్యారు.

## 25న దీపావళి బోనస్ చెల్లింపు

(మొదటిపేజీ తరువాయి)

యాజమాన్యం చెప్పడం, మంగళవారం వరకూ నవంబర్ నెలలో చెల్లించేందుకు నిర్ణయించడంతో కార్మిక సంఘాలు ఆందోళనకు దిగాయి. దీంతో యాజమాన్యం దిగొచ్చి 25న చెల్లిస్తామని చెప్పడం శుభపరిణామమని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తుమ్మల రాజిరెడ్డి, మందా నర్సింరావులు తెలిపారు. ఆర్టీసీ సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం బేషజాలకు పోకుండా సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. ఇప్పటికే ఆర్టీసీ సమ్మెతో రాష్ట్రంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనడం, సింగరేణి కార్మికులకు బోనస్ చెల్లింపులో జాప్యం జరిగితే ప్రభుత్వానికి అదనపు తలనొప్పిగా మారే అవకాశం ఉండటంతో వెంటనే చెల్లించేందుకు నిర్ణయించినట్టు తెలిసింది.

కిసాన్
నవతెలంగాణ



# దిగుబడి పెరగాలంటే..?

**సాధారణంగా అక్టోబర్ మాసం మొదలవగానే బంతిపూలకు మంచి సీజన్. బతుకమ్మ, దసరా, దీపావళి, కార్తీకపౌర్ణమి ఇలా పండుగలు ప్రారంభం కావడంతో పూలకు మంచి గిరాకీ ఉంటుంది. పండుగల్లో మిగిలిన పూలకంటే బంతిపూలకు మరింత ప్రాధాన్యం ఇస్తారు. అందుకే చాలామంది రైతులు బంతి సాగుకు ఆసక్తి చూపుతారు. ఇంతటి ప్రాధాన్యం వున్న పంటను పండించడానికి ఏం చేయాలి? ఏ విధంగా దిగుబడి పెంచుకోవాలో తెలుసుకుందాం...**

**ముం**దుగా మనకు ఏ పండుగకు ఏపూలు కావాలో నిర్ణయించుకుని దానికి సరిగ్గా 80 రోజుల నుండి 85 రోజుల్లో క్యాలెండర్‌కు మార్క్ చేసుకుని విత్తనాన్ని నారుగా పెంచుకోవాలి. ఎందుకంటే నారు వయసు 25 రోజులు వచ్చిన తర్వాత పొలంలో నాటాలి. నాటిన 25 నుంచి 30 రోజులకు మొదటి పువ్వు (ముక్కు పుడక వంటిది) పించింగ్ అంటే తుంచడం చేయాలి. ఇది మొదటి పించింగ్ దాని కారణంగా పక్క కొమ్మలు బాగా వస్తాయి. రెండో పించింగ్ 40 రోజులప్పుడు చేయాలి. ఇప్పుడు 10 నుంచి 20 మొగ్గలు తెంపాలి. ఇంకా పండుగకు 16 నుంచి 18 రోజుల సమయం ఉంటే ఈ పంటను వదలాలి. ఇంకా ఎక్కువ సమయం ఉంటే మరొక సారి పించింగ్ చేయాలి. ఇప్పుడు సరిగ్గా పండుగకు పూలు వస్తాయి. ఒక్కో మొక్కకు కనీసం 30 నుంచి 50 పూలు పూస్తాయి.

**విత్తనం:** ఒక ఎకరానికి 10 ప్యాకెట్ల విత్తనం కావాలి. లేదా 8500 నారు మొక్కలు కావాలి. ఒక్క ప్యాకెట్‌కు సగటున మార్కెట్‌లో రూ.1200 నుంచి రూ.2200 వరకు ఖర్చవుతుంది.

**రకాలు:**ఆశోకా ఆరెంజ్, ఆశోకా ఎల్లో, సాగర్ ఆరంజ్, సాగర్ ఎల్లో, రాయల్ గోల్డ్, రాయల్ ఆరంజ్, ఈస్ట్, వెస్ట్ వారి ఎల్లో, మాక్సిమ, ఎల్లో డోలర్, ఇందుస్‌రెడ్, ఎల్లో వంటి రకాలున్నాయి. నార్కట్‌పల్లిలోని నర్సరీలో విత్తనాల ప్యాకెట్ ఇచ్చి పెంచాము. మొత్తం 10 ప్యాకెట్లలో 10000 విత్తనాలు ఉంటాయి. అందులో 9వేల మొక్కలు తప్పకుండా వస్తాయి. ఒక్కో మొక్క పెంచినందుకు 25 రోజులకు గాను 50పైసల చొప్పున చార్జ్‌వేశారు. ఆ తర్వాత మొక్కలను ప్రధాన పొలంలో నాటు వేశాము.

**మల్చింగ్:** కలుపు మొక్కలు రాకుండా మొక్కలను డ్రిప్ ద్వారా ఇచ్చిన ఎరువులు నేరుగా వేరు భాగాల్లోకి చేరి మొక్కను ధృడంగా ఉంచి, చీడపీడలను దానిలో ఉన్న సిల్వర్ కవర్ ద్వారా ఎండకు రిఫ్లెక్షన్ ద్వారా కీటకాలు త్వరగా దరిచేరవు. మల్చింగ్ కవర్‌కు 25 నుంచి 30 మైక్రాన్‌ల కవరు మార్కెట్‌లో రూ.1600 నుండి రూ.2500 వరకు ఉంటుంది. ఒక్క ఎకరానికి 6 రూల్ బండిల్లు పడుతాయి. మల్చింగ్ చేయడానికి ఖర్చు 6 మంది కూలీలతో రెండు రోజుల్లో ఒక ఎకరం పరుస్తారు.

**ఫెర్టిగేషన్:** ఎరువులను నేరుగా వేయకుండా నీటిలో కరిగించి డ్రిప్‌ద్వారా ఎక్కించడాన్ని ఫెర్టిగేషన్ అంటారు.

**ఫెర్టిగేషన్ ద్వారా ఈ కింది మందులను ఉపయోగించాలి.**

మొదటి దశలో.. ఒక ఎకరానికి 19:19:19 ఒక కిలో 15 రోజులకు, 25 రోజులకు రెండు కిలోలు, 35 రోజులకు 3 కిలోల చొప్పున ఎక్కిస్తారు. 12-61-0 ఎకరానికి 10 రోజులకు ఒక కిలో, 30రోజులకు 2 కిలోలు, 75 రోజులకు 3 కిలోలు మొక్కనాటి 15 రోజులకు పైన తెలిపినట్టు ఎక్కించాలి. 45 రోజుల తర్వాత 2 పించింగ్‌లు అయిపోతాయి. అప్పుడు నేరుగా పూల కోసం వదిలితే ఈ కింది మందులు వాడాలి. ఎకరానికి 13-0-45 అనే మందు 50 రోజులకు ఒక కిలో, 60 రోజులకు 2కిలోలు, 70 రోజులకు 3కిలోలు ఎక్కించాలి. అదే విధంగా 0-0-50 55 రోజులకు 1 కిలో 65 రోజులకు 2 కిలోలు, 75 రోజులకు 3కిలోల చొప్పున ఎక్కించాలి. ఒక వేళ ఇంకా కొంచెం వ్యవధి ఉంటే మొక్కల నుండి పూలు తీసుకోవాడానికి అంటే 0-32-54 అనే మందును రెండుసార్లు 10 రోజుల వ్యవధిలో ఎక్కించాల్సి ఉంటుంది. పైన పేర్కొన్నట్టు ఫెర్టిగేషన్ ఎక్కించిన తర్వాత మధ్యలో ఒకసారి 30 నుంచి 35 రోజులప్పుడు, 55 నుంచి 65 రోజుల మధ్యలో ఫార్ములా-4 5గ్రాములు 1 లీటరు నీటికి కలిపి పై నుంచి పిచికారి చేయాలి. పూలు వదలాలి అనుకున్నప్పుడు మంచిషేప్ లేదా సైజులో మార్పు రాకుండా ఉండడానికి బోరాన్ 2గ్రా.ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. దీని వల్ల మంచి సైజు కలిగిన పూలు రిక్క బంతిపూలు రాకుండా అన్ని ఒకే సైజులో రావడానికి అవకాశం ఉంటుంది.

**నేలలు:**మురుగు నీరు ఇంకని నేలలు తప్పా అన్ని నేలలు అత్యంత అనుకూలమే.

**వాతావరణం:** చల్లని వాతావరణంలో తప్పా ఈ పూలు పండించడానికి అవకాశం ఉంటుంది. ఒక్క చలి సమయంలో రాత్రిపూట కురిసే మంచు కారణంగా అది ఉప్పుతో కూడిన గాఢత ఎక్కువైనప్పుడు పూలు మాడిపోవడానికి అవకాశం ఉంటుంది.

**అనుకూలమైన సమయం:** చలికాలంలో తప్ప మిగతా ఏ కాలంలో అయినా పూల దిగుబడి వస్తుంది.

**నీటి వినియోగం:** డ్రిప్ సౌకర్యం ద్వారా సాగు చేస్తే మంచిది. లేని వారు వర్షాకాలంలో చెలక భూముల్లో కూడా వేసుకోవచ్చు. మొత్తం పంట కాలంలో 8 నుండి 10 తడుల నీరు అవసరం ఉంటుంది.

**సస్యరక్షణ**

**నారుకుళ్లు:** నాటిన వెంటనే కానీ కొద్ది రోజుల తర్వాత కానీ వేర్లు కుళ్లిపోయి బూజు వంటి పదార్థం వేర్లలో వస్తుంది. దాని నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ సీఓసీ 30గ్రాములు, స్ట్రెప్టోసైక్లిన్ 1 గ్రా. 10 లీటర్ల నీటిలో కలిపి వేర్లు తడిచేలా పోయాలి.

శనగపచ్చపురుగు, లద్దెపురుగు నివారణకు బంతివంటి పంటలను ఎక పంటలుగా కూడా వాడుతారు. కనుక మనం వేసింది బంతితోటనే కనుక వీటి నివారణకు ప్రొఫినోఫాస్ 2 మి.లీ లీటరు నీటికి లేదా క్లోరాన్ త్రినాప్రోల్ 0.3 మి.లీ ఒక లీటరు నీటికి లేదా ఇమామెక్టిన్ బెంజోమేట్ 0.5 గ్రా. ఒక లీటరు నీటికి పిచికారి చేస్తే పురుగుల బెడద పూర్తిగా నయం అవుతుంది. ఉధృతినిబట్టి 2 లేదా 3సార్లు పిచికారి చేయాల్సి ఉంటుంది.





**ఆకుమాడు తెగులు:** అక్కడక్కడ ఆకులపైన మాడినట్టు, పూలు పాచిపోయినట్టు ఉంటాయి. దీని నివారణకు మాంకోజెబ్ 3గ్రా. లీటరు నీటికి లేదా కార్బండజిమ్, మాంకోజెబ్ 2గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

బంతికి పెద్దగా తెగుళ్ల బెడద, సస్యరక్షణ బెడద కూడా ఉండదు. కనుక తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి తీయొచ్చు.

**దిగుబడి:**చెట్టు వయసు 50 రోజుల నుండి మొదలుకొని మనం ఇచ్చిన బలాన్ని బట్టి దాదాపు 120 రోజుల నుండి 150 రోజుల వరకు బతకడానికి అవకాశం ఉంటుంది. మొత్తం సగటున ఒక్కో మొక్కకు కనిష్ట 80 పూల నుండి గరిష్టంగా 200కుపైగా చిలుకు పూలు పూయడానికి అవకాశం ఉంటుంది. సరాసరి సగటున ఒక్క కిలోకు దాదాపు 40 నుండి 60 పూలు తూగడానికి అవకాశం ఉంటుంది.ఒక చెట్టుకు కనీసం రెండు కిలోల పూలు రావడానికి అవకాశం ఉంటుంది.

**మార్కెట్‌లో పూల ధర:** సీజన్‌లో అయితే కిలోకు రూ. 50 నుంచి రూ.100కుపైగానే ధర పలుకుతుంది. సీజన్‌లో కాకుండా పండుగలు లేని సమయంలో అయితే రూ.20 నుంచి రూ.30 వరకు ధర పలికే అవకాశం ఉంది. ఒక ఎకరానికి 8500 మొక్కలు నాటుతాము కనుక సగటున 6వేల మొక్కలను పరిశీలిద్దాం. ఒక చెట్టుకు ఒక కిలో పూలు పూసినా 6వేల కిలోలు అవుతాయి. కిలోకు రూ.50 ధర చొప్పున రూ.3లక్షలు అవుతాయి.చాలా తక్కువ రోజుల్లో అత్యధిక ఆదాయాన్ని సంపాదించుకునే అవకాశం ఉంది. కనుక రైతులు సాంప్రదాయ పద్ధతుల్లో కాకుండా శాస్త్రీయ పద్ధతిలో మెళకువలు తెలుసుకుని పండిస్తే మంచి లాభాలతో ఆర్థిక పరిస్థితులను మెరుగు పర్చుకోవచ్చు.

**- రావుల విద్యాసాగర్,**
**సెరికల్చర్ ఆఫీసర్**



# శీతాకాలం అనువైనది

(గత వారం తరువాయి)

**ఎరువులు:** చివరి దుక్కిలో ఎకరానికి 6నుంచి 8 టన్నుల పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. నాటే టప్పుడు ఎకరానికి 24కిలోల భాస్వరం, 150 కిలోల సూపర్‌ఫాస్ఫేట్, 24కిలోల పోటాష్‌నిచ్చే ఎరువులను 40కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ వేయాలి. 48నుంచి 60కిలోల నత్రజనిని 3 సమపాళ్లుగా చేసి, నాటిన 30నుంచి 45, 60వ రోజున పైపాటుగా వేసి బోదెలను ఎగదోయాలి. పూత దశలో లీటరు నీటికి 20గ్రా. యూరియాను కలిపి పిచికారీ చేస్తే 15నుంచి 20శాతం దిగుబడి పెరుగుతుంది. నాటేముందు ఎకరానికి 8నుంచి 12 కిలోల చొప్పున బోరాక్స్ వేసినట్టయితే పండ్లు పగలకుండా ఉంటాయి. ఎకరానికి 10కిలోల చొప్పున జింకు సల్ఫేట్ వేసినట్టయితే జింకు లోపం రాకుండా ఉంటుంది. నాటిన తర్వాత 30నుంచి 45 రోజులకు లీ.నీటికి 5గ్రా. జింకు సల్ఫేట్‌ను కలిపి పిచికారి చేసినట్టయితే 20శాతం దిగుబడి పెరుగుతుంది. పూత దశలో ఎకరానికి 400మి.గ్రా, 200లీటర్ల నీటికి కలిపి లేదా 1మి.లీ ప్లానోఫిక్స్ 4.0 లీ. నీటిలో కలిపి ఎకరానికి పిచికారి చేస్తే పూత, పిందె నిలిచి ఎండాకాలంలో మంచి దిగుబడి వస్తుంది.

**కలుపు నివారణ- అంతరకృషి:**ఎకరంలో కలుపు నివారణకు పెండిమిథాలిన్ 1.0లీ.(తేలిక నేలలు), 1.20 లీ(బరువు నేలలు) 200ల లీటర్ల నీటిలో కలిపి నాటిన 48గంటల్లోపు తడినేలపై పిచికారి చేయాలి. మెట్రిబుజిన్ అనే మందును 300గ్రా. మోతాదులో నాటిన 15 రోజులకు 200లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. నాటిన 30నుంచి 35 రోజులప్పుడు గొర్రు లేదా గుంటకతో అంతరకృషి చేయాలి. పొలంలో కలుపు లేకుండా మొదటి నాలుగు వారాల్లో అంతరకృషి చేయాలి. మొక్కలు ఎదిగిన తర్వాత వాటిని కదిలించకూడదు.

పొడవుగా పెరిగే హైబ్రీడ్ మొక్కలకు, మామూలు రకాలకు కూడా కర్రలను పాలి ఊతం ఇవ్వాలి. ఊతమివ్వడం వల్ల మంచి పరిమాణం గల కాయలు ఏర్పడతాయి. అంతేకాకుండా కాయలు నేలకు తగిలి చెడిపోకుండా కాపాడవచ్చు.

**నీటియాజమాన్యం:** భూమిలో తేమనుబట్టి 7నుంచి 10 రోజుల వ్యవధిలో నీరుకట్టాలి.

**సస్యరక్షణ పురుగులు**

**కాయతొలుచు పురుగు:** లేత ఆకులను, కొమ్మలను తినేస్తుంది. కోత దశలో కాయలను తొలచి నాశనం చేస్తుంది. దీని నివారణకు ఎరపంటగా బంతిని వేసుకోవాలి. ఒక వరుస బంతి మొక్కలు, ప్రతి 16 వరుసలకు టమాటా కంటే బంతినారును 20 రోజుల ముందు నాటుకోవాలి. ట్రైకో గ్రామా బదనికలను ఎకరానికి 20వేల చొప్పున విడుదల చేయాలి. ఎకరానికి 4 చొప్పున లింగాకర్షణ బుట్టలను పెట్టాలి. నాటిన 28నుంచి 35 రోజులకు ఫ్లూబెండమైడ్ 0.3 మి.లీ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. ఎన్‌పివి వైరస్ ఎకరానికి 250 లార్వాలకు సమానమైన ద్రావణాన్ని పిచికారి చేయాలి. ఎకరానికి 20 చొప్పున పక్షిస్థావరాలను ఉంచాలి. ఆశించిన పురుగుకు సంబంధించిన బాగా ఎదిగిన క్రిములను ఏరి నాశనం చేయాలి. క్రిమి సంహార మందులను పిచికారీ చేసేందుకు ముందు కాయలను కోయాలి.

**పచ్చదోమ:** ఆకుల అడుగు భాగం నుండి రసాన్ని పీల్చడం వల్ల ఆకుల చివర్లు పసుపుపచ్చగా మారి క్రమేపి ఆకు అంతా ఎర్రబడి చివరగా ఆకులు ముడుచుకొని దోనెలలాగా కనిపిస్తాయి. దీని నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ 2 మి.లీ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**రబ్బరు పురుగు:** పురుగుల చివరి దశలో నివారణకు విషపు ఎరలను పెట్టాలి. 10కి. తవుడు, 1కిలో కార్బరిల్ 50శాతం పొడి మందు, 1కిలో బెల్లం తగినంత నీటికి కలిపి పాకం చేసి పులియపెట్టినది. ఈ పురుగు నివారణకు కాయతొలుచు పురుగుకు చెప్పబడిన సమగ్ర సస్యరక్షణ చర్యలను పాటించాలి.

**తెగుళ్లు**

**నారుకుళ్లు తెగులు:** నారుకుళ్లు తెగులు ఆశించడం వల్ల నారుమడిలో మొక్కల మొదళ్లు కుళ్లిపోయి నారు గుంపులు,గుంపులుగా చనిపోతుంది. విత్తడానికి ముందు తప్పనిసరిగా 3గ్రా. థైరం లేదా మాంకోజెబ్ కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేయాలి. తర్వాత ట్రైకోడెర్మా విరిడి అనే జీవ శిలీంద్రనాశనిని 4గ్రా. 1 కిలోవిత్తనానికి కలిపి నారు పోయాలి. నారుమడిలో తెగులు కనిపించిన వెంటనే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రా. లీటరు నీటిలో కలిపి నారుమడిని 10 రోజుల వ్యవధితో రెండుమూడు సార్లు తడపాలి.

**ఆకుమాడు తెగులు:** ఆకులు, కాండం మీద కాయల మీద గోధుమ రంగుతో కూడిన మచ్చలు ఏర్పడి క్రమేణా ఆకులు మాడి ఎండిపోతాయి. మొక్కదశలో ఎప్పుడైనా అశించవచ్చు. తేమ ఉన్న చల్లని వాతావరణంలో, ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువగా ఆశిస్తుంది. దీని నివారణకు 3గ్రా. కాప్టాన్ లేదా మాంకోజెబ్ లేదా క్లోరోథలోనిల్ 2గ్రా. లేదా ప్రొకొనజోల్ 1 మి.లీ మందును లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధితో మూడు,నాలుగు సార్లు పిచికారి చేయాలి.

**వడలు తెగులు:** మొక్క అడుగు భాగంలోని ఆకులు పసుపు రంగుకు మారి తొడిమతో సహా రాలి, తర్వాత మొక్క వడలి పోయి చినిపోతుంది. దీని నివారణకు బలమైన మొక్కల నుండి విత్తనాలను ఎన్నుకోవాలి. తెగులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో తెగులును తట్టుకునే బిటి 1 వంటి రకాలను వాడుకోవాలి. నేల ఉదజని 3.6 నుండి 5వరకు ఉన్న ఆమ్ల భూముల్లో ఈ తెగులు ఎక్కువగా ఉంటుంది. పంట మార్పిడి పద్ధతిని పాటించాలి.

**వైరస్ తెగులు:** తెగులు సోకిన మొక్కల ఆకుల మీద అక్కడక్కడ పసుపుపచ్చ మచ్చలు ఏర్పడి ఆకులు ముడుచుకొని, మొక్క గిడసబారి ఎండిపోతుంది. ఆకులు పెళుసుగా తయారవుతాయి. దీని నివారణకు తెగులు ఆశించిన మొక్కలను పీకి నాశనం చేయాలి. తెగులును వ్యాప్తి చెందించే రసం పీల్చే పరుగుల (పేనుబంక) నివారణకు అంతర్వాహిక కీటక నాశనులను పిచికారీ చేసుకోవాలి.

**టమాట స్పాటెడ్ విల్ట్ వైరస్:** టమాట చిగురాకుల పైభాగంలో ఈనెలు గోధుమ వర్ణంకు మారి, ఆకుల మీద పుసు రంగు మచ్చలు ఏర్పడి మాడిపోతాయి. మొక్కలు గడసబారి, పూత, పిందె పట్టక ఎండిపోతుంది.దీని నివారణకు తెగులు ఆశించిన మొక్కలను పీకేయడంతోపాటు తెగులను వ్యాప్తి చెందించే తామర పురుగుల నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ 2 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



**గ**డిచిన మూడు రోజులలో రాష్ట్రంలో అక్కడ క్కడ తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురిసాయి. పగటి ఉష్ణోగ్రతలు 25 నుంచి 32 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 18 నుంచి 25 డిగ్రీల సెల్సీయస్‌గా నమోదయ్యాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అందించిన సమాచారం ప్రకారం రాబోయే ఐదు రోజుల్లో చాలా ప్రాంతాల్లో రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో వర్షాలు కురిసే సూచనలున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 25 నుంచి 32 డిగ్రీల సెల్సీయస్ మధ్య, రాత్రి ఉష్ణోగ్రతలు 19 నుంచి 25 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదుకావచ్చు.
కోసిన ధాన్యం మార్కెట్‌కు తరలించకుండా వాయిదా వేసుకోవాలి. మార్కెట్‌కు తరలించిన ధాన్యం తడవకుండా చూసుకోవాలి. ఈ వర్షాలను ఉపయోగించుకుని వేసవి దుక్కులు చేసుకోవాలి. దీని వల్ల నేలలోని చీడపీడలు, వాటి కోశస్థ దశలు కలుపు విత్తనాలు నశించిపోతాయి. వర్షాల వల్ల వర్షాధార పంటల్లో నిలిచిన నీటిని తీసివేయాలి. రాబోవు ఐదు రోజుల్లో వర్షపాత సూచనలున్నాందున, వర్షాలు కురిసిన తర్వాత వర్షాధార పంటలలో పైపాటు ఎరువులను వేసుకోవాలి.

# బూజు తెగులు ఆశించినట్టయితే



**వ్యవసాయం వాతావరణం**

**వరి :** ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో సుడిదోమ ఉధృతి పెరిగే సూచనలున్నాయి. దోమ ఉధృతిని బట్టి ఎసిఫేట్ 1.5గ్రా. లేదా బుప్రోఫెజిన్ 1.6 మి.లీ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. వరిలో గింజ రంగు మారడం నివారణకు 5. మి.లీ డైకోపాల్, 1 మి.లీ ప్రొపికొనజోల్ లేదా 1 మి.లీ స్పైరోమేసిఫిన్, 1 మి.లీ ప్రోపికొనజోల్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో కాండం తొలుచు, ఆకు ముడత పురుగు ఆశిం చుటకు అనుకూలం. పురుగు, తెగులు గమనించి నట్టయితే నివారణు 0.3 మి.లీ క్లోరాంట్రానిలిప్రోల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. వరిలో రెల్లరాల్చు పురుగు గమనించడమైంది. నివారణకు 1.25 మి.లీ క్లోరిఫైరిపాస్ 50 ఇసి, 02 గ్రా. ప్లాంటోమైసిన్ మందును 5 నుంచి 7 రోజుల వ్యవధిలోరెండు సార్లు పిచికారి చేయాలి.

**పత్తి :** పత్తిలో రసం పీల్చే పురుగులు గమనించడమైంది. నివారణకు 0.2 గ్రా. ఎసిటామిప్రిడ్ 0.2గ్రా. థయోమి థాక్సామ్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. పత్తిలో పొగాకు లద్దె పురుగు ఆశించుటకు అనుకూలం. పురుగు గమనించినట్టయితే నివారణకు 1.5 గ్రా. థయోడికార్బ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ఆముదం :** ప్రస్తుత వాతావరణ పరిస్థితులు బూజు తెగులు ఆశించుటకు అనుకూలం. మందు జాగ్రత్త చర్యగా 1. గ్రా. కార్బెండజిమ్ లేదా 1 మి.లీ ప్రొపికొనజోల్ మందును వర్షం కురవడానికి 6 నుంచి 8 గంటలు ముందుగా, వర్షం కురిసిన తర్వాత 6 నుంచి 8 గంటల వ్యవధిలో లీటరు నీనటికి కలిపి మొక్క అన్ని భాగాలు తడిచే విధంగా పిచికారి చేయాలి.

**కూరగాయలు :**కూరగాయ పంటలలో రసం పీల్చే పురుగులు గమనించినట్టయితే నివారణకు 2 మి.లీ డైమిథోయేట్ లేదా 1.5 గ్రా ఎసిఫేట్ లీటరు నీటినికి కలిపి పిచికారి చేయాలి. వంగలో కొమ్మ, కాయతొలుచు పురుగు గమనించడమైంది. నివారణకు పురుగు సోకిన కొమ్మలను తుంచి నాశనం చేయాలి. 2 మి.లీ ప్రొఫినోపాస్ మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.కూరగాయలలో పొగాకు లద్దె పురుగు గమనించినట్టయితే నివారణకు 1.25 మి.లీ నోవాల్యూరాన్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. గత వారం రోజులుగా కురిసిన వర్షాల వల్ల మిరపలో బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగుళ్ల ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు 30 గ్రా. కాపర్‌ఆక్సీక్లోరైడ్ 1 గ్రా. ప్లాంటమైసిన్ మందును 10 లీటర్ల నీటికి కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి

**-సేకరణ : మోత్కూరు యాదయ్య**

## వేతనం అక్కర్లేదు

### తిరస్కరించిన గుహ, విక్రమ్



**నవతెలంగాణ, ముంబయి :** సుప్రీంకోర్టు నియమిత పాలకుల కమిటీ (సీఓఏ) సభ్యులుగా గౌరవ వేతనాన్ని మాజీ సభ్యులు చరిత్రకారుడు రామచంద్ర గుహ, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సీఈవో విక్రమ్ లిమాయె తిరస్కరించారు. ఈ మేరకు బుధవారం బీసీసీఐ చీఫ్ ఫైనాన్షియల్ అధికారికి ఈ మెయిల్ పంపారు. 2017 నుంచి పాలకుల కమిటీ సభ్యులకు నెలకు.10-12 లక్షల చొప్పున గౌరవ వేతనంగా సుప్రీంకోర్టు నిర్ణయించింది. 48 గంటల్లోగా సొమ్ము ఖాతాల్లో జమ చేయాలని ఆదేశించింది. 33 మాసాలు సీఓఏలో కొనసాగిన చైర్మన్ వినోద్ రాయ్, డయాన ఎదుల్జీలు సుమారు రూ. 3.6 కోట్లు అందుకోనున్నారు. ఇటీవల నూతనంగా వచ్చిన లెఫ్టినెంట్ కల్నల్ రవి సుమారు రూ. 1.17 కోట్లు అందుకోనున్నాడు. 2017లో నాలుగు నెలలు కొనసాగిన రామచంద్ర గుహ రూ. 40, ఏడు మాసాలు కొనసాగిన విక్రమ్ లిమాయె రూ. 70 లక్షల వరకూ వేతనం అందుకోవాల్సి ఉంది. ఈ మేరకు బీసీసీఐ సీఎఫ్ఓ వారికి లేఖలు రాశారు. పాలకుల కమిటీ తొలి సమావేశంలోనే ఎటువంటి వేతనం అవసరం లేదని రామచంద్ర గుహ, విక్రమ్ లిమాయె స్పష్టం చేశారు. కానీ డయాన ఎదుల్జీ వేతనం కావాల్సిందేనని పట్టుబట్టడంతో సమావేశానికి రూ. 1 లక్ష చొప్పున ఇవ్వాలని చైర్మన్ వినోద్ రాయ్ నిర్ణయించారు. వేతనం అక్కర్లేదని ముందే చెప్పాం కాబట్టి, ఈ సొమ్ము తీసుకునేందుకు అంతరాత్మ అంగీకరించదని రామచంద్ర గుహ అన్నారు.



## మూడింటా టాప్-10

### రోహిత్ శర్మ మరో ఘనత
### ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్

**దుబాయ్ :** భారత స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ మరో ఘనత దక్కించుకున్నాడు. దక్షిణాఫ్రికాతో ఫ్రీడం టెస్టు సిరీస్‌ను వరల్డ్ నం. 44 బ్యాట్స్‌మన్‌గా మొదలెట్టిన రోహిత్ శర్మ.. సిరీస్‌ను వరల్డ్ నం.10 ర్యాంక్‌తో ముగించాడు. వన్డే, టీ20 ర్యాంకింగ్స్‌లో ఇప్పటికే టాప్-10లో కొనసాగుతున్న రోహిత్ శర్మ తాజాగా టెస్టుల్లోనూ టాప్-10లోకి ప్రవేశించాడు. మూడు ఫార్మాట్లలో (వన్డే, టీ20, టెస్టు) టాప్-10 ర్యాంక్ సాధించిన మూడో భారత ఆటగాడిగా రోహిత్ శర్మ నిలిచాడు. కెప్టెన్, సూపర్ స్టార్ విరాట్ కోహ్లి ఇప్పటికే మూడు ఫార్మాట్లలో టాప్-10లో ఉన్నాడు. మాజీ ఓపెనర్ గౌతం గంభీర్ సైతం గతంలో మూడు ఫార్మాట్లలో టాప్-10 ర్యాంక్ సాధించాడు. దక్షిణాఫ్రికాపై ఓ డబుల్ సెంచరీ, రెండు శతకాలు సహా రోహిత్ శర్మ 529 పరుగులు చేశాడు. రాంచీ టెస్టుకు ముందు 22వ స్థానంలో నిలిచిన రోహిత్ శర్మ తాజా ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ పదో స్థానానికి చేరుకున్నాడు. మూడో టెస్టులో 116 పరుగుల శతకం బాదిన అజింక్య రహానె నం.5 ర్యాంక్‌కు వచ్చాడు. మరో ఓపెనర్ మయాంక్ అగర్వాల్ 18వ స్థానంలో ఉన్నాడు. విరాట్ కోహ్లి నం.2, చతేశ్వర్ పుజార నం.4 స్థానాల్లో కొనసాగుతున్నారు. ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ స్టీవ్ స్మిత్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఐదుగురు భారత బ్యాట్స్‌మన్ టాప్-20లో కొనసాగుతుండటం విశేషం. జట్టు ర్యాంకింగ్స్‌లో టీమ్ ఇండియా వరల్డ్ నం.1గా కొనసాగుతోంది.

**బీసీసీఐ నూతన ఆఫీస్ బేరర్లు**
అధ్యక్షుడు : సౌరవ్ గంగూలీ
కార్యదర్శి : జై షా
కోశాధికారి : అరుణ్ సింగ్ ధుమాల్
సంయుక్త కార్యదర్శి : జయేశ్ జార్జ్
ఉపాధ్యక్షుడు : మహిమ్ వర్మ

నూతనంగా ఎన్నికైన సహచర ఆఫీస్ బేరర్లతో అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ



భారత క్రికెట్‌కు కొత్త ఆరంభం. 33 నెలలుగా వర్కింగ్ కమిటీ, సర్వ సభ్య సమావేశం లేకుండానే కొనసాగిన బీసీసీఐకి బుధవారం నూతన అధ్యక్షుడు వచ్చాడు. 2000లో మ్యాచ్ ఫిక్సింగ్ కలకలం రేగిన సమయంలో జాతీయ జట్టును ఏ విధంగా సమర్థవంతంగా నడిపించానో, ఇప్పుడూ అవినీతి మరక అంటిన బీసీసీఐని అదే రీతిలో పారదర్శకంగా నడిపిస్తానని నూతన అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ హామీ ఇచ్చారు. 33 మాసాల పాలకుల కమిటీ పాలనకు తెరపడగా.. గంగూలీ సారథ్యంలోని పాలక మండలి భారత క్రికెట్ నాయకత్వం చేపట్టింది.

# సరికొత్త ఆరంభం!

- జాతీయ జట్టును నడిపినట్టే బీసీసీఐకి నాయకత్వం
- అవినీతి రహిత పాలనకు దాదా హామీ
- 39వ బీసీసీఐ అధ్యక్షుడిగా గంగూలీ బాధ్యతలు

**నవతెలంగాణ-ముంబయి**

విశ్వసనీయత, పారదర్శకత, అవినీతి రహిత పాలన.. బీసీసీఐ నూతన అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ ముందున్న తక్షణ కర్తవ్యాలు. 2013 ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్ కుంభకోణం, తదనంతరం చోటు చేసుకున్న పరిణామాలతో బీసీసీఐ సమూల ప్రక్షాళనకు తెరలేచింది. సుప్రీంకోర్టు తీసుకున్న నిర్మాణాత్మక చర్యలు, పాలకుల కమిటీ 33 మాసాల కృషి ఫలితంగా భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)లో కొత్త అధ్యాయం ఆరంభమైంది. జస్టిస్ లోధా కమిటీ సిఫారసుల అనుగుణంగా నూతన రాజ్యాంగం అనుసారం బీసీసీఐ నూతన ఆఫీస్ బేరర్లు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ బోర్డు 39వ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. జాతీయ జట్టు కెప్టెన్‌గా గంగూలీ ధరించిన బ్లేజర్‌ను అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన సమయంలో ధరించటం విశేషం. అంతకు ముందు జరిగిన వార్షిక సర్వ సభ్య సమావేశంలో ఎన్నికల అధికారి ఎన్. గోపాలస్వామి నుంచి అధ్యక్షుడిగా ఎన్నికైన పత్రాన్ని గంగూలీ అందుకున్నారు. బీసీసీఐ రాష్ట్ర సంఘాల ప్రతినిధుల సమక్షంలో పాలకుల కమిటీ సభ్యులు వినోద్ రాయ్, డయాన ఎదుల్జీ, రవిలు బాధ్యతలను గంగూలీకి అప్పగించారు.



ఎన్నికల అధికారి గోపాలస్వామి నుంచి ఎన్నిక పత్రం అందుకుంటున్న దాదా

### ఆ సారథ్యం కొనసాగిస్తాను

విశ్వసనీయత, అవినీతి రహిత పాలనపై ఎటువంటి రాజీ ఉండదు. ఈ విషయాల్లో భారత జట్టును ఏ విధంగా నడిపించానో బీసీసీఐను అదే రీతిలో నడిపిస్తాను' అని బీసీసీఐ అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం సౌరవ్ గంగూలీ పేర్కొన్నారు. బోర్డులో పరిస్థితులను చక్కదిద్దాలి. సంస్కరణలు చేపట్టాల్సి ఉంది. రాష్ట్ర సంఘాలకు పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేయాలి. గత మూడేండ్లలో ఏం జరిగిందో మాకు తెలియదు. బీసీసీఐలో మేం భాగంగా లేము. వార్షిక సర్వ సభ్య సమావేశం లేదు, వర్కింగ్ కమిటీ సమావేశాలు జరుగలేదు. అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకుని భారత క్రికెట్‌కు మేలు చేసే నిర్ణయాలు తీసుకుంటామని గంగూలీ అన్నాడు. 2000లో భారత క్రికెట్ అతి పెద్ద సంక్షోభం ఎదుర్కొంది. మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలతో జాతీయ జట్టు విశ్వసనీయత ప్రశ్నార్థకమైంది. ఈ సమయంలో సౌరవ్ గంగూలీ కెప్టెన్‌గా పగ్గాలు అందుకుని, భారత జట్టును విజయపథంలో నడిపించాడు. టీమ్ ఇండియా విజయవంతమైన కెప్టెన్‌గా నిలిచాడు. తాజాగా భారత క్రికెట్ బోర్డు విశ్వసనీయత సమస్య ఎదుర్కొంటుంది. అవినీతి రహిత పాలనపై ఎన్నో అనుమానాలు నెలకొన్నాయి. జాతీయ జట్టు కెప్టెన్‌గా విజయవంతమైన గంగూలీ.. బోర్డు ప్రెసిడెంట్‌గా సక్సెస్ సాధిస్తాడా? చూడాలి.

### కెప్టెన్ కోహ్లికి పూర్తి మద్దతు



'భారత క్రికెట్‌లో అత్యంత ముఖ్యమైన వ్యక్తి విరాట్ కోహ్లి. భారత జట్టును అతడు అత్యుత్తమంగా నిలపాలని అనుకుంటున్నాడు. కోహ్లి పని సులభతరం చేసేందుకు నేనున్నాను, క్లిష్టతరం చేసేందుకు కాదు. కెప్టెన్‌కు అన్ని విధాల మద్దతు ఉంటుంది' అని బీసీసీఐ కొత్త బాస్ గంగూలీ అన్నారు. విరాట్ కోహ్లితో గురువారం మాట్లాడతాను. భారత జట్టు కెప్టెన్‌గా అతడే అత్యంత ముఖ్యమైన వ్యక్తి. అతడితో అన్ని విషయాలు మాట్లాడతాం. సాధ్యమైన అన్ని కోణాల్లోనూ మద్దతు అందిస్తాం. అన్ని విషయాలపై కెప్టెన్‌తో చర్చిస్తాం. ప్రదర్శన భారత క్రికెట్ భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది. కెప్టెన్‌గా విరాట్ కోహ్లి చెప్పేది వింటాం. నేనూ భారత్ కెప్టెన్‌గా ఉన్నాను. ఒకరి పట్ల ఒకరికి గౌరవ భావం ఉంటుంది. భిన్నమైన అభిప్రాయాలు సైతం ఉంటాయి. అంతిమంగా ఆటకు ఏది మంచి అనిపిస్తే అదే చేస్తామని గంగూలీ అన్నాడు. గత 3-4 ఏండ్లలో భారత జట్టు ప్రదర్శన అమోఘంగా ఉంది. ప్రతి సారీ ప్రపంచకప్ నెగ్గలేం. ప్రస్తుతం భారత జట్టు వరల్డ్ నం.1. జట్టు మేనేజ్‌మెంట్‌కు అవసరమైన అన్ని విధాల సహకారం బోర్డు నుంచి అందిస్తామని దాదా తెలిపారు. జాతీయ జట్టుకు ద్వంద్వ నాయకత్వం ప్రశ్నే ఉత్పన్నం కాదు (వన్డే, టీ20లకు రోహిత్ శర్మను నాయకుడిని చేయటంపై). భారత జట్టు ఇప్పుడు అన్ని ఫార్మాట్లలో అద్భుతంగా రాణిస్తోంది.

### చాంపియన్లు త్వరగా ముగించరు!



భారత క్రికెట్ దిగ్గజం ఎం.ఎస్ ధోని ప్రస్తావనకు ముగింపు దొరకటం లేదు. బీసీసీఐ అధ్యక్షుడిగా ఎన్నికైన గంగూలీని మిస్టర్ కూల్ ధోని ప్రశ్నలు వెంటాడాయి. మాజీ నాయకుడు ధోనికి గంగూలీ మద్దతు లభించింది. ' మహి మదిలో ఏముందో నాకు తెలియదు. ధోని వంటి ఆటగాడిని కలిగి ఉండటం పట్ల భారత్ ఎంతో గర్విస్తోంది. నేను బోర్డు అధ్యక్షుడిగా ఉన్నంత వరకూ అందరికీ గౌరవం ఉంటుంది. ధోని విజయాలు భారత్ గర్వపడేలా చేశాయి' అని దాదా అన్నాడు. నేను జాతీయ జట్టుకు దూరమైనప్పుడు అంతా నా పనైపోయిందని అన్నారు. కానీ నేను తిరిగి జాతీయ జట్టులోకి వచ్చాను. నాలుగేండ్లు ప్రాతినిథ్యం వహించాను. చాంపియన్లు త్వరగా ముగించరు. త్వరలోనే ధోనితో అన్ని విషయాలు మాట్లాడతానని గంగూలీ అన్నారు.



## కాషాయ వలలో పడొద్దు

బీసీసీఐ నూతన అధ్యక్షుడిగా సౌరవ్ గంగూలీ ఎన్నికయ్యాడు. 33 నెలలుగా ఎన్నికైన అధ్యక్షుడు, ఆఫీస్ బేరర్లు లేని భారత క్రికెట్ నియంత్రణ మండలి కనీవినీ ఎరుగుని సంక్షోభ కాలాన్ని చవిచూసింది. జస్టిస్ లోధా కమిటీ సిఫారసుల అమలుకు పాలకుల కమిటీ నియమితమైంది. సుప్రీంకోర్టు సంస్కరణలపై సీరియస్‌గా ఉన్నప్పటికీ.. రాష్ట్ర సంఘాలు మొండికేశాయి. దీంతో గత మూడేండ్లుగా రాష్ట్ర సంఘాలకు బీసీసీఐ నుంచి నిధులు అందలేదు. నిధులు లేకుండానే రాష్ట్ర సంఘాలు ఇంత కాలం క్రికెట్ కార్యకలాపాలను కొనసాగించాయి. భారత క్రికెట్‌ను ముందుండి నడిపించిన, భారత క్రికెట్‌ను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఏం చేయాలనే విషయాలు క్షుణ్ణంగా తెలిసిన వ్యక్తే ఇప్పుడు నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించాడు. క్రికెట్ అభిమానులతో పాటు క్రికెటర్లు సైతం భారత క్రికెట్‌కు మంచి రోజులు వచ్చాయని సంబర పడుతున్నారు. అందుకు కారణం సౌరవ్ గంగూలీ అని చెప్పనక్కర్లేదు.

జగ్‌మోహన్ దాల్మియా అండతో క్రికెట్ పరిపాలనలోకి అడుగుపెట్టిన సౌరవ్ గంగూలీ ఐదేండ్లుగా క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ (క్యాబ్)లో కొనసాగుతున్నాడు. దాల్మియా అకాల మరణంతో క్యాబ్ స్టీరింగ్ అందుకున్న గంగూలీ రాష్ట్ర సంఘం అధ్యక్షుడిగా మంచి మార్కులు సాధించాడు. జాతీయ జట్టు నాయకుడిగా, స్టార్ క్రికెటర్‌గా, క్యాబ్ అధ్యక్షుడిగా గంగూలీ ప్రస్థానం ఓ ఎత్తు. ఈ మూడు ప్రయాణాల్లో గంగూలీ వ్యక్తిగతంగా తన పంథాను చూపించాడు. సక్సెస్ సాధించాడు. ఆ నమ్మకంతోనే బీసీసీఐ అధ్యక్షుడిగా గంగూలీ విజయం సాధిస్తాడనే విశ్వాసం అందరిలో వ్యక్తమవుతోంది. కానీ బీసీసీఐ అధ్యక్షుడిగా గంగూలీ నిజంగా స్వతంత్ర్యంగా పని చేయగలడా? అనే ప్రశ్న ఉదయిస్తోంది. అందుకు కారణం, భారతీయ జనతా పార్టీ అధినాయకత్వం. బీసీసీఐ అధ్యక్ష ఎన్నికలకు ముందు బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో గంగూలీ న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. నరేంద్ర మోడీ, ఆ తర్వాత అమిత్ షా గుజరాత్ క్రికెట్ సంఘం అధ్యక్షులుగా గత దశాబ్ద కాలం పదవీలో కొనసాగారు. జస్టిస్ లోధా నిబంధనలతో అమిత్ షా ఇటీవల గుజరాత్ క్రికెట్ సంఘం నుంచి వైదొలిగారు. అయన కుమారుడు జై షా ఎటువంటి క్రికెట్ నేపథ్యం లేకుండానే బీసీసీఐలో కీలక పదవిలో పాగా వేశాడు. ఇక్కడి వరకూ బాగానే ఉన్నా.. పశ్చిమ బెంగాల్ 2021 అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం కానుంది. మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ నుంచి బయటకొచ్చిన ముకుల్ రాయ్ బీజేపీ రాష్ట్ర నాయకత్వ బాధ్యతలు అందుకున్నారు. అధినాయకత్వం విద్వేష ప్రసంగాలకు, రాష్ట్ర నాయకత్వం విధ్వంస మార్గం తోడైంది. బెంగాల్‌లో ఊహించని రీతిలో కాషాయ పార్టీ బలపడింది.

2014 లోక్‌సభ ఎన్నికల్లో 2 స్థానాలే సాధించిన బీజేపీ.. 2019లో ఏకంగా 18 స్థానాలు సొంతం చేసుకుని, ఆశ్చర్యానికి గురి చేసింది. ఇప్పుడు బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీ అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు గట్టి సవాల్ విసురుతోంది. రాష్ట్ర శాఖ అధ్యక్షుడు దిలిప్ ఘోష్ సహా కీలక నేత ముకుల్ రాయ్ మాజీ బాస్ మమతా బెనర్జీపై పైచేయి సాధించలేకపోతున్నారు. బీజేపీకి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల్లోకి చొచ్చుకెళ్లగలిగే ఓ ప్రముఖ ముఖచిత్రం అత్యవసరం. బీసీసీఐలో గంగూలీ పదవీ కాలం సరిగ్గా పది నెలలు. బోర్డులో సమర్థ పాలన అందించి అసెంబ్లీ ఎన్నికల ముంగిట ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించాలనేది గంగూలీ-షా వ్యూహంలా తెలుస్తోంది. రాజకీయ బంధంపై గంగూలీ, షా ఎటువంటి ప్రకటన చేయలేదు. కానీ కచ్చితంగా బీసీసీఐలో కాషాయ అజెండా అమలు చేసేందుకు గంగూలీని బీజేపీ ఓ పావుగా వాడుకునేందుకు సిద్ధమైందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. రాజకీయాల సంగతి పక్కన పెడితే, కనీసం భారత క్రికెట్‌లోనైనా గంగూలీ తన వ్యక్తిత్వం నిలుపుకుంటాడా? కాషాయ వ్యూహంలో భాగం అవుతాడా? కాలమే నిర్ణయించాలి.

-నవతెలంగాణ క్రీడా విభాగం

# హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆకస్మిక బదిలీ

### జైళ్ల శాఖ డీజీగా రాజీవ్‌త్రివేదీకి పోస్టింగ్

- కారణాలపై చర్చోపచర్చలు



రాజీవ్‌త్రివేదీ



హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీగా రవిగుప్తా

**నవ తెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి**

రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, సీనియర్ ఐపీఎస్ అధికారి రాజీవ్‌త్రివేదిని ప్రభుత్వం ఆకస్మికంగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీగా రాష్ట్ర పోలీసు ఐటీ, టెక్నాలజీ విభాగం అదనపు డీజీ డాక్టర్ రవిగుప్తాను నియమించింది. మంగళవారం రాత్రి పొద్దుపోయాక ఈ ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. జైళ్ల శాఖ ఇన్‌చార్జిగా ఇటీవల నియమించబడ్డ అదనపు డీజీ సందీప్‌శాండిల్య ఇకపై తనకు ఉన్న రైల్వే, రోడ్‌సేఫ్టీ అదనపు డీజీ బాధ్యతలను నిర్వహిస్తారు. కాగా డీజీపీ స్థాయి హోదా కలిగిన రాజీవ్‌త్రివేదిని ఇంత హఠాత్తుగా జైళ్ల శాఖకు సర్కారు బదిలీ చేయడం పట్ల పోలీసుశాఖలోనే విస్మయం వ్యక్తం అవుతున్నది. నిజాయితీ పరుడు, చిత్తశుద్ధితో విధినిర్వహణచేసే త్రివేదిని ఇదే ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏరికోరి హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీగా నియమించుకుంది. ఈ పోస్టులో అప్పటి నుంచి ఆయన దాదాపు ఐదేండ్ల కాలం పని చేశారు. ఈయన బదిలీని రాష్ట్ర తొలి ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పని చేసిన ప్రస్తుత పోలీసు పర్సనల్ విభాగం అదనపు డీజీ శివధర్‌రెడ్డిని ఆ సమయంలో ఆకస్మికంగా సర్కారు బదిలీ చేయడంతో పోలీసు వర్గాలు పోలుస్తున్నాయి. ఆ సమయంలో శివధర్‌రెడ్డి ఆకస్మిక బదిలీ సైతం రాష్ట్రంలో సంచలనం రేపింది. ఆయన బదిలీ వెనుక పలు ఊహాగానాలు షికార్లు కొట్టాయి. మరి రాజీవ్‌త్రివేదిని బదిలీ చేయడం వెనుక కారణాలు ఏమిటనే చర్చ అన్ని వర్గాలతో పాటు ఐపీఎస్ వర్గాలలో జోరుగా సాగుతున్నది. ప్రస్తుతం సాగుతున్న ఆర్టీసి సమ్మె గురించి రాజీవ్‌త్రివేది సర్కారుకు నచ్చని సూచన ఏదైనా చేశారా?, అది నచ్చక వెంటనే ఆయనను స్థానచలనం చేయించారా? అనే కోణంలో ఊహాగానాలు సాగుతున్నాయని తెలిసింది. అంతేగాక హోంశాఖలో తనశాఖతో పాటు పోలీసు శాఖలోని కొందరు కోరుకున్న విధంగా ఆయన నడుచుకోక పోవడం, రూల్స్ ప్రకారమే నడుస్తాననడం కూడా ఆయన బదిలీకి కారణం కావచ్చని కూడా సచివాలయ వర్గాలు అనుమానిస్తున్నాయి. 1986 బ్యాచ్‌కు చెందిన రాజీవ్‌త్రివేదికి మరో ఏడాదిన్నర కాలం సర్వీసు ఉంది. కాగా తన బదిలీ ఉత్తర్వులు అందగానే ఆయన బుధవారం చంచల్‌గూడలోని జైళ్ల శాఖ కు వెళ్లి తన నూతన బాధ్యతలను స్వీకరించారు. మరో వైపు హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీగా డాక్టర్ రవిగుప్తా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా నవతెలంగాణతో ఆయన మాట్లాడుతూ మరింత బాధ్యతయుతంగా ఈ బాధ్యతలను నిర్వహిస్తానని తెలిపారు. 1990 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన రవిగుప్తా రాష్ట్రంలో పలు కీలకమైన బాధ్యతలను నిర్వహించారు.


**కేంద్ర సర్వీసులకు అకున్ సబర్వాల్**

రాష్ట్ర ప్రొహిబిషన్ ఎక్సయిజ్ విభాగం డైరెక్టర్, ఐజీ అకున్ సబర్వాల్ కేంద్ర సర్వీసులకు డిప్యూటేషన్‌పై వెళ్లనున్నారా? అవుననే వినిపిస్తోంది. కొంత కాలం కేంద్ర సర్వీసులో పని చేయాలనే ఆసక్తితో ఉన్న ఆయన అందుకు అవసరమైన అనుమతిని కోరుతూ గతంలో ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నట్టు తెలిసింది. దానికి సంబంధించి కేంద్ర హోంశాఖ నుంచి కూడా అనుమతి లభించినట్టు సమాచారం. కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో లేదా హోంశాఖలోనో ఆయన డిప్యూటేషన్‌పై విధులను నిర్వహించనున్నారని సమాచారం.

## గంజాయి విక్రయ ముఠా అరెస్ట్

### 80కేజీల గంజాయి పట్టివేత

- నలుగురికి రిమాండ్



**నవతెలంగాణ - నేరేడ్‌మెట్**

గంజాయి విక్రయ ముఠాను రాచకొండ ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. రాచకొండ కమిషనరేట్‌లో రాచకొండ సీపీ మహేశ్ భగవత్ బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లాకు చెందిన గంగులోతు సైదానాయక్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే జిల్లాకు చెందిన అతని స్నేహితులు లావుడ్యా అనిల్, లకావత్ వినోద్, లకావత్ ఉషెన్‌తో కలిసి గ్రూపుగా ఏర్పడ్డారు. విశాఖపట్నం జిల్లా కొత్తూరులో నివాసముంటున్న శివ వద్ద కేజీ గంజాయి రూ.2వేలకు కొనుగోలు చేసి నిజామాబాద్, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో కేజీ రూ.7వేల చొప్పున అమ్ముతున్నారు. పక్క రాష్ట్రం ఏపీ నుంచి గంజాయిని సుజుకీ షిఫ్ట్ డిజైర్ కారులో తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందడంతో మీర్‌పేట పీఎస్ పరిధిలోని గాయిత్రినగర్‌లో ఎస్‌ఓటీ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. టీ/ఆర్ 11ఎక్స్ 6281 కారు డిక్కీ, సీట్ల కింద 80కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని అరెస్టు చేసి విచారించగా, ఐదు నెలల నుంచి విశాఖపట్నం జిల్లాలోని శివ దగ్గర గంజాయిని కొంటున్నట్టు తెలిపారు. వారి సమాచారం మేరకు పోలీసులు శివ గ్రామానికి వెళ్లగా అతడు పరారయ్యాడు. నిందితుల నుంచి 80 కేజీల గంజాయి, మారుతి షిఫ్ట్ కారు, రూ.4,200, 4సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. శివను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దిగారు. నిందితులపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. సమావేశంలో డీసీపీ సన్‌ప్రీత్‌సింగ్, అడిషనల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్‌రెడ్డి, ఎస్‌ఓటీ టీం రవికుమార్, యాదయ్య, రాజు ఉన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.

epaper.navatelangana.com